మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA

శుక్రవారం FRIDAY
29.8.2025

హైదరాబాద్ HYDERABAD

సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 84 || వెల (Price) రూ.6.50

పేజీలు: 12+4 Pages: 12+4

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

• గాలిలో సీఎం..

హెలికాప్టర్ ద్వారా వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి ఉత్తమ్

వరద నీటిలో మునిగిన కామారెడ్డి పట్టణం ఏరియల్ వ్యూ

• గ్రౌండ్‌లో కేటీఆర్...



గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించి, గంభీరావుపేట మండలం నర్మాలలో వాగులో గల్లంతైన నాగయ్య కుటుంబాన్ని ఓదార్చుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జల విలయం

వర్ష బీభత్సంతో గజగజ వణికిన ఉత్తరతెలంగాణ

నలుగురి దుర్మరణం
మరో ఆరుగురు గల్లంతు

కామారెడ్డిలో క్లౌడ్‌బరస్ట్.. 48 గంటల్లో 65 సెం.మీ వాన

మెదక్ అతలాకుతలం.. జలదిగ్బంధంలో సిద్దిపేట, నిర్మల్

50 ఏండ్లలో రికార్డు వాన.. ధ్వంసమైన రోడ్లు, నివాసాలు

వరదతో విలవిల్లాడిన జనం.. సహాయం కోసం ఆర్తనాదాలు

మూడ్రోజులు భారీ వర్షాలు

13 జిల్లాల్లో నేడు, రేపు స్కూళ్లకు **సెలవు**

కనీవినీ ఎరగని వానలతో కామారెడ్డి పట్టణం కకావికలం

నీట మునిగిన కాలనీలు.. 12 అడుగుల మట్టంతో వరద

హైదరాబాద్, నాగ్‌పూర్‌కు రాకపోకలు బంద్.. రైళ్లు రద్దు

అన్నదాతకు అపార నష్టం.. కొట్టుకుపోయిన వరి, పత్తి

117 చెరువులకు గండ్లు.. ప్రమాదంలో పోచారం ప్రాజెక్ట్

సకాలంలో స్పందించని ప్రభుత్వం.. బాధితుల తిట్ల వర్షం

సహాయ చర్యల్లో పాల్గొనండి.. శ్రేణులకు కేసీఆర్ పిలుపు

ప్రజల గోడు పట్టకుండా నీరోలా రేవంత్ సర్కారు: కేటీఆర్

సర్కారు తీసుకున్న చర్యలేవి?.. నివేదిక ఇవ్వాలన్న హైకోర్టు

మొగులు పగిలింది. ఆకాశం బద్దలైంది. కనీవినీ ఎరగని రీతిలో కురిసిన కుంభవృష్టి వానకు కామారెడ్డి కకావికలమైంది. భీకరవర్షాలతో వరద ముంచెత్తింది. ఉత్తర తెలంగాణ చిగురుటాకులా వణికింది. రోడ్లు కొట్టుకుపోయాయి. ఇండ్లు నీటమునిగాయి. కాలనీల్లో నీళ్లు! కండ్లల్లో కన్నీళ్లు! మెదక్ నుంచి నిర్మల్ దాకా, మంజీర నుంచి మానేరు దాకా అన్నిచోట్లా అదే వరద బీభత్స దృశ్యం. ఇంత జరిగినా.. యూరియా గోస పట్టనట్టే వరద యాతన కూడా సర్కారుకు పట్టలేదు. సమస్యను వదిలేసి, సహాయ చర్యలు గాలికొదిలి.. ఇతర అంశాలపై సమీక్షలతోనే సరిపెట్టింది.

పోచారం జలాశయం ప్రమాదం అంచుకు చేరింది. వరద ప్రవాహ ఉధృతికి మట్టి కొట్టుకుపోయి తేలిన ఆనకట్ట అంతర్భాగం

హైదరాబాద్/సిద్దిపేట/ మెదక్/నిజామాబాద్/నిర్మల్/ ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : భీకర వర్షాలతో రాష్ట్రం వణికిపోతున్నది. బుధ, గురువారాల్లో కురిసిన అతి భారీ వానలకు కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. నిర్మల్, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల జిల్లాల్లో వర్షం తీవ్ర ప్రభావం చూపింది. వాగులు, వంకలు పోటెత్తి.. చెరువులు తెగిపోయి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు, వంతెనలు, రైల్వే లైన్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. లక్షలాది ఎకరాల్లో పంట నీట మునిగిపోయింది. వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయి రాకపోకలు › 3వ పేజీలో

రెండ్రోజులుగా ముంచెత్తిన వరద ఉధృతికి కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలో తీవ్రంగా ధ్వంసమైన బోధన్-హైదరాబాద్ ప్రధాన రహదారి

సిద్దిపేటలో జలదిగ్బంధంలో చిక్కుకున్న దవాఖాన నుంచి పేషంట్లను తరలిస్తున్న దృశ్యం

వాగ్దానాలను మర్చిపోరు..
మరయితే పాలసీ ప్రీమియంని ఎందుకు మర్చిపోవాలి?

ఎల్ఐసి ఆఫ్ ఇండియా సమర్పిస్తోంది వడ్డీలో రాయితీతో కూడిన స్పెషల్ రివైవల్ క్యాంపెయిన్

18/08/2025 నుండి 17/10/2025 వరకు

త్వరపడండి! ఈ అవకాశం పోగొట్టుకోవద్దు.

మీ బీమా సురక్షతని తిరిగి తెచ్చుకునే మరియు దాని ప్రయోజనాన్ని నిరంతరంగా పొందుతూ ఉండేందుకు అవకాశం

మొత్తం చెల్లించవలసిన ప్రీమియం	వడ్డీలో రాయితీ %	రాయితీలో గరిష్ట పరిమితి*
₹1,00,000 వరకు	30%	₹3000
1,00,001 నుండి 3,00,000 వరకు	30%	₹4000
3,00,001 కన్నా ఎక్కువ	30%	₹5000

*షరతులు, నిబంధనలు వర్తిస్తాయి
ప్రీమియం బకాయి పడిన తేదీ నుండి 5 సంవత్సరాలలోగా పాలసీ మళ్లీ రివైవ్ చేయవచ్చును.
దయచేసి, మీకు దగ్గరలో ఉన్న ఎల్ఐసి బ్రాంచి లేదా ఏజెంట్‌ని సంప్రదించండి, మాతో అనుసంధానమై ఉండండి. మీ పాలసీలో మీ మొబైల్ నంబరు, ఈమెయిల్, ఎన్ఈఎఫ్‌టి మరియు పాన్ నంబరు అప్‌డేట్ చెయ్యండి.

డౌన్ లోడ్ చేసుకోండి ఎల్ఐసి మొబైల్ యాప్ LIC digital | సందర్శించండి:licindia.in | కాల్ సెంటర్ సర్వీసు (022) 6827 6827 | IRDAI Regn No.: 512

వివరాలకై, మీ ఏజెంటుని/ దగ్గరలో ఉన్న ఎల్ఐసి బ్రాంచిని సంప్రదించండి లేదా మీ నగరం పేరుని 56767474కి SMS చెయ్యండి.

మమ్మల్ని ఇక్కడ అనుసరించండి LIC India Forever | మా వాట్సాప్ నం. 8976862090 'Hi' చెప్పండి

నకిలీ ఫోన్ కాల్స్ మరియు కల్పితమైన/మోసంతో కూడిన ఆఫర్ల గురించి జాగ్రత్తగా ఉండండి. ఐఆర్‌డిఏఐ, ఇన్సూరెన్స్ పాలసీల అమ్మకం, బోనస్ ప్రకటనలు లేదా ప్రీమియంల పెట్టుబడి వంటి కార్యకలాపాలలో ప్రమేయం కల్పించుకోదు. అటువంటి కాల్స్ పొందుతున్న ప్రజలు పోలీసులకి ఫిర్యాదు చెయ్యాలని అభ్యర్థిస్తున్నాము. రిస్క్ ఫ్యాక్టర్లు, షరతులు మరియు నిబంధనల గురించిన మరిన్ని వివరాలకై, ఒక అమ్మకాన్ని ముగించే ముందు దయచేసి సేల్స్ బ్రోచర్‌ను జాగ్రత్తగా చదవండి.

LIC లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా LIFE INSURANCE CORPORATION OF INDIA

ప్రతి క్షణం మీకు తోడుగా

LIC / MI / 2025-26 / 15 / Tel

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించండి

12 ఏండ్ల వివాదానికి హైకోర్టు తెర › 8

NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE | Vencobb CHICKEN | Suggested Today's Eggs & Broiler Chicken Hyderabad Zone Rates

12 Eggs Retail Rate	Ex Farm Live Bird kg	Dressed with Skin kg
	92	165
	Retail Live Bird kg	Skin Less kg
₹ 72	114	188

Conditions Apply
Issued in the interest of consumers

మిత్తి చారాణా బద్నాం బారాణా

కాంగ్రెస్ తప్పుడు ప్రచారం పటాపంచలు

రుణాలకు చెల్లిస్తున్న వడ్డీపై ఇన్నాళ్లు రేవంత్‌రెడ్డి అసత్యాలు

నెలకు 6,500 కోట్లంటూ అబద్ధం.. కట్టేది 2,338 కోట్లే

'కాగ్'కు సర్కారు ఇచ్చిన గణాంకాలే అందుకు సాక్ష్యం › 8

కాంగ్రెస్ పాలనలో తీవ్ర అనిశ్చితిలోకి తెలంగాణ ఆర్థికం

బడ్జెట్ రాబడి అంచనాల్లో 4 నెలల్లో వచ్చింది 21 శాతమే

వార్షిక అంచనాల్లో ఇప్పటికే 45 శాతం దాటిన అప్పు

కేంద్రంతో ఘర్షణ నిజమే

వారితో గొడవలు లేవు

మావి సలహాలు మాత్రమే..

తుదినిర్ణయం బీజేపీదే › 10

కేంద్రంతో సంబంధాలపై ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్

బుధవారం కురిసిన భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో నీట మునిగిన ఓ కాలనీ

నిర్మల్ పట్టణ శివారులోని విశ్వనాథ్‌పేట్ సమీపంలో కోతకు గురైన నిర్మల్– ఆదిలాబాద్ పాత హైవే

జలదిగ్బంధం

వానల ధాటికి పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తం

నీటమునిగిన కామారెడ్డి

“పలు జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. కామారెడ్డి జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. రోడ్లు దెబ్బతినడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇండ్లతో పాటు విద్యాసంస్థలు నీటమునిగాయి. లక్షలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. ఆయా చోట్ల ఇండ్ల నుంచి బయటకు రాలేక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. లోతట్టు ప్రాంతాల్లోకి వరద పోటెత్తడంతో అత్యవసర పరిస్థితుల్లో కూడా బయటకు రాలేక అల్లాడిపోయారు. ప్రభుత్వం నుంచి సాయం కోసం అంతా ఎదురు చూశారు.”

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరంపల్లిలో ఎస్టీ గురుకుల పాఠశాలలో చిక్కుకున్న విద్యార్థులను తరలిస్తున్న సహాయ బృందాలు

కామారెడ్డి హౌసింగ్‌బోర్డు వద్ద కొట్టుకుపోయిన లారీ

ములుగు జిల్లాలోని పస్రా–తాడ్వాయి మధ్యలోని మండల తోగు వద్ద కోతకు గురైన 163 జాతీయ రహదారి

కామారెడ్డి హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద కోతకు గురైన పాత హైదరాబాద్ రహదారి

సిద్దిపేట జిల్లాలో నీట మునిగిన కాలనీ

మెదక్ జిల్లా హవేళీఘన్‌పూర్ మండలం రాజ్‌పేట్‌తండా వద్ద పొలంలో దొరికిన సత్యనారాయణ మృతదేహం

ఎక్స్‌కవేటర్ సాయంతో ఒడ్డుకు నిండు గర్భిణి

రాయికల్, ఆగస్టు 28: పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ నిండు గర్భిణినిఎక్స్‌కవేటర్ సాయంతో అవతలి ఒడ్డుకు చేర్చారు. జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఒడ్డెలింగాపూర్ పరిధిలోని మాంగ్యానాయక్ తండాకు చెందిన గుగ్లావత్ కళ్యాణికి గురువారం సాయంత్రం పురిటినొప్పులు ఎక్కువ కావడంతో కుటుంబ సభ్యు లు ఆమెను తీసుకొని జగిత్యాలకు బయలుదేరారు. మార్గమధ్యలో భూపతిపూర్–రామాజీపేట గ్రామాల మధ్య వంతెనపై నీటి ఉధృతి తీవ్రంగా ఉండటంతో అవతలి వైపే ఆగిపోయారు. దీంతో విషయం తెలుసుకున్న రామాజీపేట గ్రామానికి చెందిన యువకులు ఎక్స్‌కవేటర్ సాయంతో గర్భిణిని అవతలి ఒడ్డుకు చేర్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో దవాఖానకు తరలించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో మోరంచవాగు ఉధృతికి నీట మునిగిన పంట పొలాలు

మెదక్ జిల్లా నిజాంపేట మండలం నందిగామ గ్రామంలో పౌల్ట్రీ ఫామ్‌లోకి చేరిన వరదతో చనిపోయిన కోళ్లను చూపిస్తున్న యజమాని

నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం గడ్కోల్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను చుట్టుముట్టిన వరద

నిర్మల్ జిల్లాలో నీట మునిగిన ఓ పాఠశాల



కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి శివారులో కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్

సిద్దిపేట జిల్లాకేంద్రంలో వరదకు కొట్టుకుపోతున్న కారు

సంగారెడ్డి జిల్లా మనూరు గ్రామంలోని పత్తిచేనులో భారీగా చేరిన వర్షపునీరు

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఓ దుకాణంలోకి చేరిన వరద

కామారెడ్డిజిల్లా కేంద్రంలో ఓ ఇంట్లోకి చేరిన బురద

ముథోల్ ఎంజేబీలోకి వరద చేరడంతో ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

భారీ వరద నష్టంపై కేసీఆర్ ఆందోళన

- ప్రభావిత ప్రాంతాల నాయకులతో ఆరా
- పార్టీ శ్రేణులు, నేతలు సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలని కేటీఆర్‌కు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా వరద ముంచెత్తిన ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. వరద ప్రభావిత ప్రాంతాలైన, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, నిర్మల్, సిరిసిల్ల తదితర జిల్లాలకు చెందిన పార్టీ నాయకులతో మాట్లాడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. సర్కారు అందజేస్తున్న సహాయక చర్యలపై ఆరాతీశారు. అనేక చోట్ల కాలనీలు నీటమునగి నివాసాల్లోకి వరద చేరి, రోడ్లు తెగిపోయి రవాణా వ్యవస్థ సంభించి ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని తెలుసుకొని దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు వెంటనే సహాయక చర్యల్లో పాలుపంచుకొనేలా చూడాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదేశించారు. బాధితులకు అందుబాటులో ఉండాలని నిర్దేశించారు. అవసరం మేరకు తాగునీరు, ఆహారం, దుస్తులు, వంట సరుకులు అందించి అండగా నిలవాలని సూచించారు. నష్ట తీవ్రతను వెంటవెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లి బాధితులకు అండగా ఉండాలని కోరారు.

వినాయకుడికి పూజలు

ఎర్రవెల్లిలోని నివాసంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం వినాయక చవితిని ఘనంగా జరుపుకొన్నారు. కేసీఆర్-శోభమ్మ దంపతులు గణపతి పూజ చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆదిదేవుడిని వేడుకున్నారు. ప్రజలందరూ నవరాత్రి ఉత్సవాలను మతసామరస్యం, భక్తిభావంతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వరదల్లో నలుగురి మృతి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్ : భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా నలుగురు మరణించారు. మరో ఆరుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం రాజ్‌పేటకు చెందిన సత్యనారాయణ, యాదగౌడ్ అనే ఇద్దరు వ్యక్తులు ఆటోలో మెదక్ వెళ్తుండగా మార్గమధ్యంలో నక్కవాగు దాటుతున్న క్రమంలో వరద ఉధృతి ఎక్కువై ఆటోతోపాటు కొట్టుకుపోయారు. కరెంటు స్తంభాన్ని పట్టుకుని కాపాడాలని వేడుకున్నారు. వరద ఉధృతి మరింత పెరగడంతో కరెంటు స్తంభం కూడా కొట్టుకుపోవటంతో వారు మరణించారు. కామారెడ్డి జిల్లా రాజంపేటలో గోడ కూలి యువకుడు మృతిచెందాడు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం మొరిగూడకు చెందిన గంగాధర్(26) కూలికి వెళ్లి తిరిగి వస్తూ కాలువలో పడి మరణించాడు. కాగా వికారాబాద్ జిల్లాలోని కోటపల్లి వాగులో ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో ఒకరు గల్లంతయ్యారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని ఎస్సారెస్పీ కాలువలో ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ వ్యక్తి కొట్టుకుపోయాడు. కామారెడ్డిలోని సరంపల్లి ఎస్టీ గురుకుల పాఠశాలలో చిక్కుకున్న వందమంది విద్యార్థులను అధికారులు కాపాడారు.

జల విలయం

మొదటిపేజీ తరువాయి...

స్తంభించిపోయాయి. వందలాది గ్రామాలు జలదిగ్బధంలో చిక్కుకున్నాయి. కరెంటు సరఫరా నిలిచిపోయి అంధకారంలో మగ్గుతున్నాయి. భారీ వరదలకు పదిమందికిపైగా గల్లంతైనట్టు తెలిసింది.

కామారెడ్డి కకావికలం

కనీవినీ ఎరగని రీతిలో ఏకధాటి వానలతో కామారెడ్డి పట్టం కకావికలమైంది. జిల్లా కేంద్రంలోని వందలాది కాలనీలు నీటి మునిగాయి. కాలు బయట పెట్టే పరిస్థితి లేక దాదాపుగా 40 గంటల పాటు ప్రజలు ఇండ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. పట్టణంలో 12 అడుగుల ఎత్తుతో వరద ప్రవహించడంతో ఎన్జీవో, జీఆర్ కాలనీలు భయానక పరిస్థితిలో కొట్టుమిట్టాడాయి. కామారెడ్డి శివారు ప్రాంతంలో పంట పొలాల మీదుగా తన్నుకు వచ్చిన వరద అంతకంతకూ పెరిగి భవనాలను ముంచెత్తుతూ ముందుకు సాగింది. కామారెడ్డి పెద్ద చెరువు ఎన్నడూ లేని విధంగా అలుగు దుంకడంతో సమీప ప్రాంతాల నివాసితులు ప్రాణభయంతో వణికిపోయారు. పదుల సంఖ్యలో వాహనాలు కొట్టుకు పోయాయి. రోడ్ల వెంట నిలిచి ఉంచిన లారీలు, భారీ వాహనాలు వరద ధాటికి చెల్లాచెదురయ్యాయి. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత నివాసాలు బురదతో నిండిపోయాయి. రోడ్లు నామ రూపాల్లేకుండా పోయాయి. గ్రామాలు, తండాలు జలాదిగ్బంధంలో చిక్కుకున్నాయి. భవానిపేట శివారులో ఎర్రగుంట వద్ద చెక్ డ్యామ్ కొట్టుకుపోయి గ్రామాన్ని తాకుతూ పెద్ద వాగు ప్రమాదకరంగా ప్రవహించింది. ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్ మార్గంలో చెరువు తెగి రాకపోకలు బందయ్యాయి. నాగిరెడ్డిపేట మండలం నడిమితండాలో గిరిజనులు బుధవారం వరదలో చిక్కుకొని ఆర్తనాదాలు చేశారు. కామారెడ్డి మండలం లింగాయిపల్లి శివారులో వరదలో నలుగురు, చిన్నమల్లారెడ్డి చెరువు వద్ద ముగ్గురు చిక్కుకోగా రక్షణ దళాలు కపాడాయి. కామారెడ్డి నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లే మార్గంలో పాల్వంచ వాగు ఉగ్రరూపం దాల్చి రాకపోకలు నిలిచిపోయాయి. బొగ్గు గుడిసె సమీపంలో ఎన్‌హెచ్ పనులు చేస్తున్న 8 మంది బీహార్ కూలీలు, గున్కుల్‌లో కోళ్ల ఫారంలో ముగ్గురు చిక్కుకోగా రక్షణ దళాలు కాపాడాయి. రాజంపేటలో గోడ కూలి ల్యాబ్ టెక్నిషియన్ చనిపోయాడు. జిల్లా వ్యాప్తంగా 36కు పైగా చెరువులు తెగినట్టు ఇరిగేషన్ శాఖ ప్రకటించింది. మంజీరా ఉగ్రరూపం, నిజాంసాగర్ గేట్లు ఎత్తి దిగువకు లక్షన్నర క్యూసెక్కులు వదలడంతో దిగువన అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయి.

ఎన్‌హెచ్ 44, రైల్వే ట్రాక్ ధ్వంసం

కామారెడ్డిలో కురిసిన అత్యంత భారీ వర్షానికి ఎన్‌హెచ్ 44 నామరూపాల్లేకుండా కొట్టుకుపోయింది. భిక్కనూర్ మండలం జంగంపల్లి వద్ద రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డు మధ్యలో 20 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. బుధవారం ఉదయం నుంచే హైవేపై వరద పెరగడంతో పోలీసులు వాహనాలను నియంత్రించారు. వెనక్కి వెళ్లలేక, ముందుకు కదల్లేక గంటల కొద్దీ వాహనదారులు నరకయాతన పడ్డారు. భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లి శివారులో భిక్కనూర్ - తలమడ్ల రైల్వే స్టేషన్ మధ్య వరద ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకు పోయింది. 10 మీటర్ల పొడవునా పట్టాలు తెగిపోవడంతో రైళ్ల పోకలను సౌత్ సెంట్రల్ రైల్వే నిలువరించింది. బుధవారం పలు రైళ్లను రద్దు చేయగా గురువారం నుంచి మహారాష్ట్రకు వెళ్లే రైళ్లను దారి మళ్లిస్తున్నారు.

నిర్మల్ జల దిగ్బంధం

నిర్మల్ పట్టణంలోని చాలా కాలనీలు నీట మునిగాయి. జీఎన్‌ఆర్ కాలనీవాసులు ఇండ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారు. కుంటాల మండలం జలదిగ్బంధంలో చిక్కుకున్నది. నిర్మల్ పట్టణం, మండలంలో అత్యధికంగా 33 సెంటీమీటర్ల రికార్డుస్థాయి వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు ఉప్పొంగి చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు కొట్టుకుపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే పాత జాతీయ రహదారి పూర్తిగా కొట్టుకుపోయింది. బాసర మండలం బిద్రెల్లి వద్ద వాగు ఉధృతికి భైంసా -నిజామాబాద్ వైపు రాకపోకలు నిలిచిపోయాయి. మునిపెల్లిలో పశువుల కాపరి వాగులో చిక్కుకుపోగా ఎన్డీఆర్‌ఎఫ్ బృందం కాపాడింది. వరద పోటెత్తడంతో కడెం, స్వర్ణ, గడ్డెన్న వాగు ప్రాజెక్టు గేట్లను ఎత్తివేశారు.

మెదక్ అతలాకుతలం

మెదక్ జిల్లాలో 40 ఏండ్లలో ఎన్నడూ పడని విధంగా బుధవారం భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు, చెరువులు, ప్రాజెక్టులు ఉప్పొంగాయి. జిల్లాలోని దూప్‌సింగ్ తండా రెండు రోజులుగా జలదిగ్బంధంలో చిక్కుకున్నది. హవేళీ ఘనపూర్ మండలం రాజ్‌పేటకు చెందిన సత్యానారాయణ, యాదగౌడ్ ఇద్దరూ ఆటోల్లో మెదక్‌లో ఉన్న వాళ్ల పిల్లలను తీసుకొచ్చేందుకు బయలుదేరగా, మార్గమధ్యలో నక్కవాగు దాటుతూ వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. వీరిద్దరూ కరెంటు స్తంభాన్ని పట్టుకొని నాలుగు గంటల పాటు తమను కాపాడాలని వేడుకున్నారు. జిల్లా యంత్రాంగానికి సమాచారం ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వరద ఉధృతి మరింత పెరిగి కరెంటు స్తంభం కొట్టుకుపోవడంతో చనిపోయారు. నిజాంసాగర్ గేట్లు ఎత్తి వరదను వదలకపోవడంతో అనేక గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. వాడి నుంచి రాజపేట వరకు మార్గమధ్యలో రోడ్లు ధ్వంసమయ్యాయి. కరెంటు స్తంభాలు విరిగి రోడ్లపై పడ్డాయి. రెండు రోజులుగా హవేళీఘన్‌పూర్ మండలంలో ఐదు గ్రామాలకు విద్యుత్తు, తాగునీటి సరఫరా నిలిచిపోయింది. రేగోడ్ మండలం మర్పల్లిలో బండి హరికృష్ణ(22) మంగళవారం చనిపోగా బుధవారం అంత్యక్రియలకు గొల్ల వాగు దాటే వీలు లేక ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ సాయంతో అంత్యక్రియలు చేశారు. మెదక్-శమ్నాపూర్ వద్ద రైల్వే ట్రాక్ కుంగిపోయింది.

చిగురుటాకులా సిద్దిపేట

కుండపోత వర్షానికి సిద్దిపేట జిల్లా కేంద్రం చిగురుటాకులా వణికిపోయింది. పలు కాలనీలు నీట మునిగాయి.కొత్త బస్టాండ్ నుంచి మోడ్రన్ బస్టాండ్ మధ్య రోడ్డు వెంబడి బ్రిడ్జిపైన నీరు చేరి రాకపోకలు స్తంభించిపోయాయి. కోమటి చెరువు ఉధృతికి శ్రీనగర్ కాలనీ, శ్రీనివాస నగర్ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి. సీతారామాంజనేయ థియేటర్ వద్ద రోడ్డుపై నీళ్లు చేరి ప్రజలు ఈత కొట్టుకుంటూ రోడ్డు దాటారు. చిన్ననిజాంపేటకు చెందిన రైతులు రాజు, గోపాల్, సుదర్శన్ వ్యవసాయ పనులకు వెళ్లి చెరువు ఉధృతికి చిక్కుకుపోయి రాత్రంతా అక్కడే ఉండగా గురువారం ఉదయం ఎన్డీఆర్‌ఎఫ్ బృందం రక్షించింది.

రైతులను రక్షించిన ఆర్మీ హెలికాప్టర్

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో ఆర్మీ హెలికాప్టర్ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టింది. నర్మాలలో మానేరువాగు ప్రవాహంలో చిక్కుకున్న ఐదుగురు రైతులను ఆర్మీ హెలికాప్టర్ ద్వారా రక్షించారు. వీరు బుధవారం మధ్యాహ్నం పశువులను మేపేందుకు వెళ్లి వాగులో చిక్కుకొని ఎత్తయిన గడ్డమీద ఉండిపోగా డ్రోన్ ద్వారా అధికారులు ఆహారం అందించారు.

రికార్డు స్థాయి వర్షపాతం

కామారెడ్డి జిల్లాలో గడిచిన 48 గంటల్లో 65 సెం.మీ ఆల్‌టైమ్ రికార్డ్ వర్షపాతం నమోదైంది. బుధవారం రాత్రి 49.48 సెం.మీ, గురువారం మరో 16 సెం.మీ వర్షం కురిసింది. రెండు రోజులుగా కామారెడ్డి, మెదక్, నిర్మల్ జిల్లాల్లో సగటున 60 సెం.మీకు పైగా వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లా రాజాంపేటలో రికార్డు స్థాయిలో 49.48 సెం.మీ, ఇదే జిల్లా నాగారెడ్డిపేటలో 33.54 సెం.మీ, కామారెడ్డిలో 33.51 సెం.మీ, నిర్మల్ జిల్లా నిర్మల్ రూరల్‌లో 33.28, కామారెడ్డి భిక్కనూర్‌లో 32.98, సదాశివ నగర్ 31.98, లింగంపేట 31.64, తాడ్వాయి 31.47 సెం.మీ చొప్పున నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది.

వర్షపాతం వివరాలు

జిల్లా	మండలం	వర్షపాతం (సెం.మీ)
కామారెడ్డి	రాజాంపేట	49.48
కామారెడ్డి	నాగారెడ్డిపేట	33.54
కామారెడ్డి	కామారెడ్డి	33.51
నిర్మల్	నిర్మల్	33.28
కామారెడ్డి	భిక్కనూర్	32.98
కామారెడ్డి	సదాశివనగర్	31.98
కామారెడ్డి	లింగంపేట	31.64
కామారెడ్డి	తాడ్వాయి	31.47
నిర్మల్	నిర్మల్ రూరల్	29.92
మెదక్	హవేలిఘన్‌పూర్	28.82
కామారెడ్డి	రామారెడ్డి	28.50
కామారెడ్డి	దోమకొండ	25.48
కామారెడ్డి	ఎల్లారెడ్డి	24.94
నిర్మల్	లక్ష్మణ్‌చందా	22.45
కామారెడ్డి	మాచారెడ్డి	21.86
కరీంనగర్	తిమ్మాపూర్	21.64
మెదక్	పాపన్నపేట్	21.06
సిద్దిపేట	కొమురవెల్లి	20.64
మెదక్	రామాయంపేట	20.23
సిద్దిపేట	దౌలతాబాద్	20.06

జూన్‌లో 20 శాతం లోటు వర్షపాతం నమోదైనా జూలై, ఆగస్టులో కురిసిన భారీ వర్షాలతో ఈ సీజన్‌లో 25 శాతం అధిక వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 130.3 మిల్లీమీటర్లు కురవాల్సి ఉండగా 104.2 మి.మీ మాత్రమే కురిసింది. జూలైలో సగటు వర్షపాతం 227.4 మి.మీకి గాను 237.9 మి.మీ కురిసింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 215.8 మి.మీ కాగా గురువారం నాటికే 349.6 మి.మీ నమోదైంది. ఇది సాధారణం కంటే 80 శాతం, నిరుడితో పోలిస్తే 102 శాతం అధికమని వాతావరణ శాఖ వెల్లడించింది. భారీ వర్షాలతో సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగింది. గనుల్లో వాహనాలు నిలిచిపోయాయి.

మరో 3 రోజులు భారీ వర్షాలు..

అల్పపీడన ప్రభావానికి తోడు ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణి ప్రభావంతో మరో 3 రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. శుక్రవారం ఆదిలాబాద్, కొమురంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.శనివారం కొమురంభీం-ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్-భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి-కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, హైదరాబాద్, యాదాద్రి-భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో బలమైన గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది.

5 లక్షల ఎకరాల్లో పంట నష్టం

వరదలకు కొట్టుకుపోయిన వరి, పత్తి పంటలు

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): వర్ష బీభత్సం అన్నదాతకు అపారనష్టాన్ని మిగిల్చింది. ఎక్కడికక్కడ వరదనీటిలో పంటలు కొట్టుకుపోయాయి. పలు చోట్ల పంటపొలాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి, పత్తి, మక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5 లక్షల ఎకరాల్లోని పంటలకు నష్టం జరిగినట్టు తెలుస్తున్నది. దీంతో వేలాది మంది రైతులకు తీరని నష్టం మిగిలింది. మంగళ, బుధవారాల్లో కురిసన భారీ వర్షాలకు కామారెడ్డి, నిర్మల్, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగింది. మిగతా జిల్లాల్లోనూ పంటలకు నష్టం తప్పలేదు. భారీ వర్షాలతో చెరువులు, కుంటలు పొంగిపొర్లాయి. కొన్ని చోట్ల కట్టలు తెగిపోవడంతో ఆ నీళ్లన్నీ పంట పొలాల గుండా భారీ వరదలు ప్రవహించడంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. పొలాల్లోనే నీళ్లు నిలవడంతో పంటలు మురిగిపోయే పరిస్థితి ఏర్పడింది. కామారెడ్డి, నిర్మల్, సిద్దిపేట జిల్లాల్లో ఎక్కువ మొత్తంలో పంటలు నామారూపాల్లేకుండా పోయాయి. ఎక్కడ చూసినా పంటపొలాల్లో నీళ్లు, ఇసుక దిబ్బలే కనిపిస్తున్నాయి.

పత్తి దిగుబడిపై పెద్ద దెబ్బ

ఈ వర్షాలు పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపనున్నది. భారీ వరదలకు చాలాచోట్ల పంట కొట్టుకుపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పూతకొచ్చిన పత్తి పాడైపోతున్నది. మిగిలిన పంట చేలల్లో రోజుల తరబడి వర్షపు నీరు నిలిచి, పత్తి ఎర్రబారి దిగుబడి తగ్గుతుంది. వర్షాలు మరికొన్నిరోజులు వస్తే పంటపై గులాబీ పురుగు సోకే ప్రమాదం ఉన్నదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఓవైపు వర్షాలు, మరోవైపు గులాబీ పురుగుతో పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నదని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీ వర్షాలతో పంటలు అతలాకుతలం కావడంతో నష్టాలపాలైన రైతులు ఆవేదనలో కుంగిపోతుంటే, పంటనష్టం అంచనా వేయడంలో సర్కారు కనీస చొరవ తీసుకోలేదు. ఇప్పటివరకు వ్యవసాయ శాఖ పంటనష్టం అంచనాలు వేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకోసం క్షేత్రస్థాయి అధికారులకు ఎలాంటి ఆదేశాలూ వెళ్లలేదని తెలిసింది.

నీటమునిగిన 100 ఎకరాల వరి

నిర్మల్ జిల్లాలోని నిర్మల్ మండలం ముజ్గి, తాంశ, చిట్యాల్ మంజులాపూర్ శివారులో దాదాపు 100 ఎకరాల వరకు వరిపంట నీట మునిగింది. అలాగే సోన్ మండలం కడ్తాల్‌లో స్వర్ణ వాగు ఉప్పొంగడంతో పొలాల్లోకి భారీగా వరద నీరు చేరుకున్నది. కుంటాల మండలంలోని వెంకూర్ శివారులో పత్తి, సోయా పంటలు పూర్తిగా నీట మునిగాయి. జిల్లాలో చాలాచోట్ల వరితోపాటు, పత్తి, సోయా, మక్క పంటలు నీట మునిగాయి.

రోడ్లు ధ్వంసమై పంటపొలాలు మునక

ములుగు, జయశంకర్-భూపాలపల్లి జిల్లాల్లో పలుచోట్ల రోడ్లు ధ్వంసమై వరద నీటితో వందలాది ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. పలు చెరువులు మత్తళ్లు పడుతున్నాయి. భూపాలపల్లి జిల్లాలోని మోరంచవాగు 1వ ప్రమాదపు సూచికలో ప్రవహిస్తున్నది. దాని పరీవాహక ప్రాంత పంట పొలాలన్నీ వరదనీటిలోనే మునిగాయి. గణపురం మండలం అప్పయ్యపల్లి, నగరంపల్లి మధ్యన ఉన్న ముసళ్లకుంటకు గండిపడింది. పలిమెల మండలం లెంకలగడ్డలో వేసిన ఎకరం మిరపనారు కొట్టుకుపోయింది. ఖమ్మం జిల్లాలోని బేతుపల్లి పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి అలుగు పారుతుండటంతో దానికింద పంట పొలాలన్నీ పూర్తిగా నీట మునిగాయి.

ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,686 ఎకరాల్లో నష్టం

ఉమ్మడి మెదక్ జిల్లాలో 15,686 ఎకరాల్లో పంటల నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. సంగారెడ్డి జిల్లాలో 2,000 ఎకరాలు, మెదక్ జిల్లాలో 6,341 ఎకరాలు, సిద్దిపేట జిల్లాలో 7,345 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. చిన్నశంకరంపేట శివారులో పంటపొలాలు పూర్తిగా నీట ముగినిగాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు వరదనీటిని వదలకపోవడంతో జిల్లాలోని అనేక గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. నిజాంపేట మండలం నందిగామలోని సాయి చెరువు పక్కన గల పౌల్ట్రీ ఫాంలో 10 వేల కోళ్లు మృత్యువాతపడ్డాయి.

MSME-TOOL ROOM, HYDERABAD
(CENTRAL INSTITUTE OF TOOL DESIGN)
(A Government of India Society Ministry of MSME)
Balanagar 'X' Roads, Hyderabad - 500 037 (TS) INDIA
WALK-IN INTERVIEW
Notification No. CITD/Trg./Recruitment/Sep./25 Date : 26th August, 2025
CITD intends to engage suitable candidates in the following posts which are purely on consolidate payment and on contractual basis initially for a period of 11months, which will be renewed from time to time on performance review of the candidate and need of the Institute.

S. No.	POSITION	DATE OF INTERVIEW
1	Training & Placement Officer	06th Sep, 2025
2	Faculty for Mathematics	20th Sep, 2025
3	Faculty for Mechanical Engineering	27th Sep, 2025
4	Faculty for Tool Design	04th Oct, 2025
5	Instructor (Conventional Machining)	18th Oct, 2025
6	Instructor (Fitting)	25th Oct, 2025
7	Hostel Warden	01st Nov, 2025

For detailed notification : Visit the link
"Walk-in Interview - September, 2025" on our website www.citd.in
Sd/-
Principal Director

IEPF | SEBI
CDSL Convenient · Dependable · Secure | NSDL Technology, Trust & Reach | BSE The Power of Values | NSE
ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (IEPFA)
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
బహిరంగ ప్రకటన
నివేశక్ శివిర్
కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ అథారిటీ (IEPFA) సెక్యూరిటీ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (SEBI)తో కలిసి దేశవ్యాప్తంగా పెట్టుబడిదారుల ఫిర్యాదులు మరియు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడానికి ప్రత్యేకంగా నివేశక్ శివిర్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తోంది.
లక్ష్యం
నివేశిక్ శివిర్ అనేది పెట్టుబడిదారుల సేవలను సులభతరం చేయడం, ఆర్థిక అక్షరాస్యతను ప్రోత్సహించడం పెట్టుబడిదారు రక్షణను బలోపేతం చేయడం దీని లక్ష్యం: ముఖ్యంగా
- 6-7 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న డివిడెండ్‌ల బదిలీని సులభతరం చేయడం
- కంపెనీ వద్ద కెవైసి మరియు నామినేషన్ అప్‌డేట్ చేయడంలో సహాయం చేయడం
- క్లెయిమ్ చేయని షేర్లు మరియు డివిడెండ్‌లపై పెండింగ్‌లో ఉన్న IEPFA క్లెయిమ్‌లను పరిష్కరిచడం.
షెడ్యూల్డ్ సిటీ
ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళే భాగంగా **హైదరాబాద్**లో నివేశిక్ శివిర్ నిర్వహించబడుతుంది.
కార్యక్రమ వివరాలు
తేదీ/సమయం: 30 ఆగస్టు 2025న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు
ప్రదేశం: హర్యానా భవన్
1-8-179, సరోజినిదేవి రోడ్డు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ దగ్గర, జోగాని, రామ్‌గోపాల్‌పేట, సికింద్రాబాద్, హైదరాబాద్, తెలంగాణ-500003.
పాల్గొను విధానం
ఈ నోటీసులో ఇవ్వబడిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి లేదా లింక్ **https://qr.me-qr.com/l/NiveshakShivir** పై క్లిక్ చేయడం ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చును.
ఈ రిజిస్ట్రేషన్ నివేశిక్ శివిర్‌లో సరైన సహాయం పొందడానికి ఉపయోగపడుతుంది
మరింత సమాచారం కొరకు
మా అధికారిక వెబ్‌సైట్ www.iepf.gov.in దర్శించండి. మీరు నివేశిక్ శివిర్‌కు సంబంధించి ఇటీవలి అప్‌డేట్లు మరియు సమాచారం కొరకు మా సోషల్ మీడియా ఛానల్స్‌ను అనుసరించండి.
క్లెయిమ్‌దారులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలను నేరుగా మా నిపుణులకు తెలియజేయాల్సిందిగా సూచిస్తున్నాము. మీ భాగస్వామ్యాలు మాకు మెరుగైన సేవలను అందించడంలో సహాయపడుతుంది.
టోల్ ఫ్రీ నెంబర్: 14453 కాల్ సెంటర్: సోమవారం నుండి శుక్రవారం వరకు ఉ.9.00 గం. నుండి సా. 5.30 గం.వరకు
www.iepf.gov.in
CBC 07110/15/0002/2526

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న కేటీఆర్

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాలలో ఎగువ మానేరు ప్రాజెక్టు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్; కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగును పరిశీలిస్తున్న కేటీఆర్

మరో నీరోలా.. రేవంత్

ప్రజల ప్రాణాలు పోతుంటే ఫిడేల్ వాయిస్తున్న రేవంత్

- బీహార్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారానికి మన హెలికాప్టర్లను వాడుకున్నరు అందుకే సహాయక చర్యల్లో ఆలస్యం
- కాంగ్రెస్ ప్రభుత్వం మేల్కోవాలి
- వరద బాధితులను ఆదుకోవాలి
- ఎకరాకు 25 వేల పరిహారమివ్వాలి
- వరద మృతుల కుటుంబాలకు 25 లక్షల పరిహారం చెల్లించాలి

హైదరాబాద్/రాజన్న సిరిసిల్ల, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ)/ మాచారెడ్డి : వరదలతో ప్రజల ప్రాణాలు పోతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్టుగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని, ఓవైపు వరద బీభత్సంతో రాష్ట్రమంతా అతలాకుతలమవుతుంటే మూసీ సుందరీకరణ, ఒలింపిక్స్ నిర్వహణపై సీఎం సమీక్షించడం సిగ్గుచేటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరుకు లక్ష క్యూసెక్కుల వరద వస్తుంటే ప్రజలను అప్రమత్తం చేయకుండా వారి ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మన రాష్ట్రానికి సంబంధించిన హెలికాప్టర్లు బీహార్ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో తిరగుతుండటం వల్లే సహాయక చర్యల్లో ఆలస్యమైందని విమర్శించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు, సిరిసిల్ల జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. మానేరువాగులో చిక్కుకొని అధికారుల సాయంతో సురక్షితంగా బయటికి వచ్చిన రైతు పిట్ల నర్సింహులును, గల్లంతైన రైతు నాగయ్య కుటుంబాన్ని ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వానకాలం సందర్భంగా చేపట్టాల్సిన చర్యలను ప్రభుత్వం పట్టించుకోలేదని, ఈ విపత్తును ముందే ఊహించడంలో ఘోరంగా విఫలమైందని నిప్పులు చెరిగారు. నాలుగు రోజులపాటు వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించినా సర్కారు కండ్లు తెరవకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వరదలతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షలు, నష్టపోయిన పంట ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం చెల్లించాలని, భారీ వర్షాలతో సర్వం కోల్పోయిన ప్రజలను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్న ఇంగిత జ్ఞానం ప్రభుత్వానికి లేదని, వాగులో రైతులు చిక్కుకుపోవడం బాధాకరమని వాపోయారు. గతంలో ఖమ్మంలో వరదలు వచ్చినప్పుడు కూడా ముగ్గురు మంత్రులు ఆ జిల్లా నుంచి ఉండి కూడా అక్కడికి హెలికాప్టర్ పంపలేకపోవడం వల్లే ప్రాణనష్టం సంభవించిందని గుర్తుచేశారు. ఇవ్వాళ నర్మాలలో నేవీ హెలీకాప్టర్లు వచ్చి వరదలో చిక్కుకున్న ఐదుగురిని సురక్షితంగా కాపాడాయని చెప్పారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో వరదల్లో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు సత్వరంగా హెలీకాప్టర్లను పంపి వారి ప్రాణాలను కాపాడిన సందర్భాన్ని గుర్తుచేశారు.

అధికారులకు అభినందనలు

ప్రభుత్వ పెద్దలు మొద్దు నిద్రలో ఉన్నా అధికారులు మాత్రం 24 గంటలు అప్రమత్తంగా ఉండి ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంత వరకు నివారించారని కేటీఆర్ తెలిపారు. వాగులో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించేందుకు ప్రయత్నాలు చేసిన అధికారులను అభినందించారు. మీడియా కూడా తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించిందని ప్రశంసించారు. మరో నాలుగు రోజులపాటు వర్షాలు విస్తృతంగా కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ప్రజలను ఆదుకోవాలని హితవుపలికారు. కేంద్రం కూడా స్పందించి రాష్ట్రానికి సాయం చేయాలని విజ్ఞప్తిచేశారు.

బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు తాగునీరు, ఆహారాన్ని అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలో పార్టీ తరపున వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అతి భారీ వర్షాలతో రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, పాల్వంచ వాగు ఉప్పొంగి కామారెడ్డికి రాకపోకలు బంద్ అయ్యాయని చెప్పారు. సిరిసిల్ల జిల్లా కూడెల్లి, కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ వాగులతో పాటు మానేరు ఉధృతంగా రావడంతో కామారెడ్డికి రోడ్డు మార్గాన చేరుకోలేకపోతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చూడాలని, ఇండ్లు కూలిన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నేతలతో టెలికాన్ఫరెన్స్

వరద ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లేముందు కేటీఆర్ హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ప్రభావిత ప్రాంతాల ముఖ్యనేతలు, పార్టీ జిల్లా అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ హయాంలో వాతావరణ సూచనల ఆధారంగా అనేక సూక్ష్మ అంశాలపై దృష్టిపెట్టేవారమని గుర్తుచేశారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం చేసుకొనేవాళ్లమని చెప్పారు. దురదృష్టవశాత్తు రేవంత్‌రెడ్డి సర్కారు వరదల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో తాత్సారం చేసిందని దుయ్యబట్టారు. అందువల్లే పెద్దమొత్తంలో ఆస్తినష్టం జరిగిందని ఆందోళన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ ఒత్తిడి తెచ్చేదాకా యంత్రాంగం కదలలేదని విమర్శించారు.

బాధితులకుఅండగా ఉండాలి

వరద బాధితులకు బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు అండగా నిలువాలని కేటీఆర్ విజ్ఞప్తిచేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో వారికి ఆహారం, తాగునీరు, నిత్యావసర సరుకులు అందజేయాలని, వారి పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బురద పేరుకుపోయిన ప్రాంతాల్లో ప్రజలతో కలిసి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి వ్యాధులు ప్రబలకుండా చూడాలని, అసరమున్నచోట మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, ఎక్కడ సమస్యలున్నా సర్కారుకు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించారు.

ఎగువ మానేరు, పాల్వంచ వాగు పరిశీలన

సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట బ్రిడ్జిపై నుంచి అప్పర్ మానేరు వరద ఉధృతిని కేటీఆర్ పరిశీలించారు. అనంతరం కామారెడ్డికి బయలుదేరారు. మార్గ మధ్యలో కామారెడ్డి - కరీంనగర్ ప్రధాన మార్గంపై మాచారెడ్డి మండలంలోని పాల్వంచ సమీపంలో పాల్వంచ వాగు ఉధృతిని పరిశీలించారు. రోడ్డు తెగిపోవడం, వరద ఉధృతంగా బ్రిడ్జి పైనుంచి ప్రవహించడంతో కామారెడ్డికి వెళ్లడం సాధ్యం కాక అక్కడి నుంచి తిరిగి సిరిసిల్లకు వెళ్లారు. ఆయన వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులున్నారు.

బండి..కేటీఆర్ అభివాదం

ఎగువమానేరు ఉధృతిని పరిశీలించేందుకు నర్మాలకు వెళ్లిన కేటీఆర్‌కు కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎదురుపడ్డారు. ఈ సందర్భంగా ఒకరికొకరు అభివాదం చేసుకొని పలకరించుకున్నారు. అక్కడే ఇరు పార్టీల శ్రేణులు 'జై తెలంగాణ' నినాదాలతో హోరెత్తించారు. బండి సంజయ్ చెవిలో కేటీఆర్ ఏదో చెప్తుండగా అక్కడ ఉన్నవారు ఆసక్తిగా చూడటం కనిపించింది.

- వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్

ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో అండర్‌పాస్‌లో వరద ఉధృతిని పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- లోతట్టు ప్రాంతాల్లో స్థానికులతో ఎమ్మెల్యే మాణిక్‌రావు

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో జలమయమైన డ్రీమ్ ఇండియా కాలనీలో వరద నీటిలో వెళ్లి కాలనీవాసుల ఇబ్బందులను తెలుసుకుంటున్న జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

వరద వచ్చే.. వాహనాలు నిలిచే..

భారీ వర్షాలకు కామారెడ్డి జిల్లా అతలాకుతలం అయ్యింది. జాతీయ రహదారి 44 పైకి వరద పోటెత్తడంతో రోడ్డు తీవ్రంగా దెబ్బతింది. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర గంటల తరబడి వాహనాలు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తెగిన రోడ్లు.. చెరువులకు గండ్లు

- పలుచోట్ల రోడ్లపై నుంచి పొంగిపొరిన వరద జలాలు
- భారీ వర్షాలు, వరద ఉధృతికి దెబ్బ తిన్న రహదారులు
- ఆదిలాబాద్, నిర్మల్, మెదక్, సిద్దిపేట కామారెడ్డి,
- ములుగు, ఖమ్మం జిల్లాల్లో భారీగా రోడ్ల ధ్వంసం
- మహారాష్ట్ర నుంచి 10 గంటలు నిలిచిన రాకపోకలు
- 1039 కి.మీ తీవ్రంగా దెబ్బ తిన్న రోడ్లు: అధికారులు

నిర్మల్ జిల్లా కుంటాల అందకూర్ గ్రామం వద్ద కోతకు గురై ప్రమాదకరంగా రోడ్డు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ నెట్‌వర్క్): మిన్ను విరిగి మీద పడ్డట్టుగా కురిసిన జోరువానతో.. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. కుండపోత కుమ్మరిచ్చినట్టు గురిసిన వానతో ఊరూ ఏరూ ఏకమయ్యాయి. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలను ముంచాయి. రోడ్లు ఎక్కడికక్కడ దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య అనుసంధానం లేకపోవడంతో రాకపోకలు స్తంభించాయి. వరద ఉధృతిలో ఊర్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. కామారెడ్డి జిల్లాలో జాతీయ రహదారి-44 తెగిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆదిలాబాద్ జిల్లాలోని భోరజ్ వద్ద వాహనాలను నిలిపివేశారు. మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వాహనాలను నిలిపివేయడంతో కిలోమీటర్ల మేర వాహనాలు ఆగిపోయాయి. గురువారం 10 గంటల తర్వాత వాహనాలను అనుమతించారు. నిర్మల్- ఆదిలాబాద్‌కు పాత జాతీయ రహదారి కోతకు గురైంది. నిర్మల్ శివారులోని సిద్ధాపూర్ వాగు, మథోల్ మండలంలోని వడ్తాల్ వాగు ఉప్పొంగి ప్రవహిసుండగా పలు గ్రామాలకు నిలిచిపోయాయి. కల్లూర్ నుంచి అందకూర్ నడుమ ప్రధాన రహదారి కోతకు గురైంది.

భారీగా రోడ్ల డ్యామేజీ

ములుగు జిల్లా తాడ్వాయి, గోవిందరావుపేట మండలాల్లో అత్యధిక వర్షం కురిసి జిల్లెలవాగు పొంగడంతో పస్రా-తాడ్వాయి మధ్య 163 జాతీయ రహదారి కోతకు గురైంది. మెదక్-శమ్నాపూర్ వద్ద రైల్వే ట్రాక్ కుంగిపోయింది. సిద్దిపేట కొత్త బస్టాండ్ నుంచి మోడ్రన్ బస్టాండ్ మధ్యలో రోడ్ వెంబడి బ్రిడ్జి పైన నీరు చేరింది. వరద ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిపివేశారు. కూడవెల్లి వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కిష్టారం వద్ద రోడ్డుపైకి వర్షపునీరు పొంగి ప్రవహిస్తున్నది. అన్నారుపాడు- గుండ్లరేవు మధ్య తుమ్మలవాగు, బేతాళపాడు-పడమట నర్సాపురం మధ్య పెద్దవాగు, రాళ్లవాగు పొంగిపొర్లుతున్నాయి. ఆయా మార్గాల్లో రాకపోకలు నిలిపివేశారు. నందిపాడు-ఆసుపాక మధ్య ప్రధాన రహదారిపై భారీ వృక్షం కూలడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

చెరువులకు గండ్లు.. తెగిన కాల్వలు

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా 362చోట్ల సాగునీటి ప్రాజెక్టులు, చెరువులు, కాల్వలకు నష్టం వాటిల్లిందని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ఈ సీజన్‌లో గురువారం నాటికి 117 చెరువులకు గండ్లు పడ్డాయి. మరో 117చెరువుల కట్టలు, తూములు దెబ్బతిన్నాయి. ప్రాజెక్టుల కాల్వలకు 88చోట్ల గండ్లు పడగా, 40చోట్ల దెబ్బతిన్నాయి. శాశ్వత మరమ్మతులకు 62.56కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. ఆర్అండ్‌బీ పరిధిలోని 37డివిజన్లలో 1039 కిలోమీటర్ల మేర రోడ్లకు తీవ్ర నష్టం జరిగిందని ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం రోడ్ల పరిస్థితిపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

వరద సహాయక చర్యలేవి?

- విపత్తు నిర్వహణ చర్యలేమిటి?
- సమగ్రంగా నివేదిక ఇవ్వండి
- సెప్టెంబర్ 17న తదుపరి విచారణ
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వరదల బీభత్సం వల్ల ఏర్పడిన విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలను వివరించాలని హైకోర్టు ఆదేశించింది. రాష్ట్రాన్ని వరదలు అతలాకుతలం చేస్తున్న నేపథ్యంలో తీసుకున్న సహాయక చర్యల గురించి సమగ్ర వివరాలు అందజేయాలని గురువారం ఆదేశించింది. విపత్తుల నిర్వహణ చట్టం కింద గతంలో ఇదే హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా అమలుచేసిన చర్యలపై నివేదిక అందజేయాలని పేర్కొన్నది. ఈ మేరకు కౌంటర్ దాఖలు చేయాలని, తదుపరి విచారణను సెప్టెంబరు 17న చేపడతామని ప్రకటించింది. రాష్ట్రంలో జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం అమలు తీరు లోపభూయిష్టంగా ఉన్నదంటూ గతంలో డాక్టర్ సీహెచ్ సుధాకర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనం మరోసారి విచారణ జరిపింది. ప్రస్తుతం కురుస్తున్న అతి భారీ, కుండపోత వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా వరదలు విలయతాండవం చేస్తున్నప్పటికీ ప్రభుత్వంలో చలనం లేదంటూ తాజాగా మధ్యంతర పిటిషన్ దాఖలైంది. వరదలు పోటెత్తుతున్నా విపత్తుల నిర్వహణ చట్టం కింద కనీస సహాయక చర్యలు చేపట్టడం లేదని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అతి భారీ వర్షాల ప్రభావం రాష్ట్రంలోని 10 జిల్లాలపై ఉన్నదని, చట్టప్రకారం ముందస్తు చర్యలు తీసుకోలేదదని తెలిపారు. ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నా, ప్రభుత్వానికి ఏమీ పట్టడం లేదని పేర్కొన్నారు. పంటపొలాలే కాకుండా ఇండ్లు, అపార్ట్‌మెంట్ల ఫస్ట్ ఫ్లోర్లు కూడా కొన్ని చోట్ల మునిగాయని తెలిపారు. దీనిపై ప్రభుత్వ న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ, వరద సహాయక చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నదని తెలిపారు. వరద బాధితులకు షెల్టర్లు, ఆహారం, నీరు, వైద్య సేవలు సరఫరా చేస్తున్నట్టు చెప్పారు. కౌంటర్ దాఖలుకు గడువు కావాలని కోరారు.

ప్రమాదకరంగా ప్రాజెక్టులు

ప్రాజెక్టుల గేట్ల పైనుంచి కూడా వరద నీరు ప్రవహిస్తున్నదని, రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాజెక్టులు ప్రమాదకరంగా మారాయని పిటిషనర్ తరపు న్యాయవాది ఆందోళన వ్యక్తంచేశారు.

ప్రాజెక్టులు బలహీనపడి తెగితే ఊళ్లకు ఊళ్లు ముంపునకు గురయ్యే దారుణ పరిస్థితులు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా గిరిజనులకు ముప్పు ఏర్పడే ఆస్కారం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే చర్యలు చేపట్టేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఇప్పటికే తాము పలు మార్గదర్శకాలను జారీ చేశామని, వాటిని ప్రభుత్వం ఏమేరకు అమలు చేసిందో తెలుసుకున్నాక తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 17కి వాయిదా వేసింది.

కుప్పకూలిన విద్యుత్తు వ్యవస్థ!

- భారీ వరదతో సరఫరాకు అంతరాయం
- కూలిన 1357 స్తంభాలు, దెబ్బ తిన్న 280 ట్రాన్స్‌ఫార్మర్లు
- పునరుద్ధరణ చర్యలు చేపట్టాం: విద్యుత్తుశాఖ అధికారులు

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు విద్యుత్తు వ్యవస్థ దెబ్బతిన్నది. సరఫరా నిలిచిపోయి పలు గ్రామాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు ముషారఫ్ ఫారూఖీ, వరుణ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం రెండు సంస్థల పరిధిలోని చీఫ్ ఇంజినీర్లు, సూపరింటెండెంట్ ఇంజినీర్లు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. అనంతరం మరమ్మతు పనులపై ఓ ప్రకటన విడుదల చేశారు. దక్షిణ డిస్కం పరిధిలో 1357 స్తంభాలు నేలకూలాయని, 280 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయని వెల్లడించారు. మెదక్ జిల్లాలో 15 గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోగా 10 గ్రామాల్లో పునరుద్ధరించామని, మిగిలిన గ్రామాల్లోనూ పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉత్తర డిస్కం పరిధిలోని కామారెడ్డి, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్ సర్కిళ్ల పరిధిలో నేలకూలిన 108 స్తంభాల్లో 87 పునరుద్ధరించామని తెలిపారు. 21 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినగా 17 సరిచేశామని, నీట మునిగిన 86 ట్రాన్స్‌ఫార్మర్లలో ఆరింటిని తిరిగి అందుబాటులోకి తెచ్చామని వివరించారు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ సిబ్బంది శ్రమిస్తున్నారని, అధికారులు పర్యవేక్షిస్తున్నారని వివరించారు.

దెబ్బతిన్న ఎన్‌హెచ్ 44

నిజామాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి జిల్లాలో భారీ వర్షానికి జాతీయ రహదారి 44 దెబ్బతిన్నది. భిక్కనూర్ మండలం జంగంపల్లి వద్ద ఏరులైన పారిన వరదతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రోడ్డు మధ్యలో 20 అడుగుల వెడల్పుతో భారీ గుంత ఏర్పడింది. హైవేపై వరద ప్రవాహం పెరగడంతో పోలీసులు వాహనాలను నియంత్రించారు. వెనక్కి వెళ్లలేక, ముందుకు కదల్లేక వాహనాదారులు గంటల కొద్ది నరకప్రాయాన్ని అనుభవించారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి గేటు వద్ద నేషనల్ హైవే 44పై భారీ వరదతో రాకపోకలకు అంతరాయం కలిగింది. బీబీపేట -కామారెడ్డి మార్గంలో బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. పోచారం ప్రాజెక్టు ఉగ్రరూపంతో హైదరాబాద్–బోధన్ మార్గంలో హైలెవెల్ వంతెన ధ్వంసమైంది. హైవేపై నిలిచిన వరదను జేసీబీలతో మళ్లించి గురువారం ఉదయం నాటికి వన్‌వేలో వాహనాలను పంపించారు.

కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్...

కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలంలోని రామేశ్వరపల్లి గ్రామ శివారులో భిక్కనూర్ – తలమడ్ల రైల్వే స్టేషన్ మధ్య వరద ఉధృతికి రైల్వే ట్రాక్ కొట్టుకు పోయింది. 10 మీటర్ల పొడవునా రైల్వే పట్టాలు తెగిపోవడంతో రైళ్ల రాకపోకలను సౌత్ సెంట్రల్ రైల్వే నిలువరించింది. బుధవారం పలు రైళ్లను రద్దు చేయగా, గురువారం మహారాష్ట్రకు వెళ్లే రైళ్లను దారి మళ్లిస్తున్నారు. నిజామాబాద్ – సికింద్రాబాద్ రైలు మార్గంలో రెండు చోట్ల ఇబ్బందికర పరిస్థితి ఉండటంతో ఈ మార్గాన్ని పూర్తిగా మూసివేసి పునరుద్ధరణ పనులు చేపడుతున్నారు. కాచిగూడ – నిజామాబాద్, మెదక్ – కాచిగూడ, కాచిగూడ – నాగర్‌సోల్, కాచిగూడ – పూర్ణ, బోధన్ – కాచిగూడ సర్వీసులను రద్దు చేసినట్టుగా సీపీఆర్వో శ్రీధర్ ప్రటనలో పేర్కొన్నారు. సీఎస్టీ ముంబాయి – లింగంపల్లి(17057) రైలును నిజామాబాద్, ఆర్మూర్, కరీంనగర్, పెద్దపల్లి ఐపాస్ కాజిపేట మీదుగా సికింద్రాబాద్‌కు దారి మళ్లించారు. అమరావతి – తిరుపతి(12766), నర్ఖేర్–కాచిగూడ(17642) రైళ్లు పూర్ణ పర్లి, వికారాబాద్ మీదుగా సికింద్రాబాద్ నుంచి కాచిగూడకు చేరుకోనుంది.

ఇండ్లు ఖాళీ చేసి పక్క గ్రామాలకు వలస..

కుంభవృష్టి వానలతో జుక్కల్ నియోజకవర్గం తీవ్రంగా ప్రభావితమైంది. డోంగ్లి మండలంలోని సిర్పూర్, హాసన్‌టాక్లి, పెద్ద టాక్లి గ్రామాల్లోని ప్రజలు ఇండ్లు ఖాళీ చేసి ఇతర ప్రాంతాలకు వెళ్లారు. మహారాష్ట్రకు సరిహద్దులోని సలాబత్‌పూర్ ఆంజనేయశ్వామి ఆలయంలో మరి కొందరు తాత్కాలిక వసతి పొందారు. పెద్ద టాక్లీలో కొన్ని కుటుంబాలు డోంగ్లి మండల కేంద్రానికి వెళ్లాయి. నిజాంసాగర్, కౌలాస్‌నాలా ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ మంజీరాలోకి వరదను వదలడంతో ముంపునకు గురవుతున్నాయి. పిట్లం మండలం కుర్తి గ్రామం పూర్తిగా జల దిగ్బంధంలో చిక్కుకుంది.

అన్నపానీయాల్లేవ్.. వినాయక పూజల్లేవ్

కామారెడ్డి జిల్లాలో వరదలో చిక్కుకున్న వారికి అన్నపానీయాలు కూడా అందలేదు. ప్రభుత్వ యంత్రాంగం సహాయక చర్యల్లో నిమగ్నమవగా, బాధితులకు భోజనాలు సకాలంలో అందలేదు. జీఆర్, ఈఎస్‌ఆర్ గార్డెన్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో తాగడానికి నీళ్లు కరువయ్యాయి. కొంత మంది స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భోజనాలు అందజేశారు. కామారెడ్డిలో ఈసారి వినాయకచవితి వెలవెలబోయింది. కొన్ని విగ్రహాలు తయారీ కేంద్రాల్లోనే ఉండిపోయాయి. మరోవైపు వరదలో చిక్కుకున్న జనాలను కాపాడుకునేందుకు ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేలు మదన్ మోహన్ రావు, లక్ష్మీకాంతారావు ప్రభుత్వ పెద్దలతో మాట్లాడారు. రక్షణ దళాలు వచ్చి బాధితులను రక్షించినప్పటికీ హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి రాలేకపోయాయి. ప్రాణాలకు తెగించి పోలీసులు, ఇతర రక్షణ దళాలు తాడు, బోట్ల సాయంతో బాధితులను ఒడ్డుకు తీసుకు వచ్చారు.

కామారెడ్డి జిల్లా కేంద్రంలో బైపాస్ రోడ్డును ముంచెత్తిన వరద. వరదనీటిలో కొంత మేర మునిగిపోయిన ఇండ్లు

కామారెడ్డి కకావికలం

కనీవినీ ఎరుగని రీతిలో వర్షబీభత్సం • వరదలో పూర్తిగా మునిగిన పట్టణం

- పలు కాలనీల్లో 12 అడుగుల మట్టంతో వరద ప్రవాహం
- ఎల్పుగొండలో కొట్టుకుపోయిన 10వేల కోళ్లు.. 30లక్షల ఆస్తినష్టం
- ఉప్పొంగిన వాగులు.. కొట్టుకుపోయిన రైల్వేట్రాక్
- మట్టిదిబ్బలుగా పంట పొలాలు

నిజామాబాద్, ఆగస్టు 28, (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి జిల్లాలో కుంభవృష్టి వర్షం కురిసింది. కనీవినీ ఎరుగని రీతిలో కురిసిన వర్షానికి జిల్లా చిగురుటాకులా వణికింది. జిల్లా కేంద్రంలోని వందలాది కాలనీలు నీటి మునిగాయి. ప్రజలు దాదాపుగా 40గంటల పాటు ఇండ్లకే పరిమితం కావాల్సి వచ్చింది. కామారెడ్డి పట్టణంలో 12 అడుగులు ఎత్తుతో వరద ప్రవాహం ఉండటంతో ఎన్జీవో కాలనీ, జీఆర్ కాలనీలు భయానక పరిస్థితిలో కొట్టుమిట్టాడాయి. కామారెడ్డి శివారు ప్రాంతంలో పంట పొలాల మీదుగా తన్నుకు వచ్చిన వరద అంతకంతకు పెరిగి గ్రౌండ్ ఫ్లోర్ భవనాన్ని ముంచెత్తుతూ ముందుకు సాగింది. కామారెడ్డి పెద్ద చెరువు గతంలో ఎన్నడూ లేని విధంగా అలుగు దుంకింది. పెద్ద చెరువుకు కూత వేటు దూరంలోని నివాసితులు ప్రాణ భయంతో వణికిపోవాల్సి వచ్చింది. ఓ వైపు పెద్ద చెరువు అలుగు, మరోవైపు ఎగువ మెదక్ జిల్లా అటవీ ప్రాంతం గుండా భారీ వరద పంట పొలాల మీదుగా పరుగులు తీసింది. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 36కు పైగా చెరువులు తెగినట్టుగా ఇరిగేషన్ శాఖ ప్రకటించింది. అనధికారికంగా మరో 50కి పైగా చెరువులు ప్రమాదపు అంచులో కొట్టుమిట్టాడుతున్నాయి. మంజీరా ఉగ్రరూపం దాల్చడం, నిజాంసాగర్ గేట్లు ఎత్తి దిగువకు లక్షన్నర క్యూసెక్కులు వదలడంతో దిగువ అనేక గ్రామాలు ముంపును ఎదుర్కోవాల్సి వచ్చింది. బొగ్గు గుడిసె సమీపంలో ఎన్‌హెచ్ పనులు చేస్తున్న 8 మంది బీహార్ కూలీలు, గున్కుల్‌లో కోళ్ల ఫారంలో ముగ్గురు చిక్కుకోగా రక్షణ దళాలు వారిని సురక్షితంగా కాపాడాయి. రాజంపేటలో గోడ కూలిన ఘటనలో ల్యాబ్ టెక్నీషియన్ మృతి చెందాడు. దోమకొండలో వరద ధాటికి ఆరు ఆవులు చనిపోయాయి. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆరుగొండలో రికార్డు స్థాయిలో 43.15 సెం. మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టుగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పేర్కొన్నారు. పాల్వంచ మండలం ఎల్పుగొండలో 10వేల కోళ్లు వరదలో కొట్టుకుపోయాయి. కోళ్ల ఫారం నేలమట్టమైంది. రూ.30లక్షలకు పైగా నష్టం సంభవించిందని యజమాని ఐలేని నాగేశ్వర రావు కన్నీరుమున్నీరు అవుతున్నారు.

అతలాకుతలం..

కామారెడ్డి పట్టణంలో పలు వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. రోడ్డుకు ఇరువైపులా నిలిపిన లారీలు, భారీ వాహనాలు వరద ధాటికి చెల్లాచెదురయ్యాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. కాలనీల్లో వరద తగ్గుముఖం పట్టిన తర్వాత బురదతో నివాసాలు నిండిపోయాయి. చెల్లాచెదురైన వంట సామగ్రి పనికి రాకుండా పోయాయి. ఎల్లారెడ్డి మండలంలో లక్ష్మాపూర్ వద్ద రోడ్డు తెగిపోయింది. లింగంపేట మండలం భవానిపేట్ గ్రామ శివారులో ఎర్రగుంట వద్ద చెక్ డ్యామ్ కొట్టుకుపోగా గ్రామాన్ని తాకుతూ పెద్దవాగు ప్రమాదకరంగా ప్రవహించింది. మెంగారం వద్ద రోడ్డు తెగడంతో లింగంపేట – ఎల్లారెడ్డికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి నుంచి హైదరాబాద్ మార్గంలో చెరువు కట్ట తెగడంతో రాకపోకలు బంద్ అయ్యాయి. నాగిరెడ్డిపేట మండలంలో నడిమితండాలో వరదలో గిరిజనులు చిక్కుకుని బుధవారం ఆర్తనాదాలు చేశారు. కామారెడ్డి మండలంలోని లింగాయిపల్లి శివారులో వరదలో నలుగురు, చిన్నమల్లారెడ్డి చెరువు వద్ద ముగ్గురు చిక్కుకొని సాయం కోసం ప్రాధేయపడగా రక్షించారు.

లోకం పోకడ

ఫ్రీ బస్సులు సరే.. మరి రోడ్లెక్కడ?

ముహూర్తం:

శుక్రవారం, సూర్యోదయం: 6–02, సూర్యాస్తమయం: 6–32. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: షష్ఠి రాత్రి 8–22 వరకు. నక్షత్రం: స్వాతి ఉదయం 11–39 వరకు, తదుపరి విశాఖ. వర్జ్యం: సాయంత్రం 5–55 నుంచి రాత్రి 7–42 వరకు. రాహుకాలం: ఉదయం 10–43 నుంచి పగలు 12–16 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8–32 నుంచి ఉదయం 9–22 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12–41 నుంచి పగలు 1–31 వరకు. అమృతకాలం: తెల్లవారుజామున 4–43 నుంచి మర్నాడు ఉదయం 6–31 వరకు.

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	31.7°c	24.5°c
ఆదిలాబాద్	30.2°c	23.1°c
ఖమ్మం	30.0°c	23.0°c
నల్లగొండ	28.0°c	20.4°c
రంగారెడ్డి	27.0°c	20.7°c
కరీంనగర్	27.0°c	24.0°c
వరంగల్	26.0°c	22.0°c
హైదరాబాద్	25.6°c	21.1°c
మహబూబ్‌నగర్	25.0°c	22.0°c
మెదక్	25.0°c	21.2°c

13 జిల్లాల్లో స్కూళ్లు బంద్

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల కారణంగా 13 జిల్లాల్లోని విద్యాసంస్థలు బంద్ చేశారు. కామారెడ్డి, మెదక్, నిర్మల్, కుమ్రం భీం ఆసిఫాబాద్, నల్గొండ, ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లోని స్కూళ్లు, కాలేజీలకు గురువారం సెలవు ఇచ్చారు. మెదక్ జిల్లాలో శుక్రవారం, కామారెడ్డి జిల్లాలో శుక్ర, శనివారాలు కూడా సెలవు ప్రకటించారు.

భారీ వర్షాలపై మానిటరింగ్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : వర్షాలపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రానికి అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అందుబాటులో ఉంచిందని వెల్లడించారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో రాష్ట్ర సర్కారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నష్టాలపై ప్రాథమిక నివేదిక ఇవ్వండి

- టెలీకాన్ఫరెన్స్‌లో సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ప్రాథమిక నివేదికను వెంటనే సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు సంబంధిత శాఖల కార్యదర్శులను ఆదేశించారు. వివిధ శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో గురువారం సాయంత్రం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ..దెబ్బతిన్న రోడ్లు, చెరువులు, విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని ఆదేశించారు.

ప్రమాదపు అంచులోకి పోచారం జలాశయం

- వరద ప్రవాహానికి తేలిన ఆనకట్ట అంతర్భాగం
- నిజాంసాగర్‌కు తొలిసారి 2.31లక్షల క్యూసెక్కులు

నిజామాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు ప్రమాదముప్పు అంచుల్లోకి వెళ్లి సురక్షితంగా బయటపడింది. ప్రాజెక్టు చరిత్రలో రికార్డు స్థాయిలో 1లక్ష 82వేల క్యూసెక్కుల వరద కొనసాగింది. అంతకు మించి ప్రవాహానికి అవకాశం లేకపోవడంతో వరద ప్రవాహం ప్రాజెక్టు అంచుల్లో నుంచి కిందికి జారుకుంది. ఈ క్రమంలో ఆనకట్ట మట్టి పూర్తి స్థాయిలో కొట్టుకుపోవడంతో దిగువ ప్రాంత గ్రామాల్లో అలజడి చెలరేగింది.

నిజాంసాగర్‌కు 40ఏండ్ల రికార్డు

గడిచిన నలభై ఏళ్లలో చారిత్రక నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఇప్పటి వరకు గరిష్టంగా 1లక్షా 73వేల క్యూసెక్కులు వరద మాత్రమే వచ్చింది. తాజాగా 2లక్షల మార్క్‌ను దాటి ఇన్‌ఫ్లో భారీ ఎత్తున వస్తోంది. గురువారం 2లక్షల 31వేల క్యూసెక్కులు మేర ఇన్‌ఫ్లో కొనసాగడంతో నీటిని దిగువకు వదిలారు.

రాష్ట్రం ఆగమవుతుంటే మూసీపై సమీక్షా?

- వరదలతో రాష్ట్రం అతలాకుతలం
- హెలికాప్టర్ పంపితే ఇద్దరు బతికేవారు
- ప్రజల ప్రాణాలు పట్టని సీఎం రేవంత్
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం
- మెదక్ జిల్లా ముంపు ప్రాంతాల్లో పర్యటన

హవేలీఘనపూర్ మండలం రాజిపేటలో వర్షంలోనూ పర్యటిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

వరదల్లో చిక్కుకుని ఓ వ్యక్తి మృతి చెందడంతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కొత్తా ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): భారీ వర్షాలు, వరదలతో సగం తెలంగాణ ఆగమాగమవుతుంటే రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని నిన్న మూసీ సుందరీకరణ, నేడు స్పోర్ట్స్ మీద రివ్యూ నిర్వహిస్తున్నాడే తప్ప ప్రజల ప్రాణాల గురించి పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రెండు రోజులుగా మెదక్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండలం రాజిపేటలో వరదల్లో ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డిలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడుతూ మెదక్–కామారెడ్డి జిలాల ప్రజలు వరదలతో ఇబ్బంది పడుతుంటే రేవంత్ మూసీ సుందరీకరణ, ఆటల పోటీల అంశంపై రివ్యూ చేయ డం ఏంటని మండిపడ్డారు. రాజిపేటకు చెందిన యాదాగౌడ్, సత్యనారాయణ వరదల్లో చిక్కుకొని మృతిచెందారని, మెదక్‌లోని ఓ హాస్టల్‌లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం వీరిద్దరు ఆటోలో వెళ్తున్న క్రమంలో వరదలో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. స్తంభంపైకి చేరుకుని నాలుగైదు గంటల పాటు కాపాడాలని కోరినా రక్షించలేదని, సకాలంలో హెలికాప్టర్ పంపితే రెండు ప్రాణాలు దక్కేవని అన్నారు. అత్యవసరమైతే తప్ప హెలికాప్టర్ వాడలేమని ఒక మంత్రి అన్నారని, పెళ్లిళ్లకు, సీఎం కోసం, ఇతర పనులకు వాడవచ్చు కానీ ప్రజల ప్రాణాల రక్షించేందుకు హెలికాప్టర్ పంపరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యం వల్లే వారిద్దరు ప్రాణాలు కోల్పోయారని, ఆ రెండు కుటుంబాలకు రూ. 25 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించాలని, నష్టపోయిన పంట పొలాలకు ఎకరానికి రూ. 25వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

సహాయక చర్యల్లో విఫలం

మెదక్ జిల్లా అతలాకుతలం అవుతుంటే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మెదక్ జిల్లాలో ముంపు ప్రాంతాల ప్రజలు సహాయక చర్యల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. తాగునీరు లేకపోవడం తో వర్షం నీరు తాగుతున్నారని, ఇంత దౌర్భాగ్యమైన పరిస్థితి ఎప్పుడూ రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రతిపక్ష నాయకులు పట్టిలేపితే తప్ప ప్రభుత్వం మేల్కొనలేదని ధ్వజమెత్తారు. నిన్నటి నుంచి దూప్‌సింగ్ తండా వాసులు నీటిలో ఉన్నా సర్కార్ పట్టించుకోలేదని మండిపడ్డారు. వరదల్లో కొట్టుకుపోయినా సహాయక చర్యలు చేపట్టడంలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్‌రావు విమర్శించారు.

వరదలో రేవంత్ బురద రాజకీయం!

ఎల్లంపల్లి వరద పరిశీలనలో ప్రేలాపనలు • కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాకులు, చెవాకులు

- మేడిగడ్డలో నీళ్లు నింపుతే ఆస్తి, ప్రాణ నష్టం జరుగుతుందంటూ నిరాధారమైన ప్రచారం
- కేసీఆర్, హరీశ్‌రావుపై అసభ్యకర వ్యాఖ్యలు
- ఘోష్ కమిటీపై అసెంబ్లీలో చర్చిస్తామని వెల్లడి

పెద్దపల్లి, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): కామారెడ్డి, నిర్మల్, మెదక్, సిద్దిపేట జిల్లాలు హాహాకారం చేస్తున్నాయి. వరద విలయంలో చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. ఇలాంటి సమయంలో ఏ ముఖ్యమంత్రి అయినా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి. వరదలో చిక్కుకున్న ప్రజానీకాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. ఆస్తి, ప్రాణనష్టం తగ్గించేందుకు దృష్టి సారించాలి. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని చర్చ జరుగుతున్నది. మూడు రోజులుగా వరద బీభత్సం సృష్టిస్తుంటే తాపీగా మూసీ సుందరీకరణ, ఇతర రాజకీయ అంశాలపై సమీక్షలు నిర్వహించిన సీఎం... అత్యవసరమైన వరద సమీక్షను మాత్రం పట్టించుకోలేదని విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో గురువారం నామమాత్రంగా మంత్రి ఉత్తమ్‌తో కలిసి హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే కోసమంటూ వెళ్లారు. అక్కడికి వెళ్లి, వరద విధ్వంసం తగ్గించేందుకు తీసుకునే చర్యల గురించి మాట్లాడుతారని ఎవరైనా అనుకుంటారు. కానీ.. రేవంత్‌రెడ్డి బురద రాజకీయం చేశారని ప్రజానీకంలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఎప్పుడూ రాజకీయాలే మాట్లాడితే.. పరిపాలన, విపత్తు నిర్వహణ, సహాయ చర్యలపై అసలు ముఖ్యమంత్రికి అవగాహన ఉందా అని ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ఉధృతిని ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. గోలివాడ పంపు హౌస్‌లోని హెలీప్యాడ్‌లో దిగిన రేవంత్‌రెడ్డి.. రోడ్డు మార్గంలో ఎల్లంపల్లికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గోదావరి నీటిని తెలంగాణ రాష్ట్ర ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా ఆనాటి కాంగ్రెస్ ప్రభు త్వం ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించిందని తెలిపారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రస్తావించారు. రూ.లక్ష కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు ఉన్నాయని, మేడిగడ్డ బరాజ్ కుంగిపోయిందని ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీళ్లు నింపితే పెద్ద ప్రమాదం సంభవిస్తుందని, ఊర్లకు ఊర్లే కొట్టుకుపోతాయని వ్యాఖ్యలు చేశారు. మేడిగడ్డ బరాజ్‌లో నీటిని నింపితే కూలిపోయే ప్రమాదముందని, ఆస్తి నష్టంతో పాటు ప్రాణ నష్టం జరుగుతుందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో నిర్మాణ, నిర్వహణ లోపాలు ఉన్నాయని జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదికలో తెలిపిందని చెప్పుకొచ్చారు. జస్టిస్ ఘోష్ కమిటీ, ఎన్డీఎస్ఏ నివేదికలపై అసెంబ్లీలో పూర్తిగా చర్చిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏరియల్ సర్వే చేసి, గమనించిన విషయాలపై మాట్లాడుతారని అనుకున్న ప్రజానీకం, మీడియా ప్రతినిధులు, అధికారులు... రేవంత్ తిట్ల పురాణం చూసి ఆశ్చర్యపోయారు.

మా గోడు వినండి మహాప్రభో!

కామారెడ్డి జిల్లా రాజాంపేట్ మండలంలో కొండాపూర్, అరగొండ, ఎల్లాపూర్‌తండా, ఎల్లారెడ్డిపల్లి, గుడితండా గ్రామాలు జలమయ్యాయి. అక్కడి ప్రజలు ప్రాణాలు చేతపట్టుకొని సాయం కోసం ప్రభుత్వంపై ఆశగా చూశారు. ఇండ్లలోకి నీళ్లు రావడంతో పైకప్పు ఎక్కి ప్రాణాలు కాపాడుకున్నారు. భారీ వర్షాలతో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలింది. కరెంట్ లేదు, తాగడానికి నీళ్లు లేవు, తినడానికి తిండి లేదు, ఉండడానికి నివాసం లేదు. పిల్లలు, పెద్దలంతా ఆకలితో అలమటించారు. అయినప్పటికీ వారికి బుక్కెడు బువ్వపెట్టే నాథులే కరువయ్యారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు లేకపోవడంతో జిల్లా అధికారులు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో నష్టం భారీ స్థాయికి చేరింది. ఇలా వరద ప్రాంతాల ప్రజల గోస వర్ణనాతీతం. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలకు సాయం అందించడంలో సర్కారు, అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో పునరావాస చర్యలు కల్పించడంలోనూ అధికారులు విఫలమైనట్టు విపక్షాల నేతలు మండిపడుతున్నారు.

ప్రజల హాహాకారాలు...పట్టింపులేని సర్కారు !

వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి.. ఊర్లకు ఊర్లు నీట మునిగిపోయాయి. కరెంటు సరఫరా, తిండి, నీళ్లు లేక ప్రజలు సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్నారు. వరదలో చిక్కుకుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని.. కాపాడాలంటూ హాహాకారాలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వానికి ఇవేమీ పట్టడంలేదని, వరదలో చిక్కుకున్న ప్రజలకు భరోసా కల్పించాల్సిన సీఎం రేవంత్ రెడ్డి బురద రాజకీయంలో మునిగిపోయారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం నుంచి వర్షాలు బీభత్సం సృష్టిస్తుంటే.. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి జూమ్ మీటింగ్‌కు పరిమితమయ్యారు. హైదరాబాద్‌లోని ఇంట్లో కూర్చుని పత్రికలకు ప్రెస్‌నోట్లు పంపి, చేతులు దులుపుకున్నారు. ఇక రేవంత్‌రెడ్డి మాత్రం మూసీ సుందరీకరణ, రాజకీయ వ్యవహారాలపై చర్చలో నిమగ్నమయ్యారు. రాష్ట్రంలో వరద బీభత్సం సృష్టిస్తున్నదని జాతీయ మీడియా సైతం కథనాలు ప్రసారం చేసింది. కానీ సీఎం నుంచి ఎలాంటి స్పందన కనిపించలేదు. బుధవారం కామారెడ్డి పట్టణం అతలాకుతలమైతే.. తాపీగా సీఎంవో ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. కలెక్టర్లను అప్రమత్తం చేశారనేది ఆ ప్రకటన సారాంశం. ఇక అంతే.. ఆ తర్వాత సీఎం మర్చిపోయారు. ఇక్కడ కూడా ప్రభుత్వంలోని ఆదిపత్య ధోరణి, గ్రూపు రాజకీయాలు కనిపించాయని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చూసుకుంటారులే... నాకెందుకు అన్నట్టుగా రేవంత్‌రెడ్డి వ్యవహరించారని నెటిజన్లు మండిపడుతున్నారు.

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద గోదావరి జలాలకు పూజలు చేస్తున్న రేవంత్‌రెడ్డి

ఇన్‌చార్జి మాత్రులు.. ఉత్సవ విగ్రహాలు

ఉమ్మడి నిజామాబాద్, మెదక్ జిల్లాలు అస్తవ్యస్తమయ్యాయి. ఆయా జిల్లాల ఇన్‌చార్జి మంత్రులైన సీతక్క, వివేక్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించలేదు. మెదక్ సొంత జిల్లా మంత్రి దామోదర రాజనర్సింహ కూడా అదే విధంగా వ్యవహరించారు. హైదరాబాద్‌లోనే ఉండి పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. సీఎం ఏమైపోయారంటూ విమర్శలు వ్యక్తమవుతుండడంతో తప్పని పరిస్థితుల్లో ఏరియల్ సర్వే చేసినట్టు కనిపిస్తున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంతకుముందు ఉదయం స్పోర్ట్ హబ్‌బోర్డు సమీక్ష, ఒలంపిక్స్‌లో తెలంగాణకు ప్రాతినిథ్యంపై చర్చించారు. ప్రజలు వర్షాలతో అతలాకుతలమైతుంటే.. క్రీడలపై సమీక్ష ఏంటని విపక్షాల నేతలు మండిపడుతున్నారు. ఆటలపై సమీక్షకు ఇదేనా సమయం అంటూ ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

వేదిక

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

జల విలయం

చినుకు కునుకు లేకుండా చేస్తున్నది. మబ్బులు భళ్లున బద్దలై వర్ష బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. నదులు ఉప్పొంగి పర్వతాల గుండెలను చీలుస్తున్నాయి. కొండచరియలు విరిగిపడుతుంటే రహదారులు కంపిస్తున్నాయి. జలవిలయంతో జనావాసాలు పేకమేడల్లా జలనిక్షిప్తం అయిపోతున్నాయి. దేశంలో గత కొద్దివారాలుగా సంభవిస్తున్న వరదలు ప్రకృతి ప్రళయావేశానికి అద్దం పడుతున్నాయి. గత మే-జూన్ మధ్యకాలంలో దేశంలో మొదలైన వరదల తాండవం అప్రతిహతంగా కొనసాగుతున్నది. అసోం, అరుణాచల్‌ప్రదేశ్ వంటి ఈశాన్య రాష్ర్టాలు, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్, పంజాబ్ వంటి ఉత్తరాది రాష్ర్టాలు భారీ వర్షాలు, ఆపై ముంచెత్తుతున్న వరదలతో అతలాకుతలం అవుతున్నాయి. కశ్మీర్‌లో వరదలకు 41 మంది దాకా బలైనట్టు వార్తలు అందుతున్నాయి. అందులో 34 మంది వైష్ణోదేవి మార్గంలోనే ప్రాణాలు కోల్పోయారు. దీంతో వైష్ణోదేవి యాత్రను నిలిపివేశారు. చండీగఢ్-మనాలి హైవేపై రాకపోకలు ఆగిపోయాయి. అటు పశ్చిమాన మహారాష్ట్రను వరదలు వణికిస్తున్నాయి. ముఖ్యంగా ముంబై నగరంపై వరదలు పగబట్టాయి. ఆర్థిక రాజధాని ఇంకా కోలుకోనే లేదు. ఈ పరిస్థితికి ఉత్తర-దక్షిణ, తూర్పు-పడమర తేడాలేమీ లేవు. కర్ణాటకలో ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాలు వర్ష బీభత్సంతో వణికిపోతున్నాయి. అంచనాకు అందని ఆస్తుల విధ్వంసం, అసాధారణమైన జననష్టం దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి.

ఇటు రాష్ట్రంలోనూ గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల నదులు, వాగులు, వంకలు, చెరువులు, కుంటలు అసాధారణమైన రీతిలో పొంగిపొర్లుతున్నాయి. వరదలు చుట్టుముట్టడంతో అనేక ప్రాంతాలు జలమయమై, జనజీవితం అస్తవ్యస్తమైంది. సుమారు 15 జిల్లాల్లో పరిస్థితి తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తున్నది. ముఖ్యంగా మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వరద ప్రభావం అధికంగా ఉన్నది. కామారెడ్డి జిల్లాలోని రాజంపేటలో 24 గంటల్లో 44 సెంటీమీటర్ల పైచిలుకు వర్షం కురిసింది. జిల్లాలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, రోడ్లపై సంచారం నిలిచిపోయింది. సిద్దిపేట, నిర్మల్ జిల్లాల్లోనూ వర్షాలు భారీగా పడుతున్నాయి. మంజీర, ఎగువ మానేరు ఉప్పొంగుతూ ఊళ్లను ముంచెత్తుతున్నాయి. ఏ రకంగా చూసినా రాష్ట్రంలో వరదల పరిస్థితి అసాధారణంగానే ఉన్నది. ప్రభుత్వ స్పందన అందుకు తగినట్టుగా లేదు. భారీ వర్షాల గురించి వాతావరణ శాఖ కొద్ది రోజులుగా హెచ్చరిస్తున్నా సర్కారు అప్రమత్తమై జాగ్రత్తలు తీసుకున్న దాఖలాలు లేవు. ముంపు ప్రాంతాల నుంచి ప్రజలను తరలించడానికి ఎలాంటి ప్రయత్నాలు జరగలేదు. వరదల్లో చిక్కుకున్న బాధితులను ముందస్తుగా కాపాడటంలోనూ ప్రభుత్వ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. ఓ వైపు వరద పరిస్థితి ప్రమాదకరంగా మారుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ గురించి సమీక్షించడం విడ్డూరం. అది చాలదన్నట్టుగా ఒలింపిక్స్‌ను రప్పించడం గురించి అర్జెంటుగా అధికారులతో చర్చించడం ఆయన ప్రాధాన్యతలను తెలియజేస్తున్నది.

ప్రస్తుతం పంట నష్టం ఎంత జరిగింది? ఆస్తి, ప్రాణ నష్టం ఎంత జరిగింది? ఎంత మంది విపత్తుల్లో ఉన్నారు? వారిని బయటపడేయటం ఎలా అనేది ఆలోచించాల్సిన రేవంత్ రెడ్డి పార్ట్-టైం సీఎం తరహాలో వ్యవహరిస్తున్నారు. తూతూమంత్రంగా ఏరియల్ సర్వే చేసి తన పని అయిపోయిందన్నట్టుగా చేతులు దులిపేసుకున్నారు. ఆయన అనుభవరాహిత్యం, అవగాహనా లోపం వల్ల చేతులు కాలిన తర్వాతైనా ఆకులు పట్టుకోని పరిస్థితి కనిపిస్తున్నది. సకాలంలో హెలికాప్టర్ రానందువల్ల రెండు నిండు ప్రాణాలు నీటిలో కలిసిపోవడం సర్కారు అలవిమాలిన నిర్లక్ష్యానికి నిదర్శనం. పెండ్లిళ్లకు, విందులకు అందుబాటులో ఉండే హెలికాప్టర్ ఆపద సమయంలో పైకి లేవకపోవడం ఎందుకో అంతుచిక్కడం లేదు. గత ప్రభుత్వ హయాంలో మొసలి కన్నీళ్లు కార్చిన కాంగ్రెస్ మంత్రులు కనీసం బాధితులను ఓదార్చడానికి, ఆదుకోవడానికి జిల్లాలకు వెళ్లకుండా అధికార సౌధాల్లో సమీక్షల పేరిట కాలక్షేపం చేస్తున్నారు. ఇక రాష్ర్టానికి చెందిన కేంద్రమంత్రుల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. ప్రకృతి బీభత్సాలు సంభవించినప్పుడు సైన్యం అందించే సహాయాన్ని తమ ఖాతాలో వేసుకుని రాజకీయాలు చేయాలని చూడటం అర్థరహితం. రాష్ట్ర సర్కారు ఇప్పటికైనా తన మొద్దునిద్ర వదిలించుకుని మరింత నష్టం జరగకుండా చర్యలు చేపట్టి, నష్టాన్ని అంచనా వేసే పనిని మొదలుపెట్టాలి. నష్టానికి తగిన సాయాన్ని కేంద్రాన్ని మెప్పించి, ఒప్పించి ఇక్కడి బీజేపీ నేతలు తేగలిగితే మంచిది.

తెలంగాణ వరదలకూ ఓ యుద్ధ చరిత్ర

డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ
94909 57078

ఈ ఆగస్టులో తెలంగాణలో వర్షాలు బాగా కురుస్తున్నాయి. సరిగ్గా 262 ఏండ్ల కిందట (1763లో) కూడా తెలంగాణలో బాగా వర్షాలు కురిసి గోదావరి వరదలతో ఉప్పొంగింది. ఆ కాలంలో భారతదేశంలో బలవంతులైన మరాఠాలను (శివాజీ వారసులను) ఎదుర్కొంటూ రెండో నిజాం అలీఖాన్ హైదరాబాద్‌కు దక్కన్ ప్రాంత రాజధానిని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో గోదావరి వరదలను ఆసరాగా తీసుకొని నిజాం తరపున పోరాడిన కౌలాస్ రాజాను (కామారెడ్డి జిల్లా) మరాఠాలు మట్టుబెట్టారు. అయినా నిజాం కౌలాస్ రాజా ధైర్యసాహసాలను మెచ్చుకొని ఆయన వారసులకు కౌలాస్‌తో పాటు మరిన్ని జాగీర్లు ఇచ్చాడు. దానితో రాజ్‌పుత్‌లు ఉత్తర తెలంగాణలో రాజరికం చేయడం మొదలుపెట్టి దేశానికి స్వాతంత్ర్యం వచ్చేదాకా పాలించారు. ఆ వివరాల్లోకి వెళ్తే...

ఉత్తర భారత్‌లో మరాఠా భూభాగమైన పుణేపై రెండో నిజాం అలీఖాన్ దళాలు దాడి చేశాయి. ఈ సంఘటన గురించి తెలుసుకున్న మరాఠా పేష్వా రఘునాథ్ రావు రెండో నిజాంను వెంబడించాడు. రెండో నిజాం మొదట ఔరంగాబాద్ వైపు తిరోగమించి, తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వెళ్లాలనుకున్నాడు. బీదర్ కోటలో వర్షాకాలం గడపాలనుకున్నాడు. మరాఠాలు కోపంగా ఉన్నారు. దారిలో రెండో నిజాం దళాన్ని నాశనం చేయాలనుకున్నారు. నిజాం సైన్యం రెండు భాగాలుగా విడిపోయినప్పుడు, మరాఠాలు నిజాం దళాలను వెంబడిస్తూ ఆ సమయంలో వస్తున్న గోదావరి వరదలను తెలివిగా వాడుకున్నారు. రాక్షస భువన్ అనే ప్రదేశంలో గోదావరి నది ఒడ్డున రెండో నిజాం, మరాఠాల మధ్య యుద్ధం జరిగింది. మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో గోదావరి నది ఒడ్డున ధరూర్ కోటకు ఉత్తరాన ఉన్న రాక్షస భువన్ ఒక చిన్న గ్రామం. పుణేను దోచుకున్న తర్వాత, రెండో నిజాం దాదాపు 1,00,000 ఏనుగులు, గుర్రాలు, ఫిరంగులు, పదాతిదళ సైనికులతో కూడిన సైన్యాన్ని ఔరంగాబాద్ నుంచి బలవంతంగా తరలించారు. దాదాపు 10 కిలోమీటర్ల పొడవైన కాన్వాయ్ రోడ్డుపై కదులుతున్నది (ఔరంగాబాద్- రాక్షస భువన్- లాతూర్- ఉద్గిర్- బీదర్ కోట). రెండో నిజాం సైన్యానికి ధైర్యవంతుడైన రాజా కున్వర్ అజయ్ సింగ్ గౌర్ నాయకత్వం వహించారు. తర్వాత ప్రధానమంత్రి విఠల్ సుందర్ ప్రతాప్వంత్ రావు, ఇతర నవాబులు నాయకత్వం వహించారు.

రాక్షస భువన్ సమీపంలోని గోదావరి వద్దకు సైన్యం చేరుకున్నది. రాజాకృష్ణ అజయ్‌చంద్ గౌర్, ప్రధానమంత్రి నేతృత్వంలోని నిజాం అడ్వాన్స్ గార్డులో ఒక భాగం 7-8 వేల మంది సైనికులతో కలిసి గోదావరిని దాటి రాత్రి బస చేశారు. 1763 ఆగస్టు 8, 9 తేదీల్లో భారీ వర్షాలు కురిశాయి. అకస్మాత్తుగా గోదావరికి వరద పోటెత్తింది. గోదావరి ఉత్తర ఒడ్డున ఉన్న నిజాం సైన్యం నుంచి రాజాకృష్ణ అజయ్ చంద్ గౌర్ దళం విడిపోయింది. పేష్వా రఘునాథ్‌రావు రెండో

నిజాంను దగ్గరగా వెంబడిస్తున్నాడు. పరిస్థితిని సద్వినియోగం చేసుకొని, మరాఠాలు దాదాపు 8 వేల మంది సైనికులతో కూడిన రాజా అజయ్‌చంద్ దళంపై ఆకస్మిక దాడిని ప్రారంభించారు.

మరాఠా సైన్యంలో 50 వేల మంది సైనికులు, గుర్రాలు, ఫిరంగులున్నాయి. రెండు రోజుల పాటు భారీ యుద్ధం జరిగింది. నిజాం సైన్యం, మరాఠాల సైన్యం నిష్పత్తి 1:5 సైనికులు. రాజా అజయ్ చంద్ గౌర్ రాజ్‌పుత్‌లు, గార్దీల (ముస్లిం తెగ)తో కలిసి చాలా ధైర్యంగా పోరాడారు. మరాఠాలు ఫిరంగులను తీసుకువచ్చి గుర్రాలతో దాడి చేశారు. రోజంతా మరాఠాల దాడులు కొనసాగాయి. రాజా అజయ్‌చంద్ గౌర్ తన చివరి మనిషి/ శ్వాస వరకు నిజమైన ధైర్యవంతుడైన రాజ్‌పుత్‌లాగా పోరాడాడు. 1763 ఆగస్టు 10న అతను తీవ్రంగా గాయపడ్డాడు కానీ యుద్ధభూమిని విడిచిపెట్టడానికి నిరాకరించాడు. ప్రధానమంత్రి విఠల్ దాస్ ప్రతాప్వంత్ రావు కూడా ధైర్యంగా పోరాడి మరణించారు. రాజా అజయ్‌చంద్ గౌర్ సైన్యం సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ వీరోచితంగా పోరాడుతూనే ఉన్నది. చివరికి ఆగస్టు 11న ప్రధానమంత్రి, రాజా అజయ్ చంద్ గౌర్ అమరులయ్యారు. తర్వాత గోదావరి నది ఒడ్డున రాజా అజయ్‌చంద్ గౌర్ సమాధిని నిర్మించారు. నేటికీ ఆ సమాధి ఉన్నది. ప్రత్యక్ష సాక్షులుగా ఉండి గాయపడిన కొద్దిమంది సైనికులు మాత్రమే తమ రాజుల ధైర్యసాహసాల వివరాలను రెండో నిజాంకు వివరించారు. యుద్ధ సమయంలోనూ పరిస్థితి గురించి నిజాం తెలుసుకున్నాడు, కానీ వరదల కారణంగా ఎటువంటి బలగాలను పంపలేకపోయాడు. నిజాం చేసిన వ్యూహాత్మక తప్పిదం, చివరి నిమిషంలో నిజాం సైన్యాన్ని విడిచిపెట్టిన మరాఠా సర్దార్ల వెన్నుపోటు కారణంగా ధైర్యవంతులైన రాజా కున్వర్ అజయ్ చంద్ గౌర్, గోపాల్ సింగ్ సవాయి, ప్రధానమంత్రి రాజా ప్రతాప్వంత్ రావు, మరికొందరు నవాబులు కూడా అమరులయ్యారు. రెండు రోజుల పాటు జరిగిన ఆ యుద్ధంలో నిజాం దాదాపు 500 గుర్రాలను, 8,000 మంది సైనికులను కోల్పోయాడు. తన అత్యంత సమర్థుడైన జనరల్‌ను కోల్పోవడంతో నిజాం పూర్తిగా నిరాశ చెందాడు. రాజా అజయ్‌చంద్ గౌర్ ధైర్యసాహసాల గురించి తెలుసుకొని, అతని కుటుంబాన్ని ఓదార్చడానికి కాందహార్ కోటకు వెళ్లాడు.

> కాందహార్ కోట వద్ద ఈ వార్త విని రాజకుటుంబం దిగ్భ్రాంతికి గురైంది. రాజుల అత్యుత్తమ ధైర్యసాహసాలకు నిజాం ఎంతో ముగ్ధుడై ఆ కుటుంబానికి మరో మూడు జాగీర్లను బహుమతిగా ఇచ్చాడు.

రాజా అజయ్ చంద్‌గౌర్‌కు ముగ్గురు కుమారులు. రాజా కున్వర్ లాల్ కబీర్‌సింగ్ గౌర్, రాజా కున్వర్ పదమ్‌సింగ్ గౌర్, చిన్న రాజా కున్వర్ తేజ్ సింగ్ గౌర్. పెద్దవాడు కబీర్ సింగ్ కాందహార్ కోటను వారసత్వంగా పొందాడు. రాజా అజయ్‌చంద్ గౌర్ తమ్ముడు రాజా కున్వర్ నర్పత్‌సింగ్‌కు మాహోర్ కోట జాగీర్, రాజా కున్వర్ తేజ్ సింగ్ గౌర్‌కు సతారా జిల్లా కన్నెర్ ఖేడ్‌లోని కొన్ని వందల గ్రామాల జాగీర్ ఇవ్వబడింది. చిన్న కుమారుడు పదమ్‌సింగ్‌కు నిజామాబాద్‌లోని కౌలాస్ కోట జాగీర్‌ను ఇచ్చారు. ఆయన, ఆయన వారసులు 120 గ్రామాల పరిధి గల కౌలాస్ కోట సామంత రాజ్యాన్ని 1948 వరకు ప్రజలతో మమేకమై సుభిక్షంగా పాలించారు. వెయ్యేండ్ల చరిత్ర గల కౌలాస్ కోట ఇప్పుడు ఒక దర్శనీయ స్థలం.

ఉపాధ్యాయుల గౌరవానికి భంగం

ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) అనే మొబైల్ యాప్ ద్వారా హాజరు వేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉపాధ్యాయుల ఆత్మగౌరవానికి భంగం కలిగిస్తున్నది. ఈ నిర్ణయం ఉపాధ్యాయులను అవమానించడమే కాదు, వారి నిబద్ధతపై అపనమ్మకం చూపించడం కూడా. ఉపాధ్యాయులు సమాజానికి మూలస్తంభాలు. వారు చదువు చెప్పేవాళ్లే కాదు, విద్యార్థులకు మార్గదర్శకులు, స్ఫూర్తిదాతలు. అలాంటి ఒక గౌరవనీయమైన వృత్తిని ఒక మొబైల్ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించడం వారి ఆత్మగౌరవాన్ని కచ్చితంగా దెబ్బతీస్తుంది. ఈ చర్య ద్వారా ఉపాధ్యాయ వృత్తిని తక్కువచేసి చూడటమే అవుతుంది.

ఉపాధ్యాయుల పనితీరుపై ఈ ప్రభుత్వానికి నమ్మకం లేదనడానికి ఈ చర్యే ఒక ఉదాహరణ. నిజాయితీగా, నిబద్ధతతో పనిచేసే లక్షలాది మంది ఉపాధ్యాయులను ఇది అవమానించినట్లే. కొద్దిమంది ఉపాధ్యాయులు గైర్హాజరైనంత మాత్రాన, యావత్తు ఉపాధ్యాయ వర్గాన్ని నిఘా నీడలోకి తీసుకురావడం సరికాదు. ఈ విధానం ఉపాధ్యాయుల పట్ల సమాజానికి ఒక చెడు సంకేతాన్ని పంపుతుంది. ఉదయం, సాయంత్రం హాజరు వేసే సమయంలో సిగ్నల్ సరిగా రాక ఉపాధ్యాయులు చేతిలో మొబైల్ ఫోన్ పట్టుకొని పాఠశాల ఆవరణ మొత్తం తిరుగాల్సి వస్తున్నది. దీంతో విద్యార్థులు చాలా వింతగా చూస్తుండటం ఉపాధ్యాయులను అసౌకర్యానికి గురిచేస్తున్నది.

ఉపాధ్యాయులు సకాలంలో హాజరవుతున్నారా లేదా అని పర్యవేక్షించడానికి పాఠశాల స్థాయిలో ప్రధానోపాధ్యాయులు, మండలస్థాయిలో మండల విద్యాశాఖాధికారులు, జిల్లా స్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారులున్నారు. ఉపాధ్యాయులు ఎవరైనా సమయపాలన పాటించకపోతే వీరు షోకాజ్ నోటీసుల లాంటివి జారీచేసి చర్యలు తీసుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 612 మండలాలు ఉంటే, 596 మండలాలలో ఎంఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 66 డిప్యూటీ విద్యాధికారి పోస్టులుంటే, అందులో 64 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 33 జిల్లాలుంటే, 26 జిల్లాలో డీఈఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విధంగా ఖాళీగా ఉన్న పర్యవేక్షణాధికారుల పోస్టులను భర్తీ చేయాల్సిన ప్రభుత్వం మొబైల్ యాప్ ద్వారా ఉపాధ్యాయులను పర్యవేక్షించాలనుకోవడం నిజంగా అవివేకమే.

అధికారంలోకి వస్తే విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 7.57 శాతం నిధులను మాత్రమే కేటాయించి మోసం చేసింది. ఈ విషయాన్ని విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు గమనిస్తున్నాయి. తమకు రావాల్సిన డీఏల కోసం, పెండింగ్ బిల్లుల కోసం, పీఆర్సీ కోసం ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తుంటే, మరొకవైపు ప్రభుత్వం మొబైల్ యాప్ ద్వారా హాజరు వేయాలని ఉపాధ్యాయులను అభద్రతా భావానికి గురిచేస్తున్నది. అయినా, విద్యా ప్రమాణాలు పెరగాలంటే, ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచి, వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

పల్లె నాగరాజు
85004 31793
(తెలంగాణ ప్రోగ్రెస్సివ్ టీచర్స్ ఫెడరేషన్)

లోక్‌పాల్‌ను నీరుగార్చి కొత్త చట్టమా?

వెంకట్ పర్సా

ప్రధాని, కేంద్రమంత్రులు, ఎంపీలపై వెల్లువెత్తే అవినీతి ఆరోపణలపై విచారణ జరపడానికి వారిని లోక్‌పాల్, లోకాయుక్త చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. 2013 డిసెంబర్ 17న రాజ్యసభలో, డిసెంబర్ 18న లోక్‌సభలో ఈ బిల్లు పాసైంది. 2014 జనవరి 1న రాష్ట్రపతి ఆమోదం తర్వాత, 2014 జనవరి 16 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. ప్రధానిని జవాబుదారీగా చేయడమే లక్ష్యమైతే, లోక్‌పాల్ చట్టాన్ని అమలుచేయవచ్చు. కానీ, ఈ చట్టం గత 11 ఏండ్లుగా అమలుకాలేదు. ఎందుకంటే, పీఎం కేర్స్ ఫండ్, ఎలక్టోరల్ బాండ్లు, రాఫెల్ ఒప్పందం వంటి వాటిపై వచ్చిన ఆరోపణలు లోక్‌పాల్ పరిధిలోకి వస్తాయి. ఈ నేపథ్యంలో ఆగస్టు 20న లోక్‌సభలో ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు బహుశా కొత్త ప్రచారాన్ని తెరపైకి తెచ్చేందుకు, ఒక దారి మళ్లింపు వ్యూహంగా కనిపిస్తున్నది.

ప్రధానిని తొలగించే బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడమనేది పతాక శీర్షికలకు ఎక్కేందుకు పన్నిన చాకచక్యమైన వ్యూహం. పైకి కనిపిస్తున్నట్టు కాకుండా లక్ష్యం వేరే ఉంది. కానీ, ఫోకస్ మాత్రం తప్పుదారి పట్టించేలా ఉంది. ప్రతిపక్ష పాలిత రాష్ర్టాల ముఖ్యమంత్రులు ఇప్పుడు బీజేపీ సర్కారుకు లక్ష్యంగా మారారు. వీరిపై గతంలో నమోదైన ఏదైనా పెండింగ్ కేసును తిరగదోడి బలవంతంగా ఈ చట్టాన్ని అమలు చేసే అవకాశం లేకపోలేదు.

30 రోజులపాటు జైలులో ఉంటే ప్రధాని లేదా కేంద్రమంత్రి లేదా ముఖ్యమంత్రిని ఆ పదవి నుంచి తొలగించాలనే నిబంధన వెనుక ఈ వ్యూహమే ఉన్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉపా, మనీ లాండరింగ్ లాంటి చట్టాల కింద నమోదైన కేసుల్లో ఈ నిబంధనను ఉపయోగించి కనీసం ఆరు నెలల పాటు ముఖ్యమంత్రికి బెయిల్ రాకుండా నిరాకరించవచ్చు. ఎన్నికలు లేకుండానే 30 రోజుల్లోనే ప్రభుత్వ మార్పును ఇది సులభతరం చేస్తుంది. పైగా ఎలాంటి ఆదేశాలు అవసరం లేకుండానే ఈ ప్రక్రియ జరిగిపోతుంది. ఒకవేళ ఏదైనా కేసులో ప్రధాని జైలులో ఉండి 31వ రోజున ఆ పదవి నుంచి తొలగించబడితే, 130వ రాజ్యాంగ సవరణ బిల్లులో పేర్కొన్నట్టు.. ప్రధాని మాత్రమే కాదు, మొత్తం ప్రభుత్వమే కుప్పకూలిపోతుంది. ఇది మానవ విశ్వాసాన్ని అత్యంత అధమస్థాయికి లాగేయడమే. వాస్తవానికి ప్రతిపక్ష ప్రభుత్వాలను పడగొట్టడమే ఇలాంటి మార్గాల అసలు లక్ష్యం. ఇది దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరింతగా క్షీణింపజేస్తుంది.

సంచలనం కోసం మాత్రమే ప్రధాని పేరును కూడా ఈ బిల్లులో చేర్చారని చెప్పవచ్చు. ఇలాంటి పలుచనైన బిల్లులో ప్రధానిని కూడా చేర్చడం వెనుక ఈ వ్యూహం కాకపోతే ఇంకేం ఉంటుంది? దేశ ప్రధానిని ఒక ఎఫ్ఐఆర్ ఆధారంగా, దర్యాప్తు లేకుండా, న్యాయపరమైన విచారణ చేయకుండా, కోర్టులో దోషిగా నిర్ధారణ కాకుండా పదవి నుంచి తొలగించడం సాధ్యం కాదు. ఒకవేళ తొలగించాల్సి వస్తే, అది అత్యంత దారుణమైన జంగిల్‌రాజ్ అవుతుంది. కేంద్రం లేదా రాష్ర్టాల్లోనైనా అత్యున్నత స్థాయి కార్యనిర్వాహక పదవిలో ఉన్న వ్యక్తిని ఇలాంటి సాధారణ మార్గంలో తొలగించడం పార్లమెంటరీ వ్యవస్థను అపహాస్యం చేస్తుంది. ఆరోపణల ఆధారంగా, వాటిని దర్యాప్తు చేయకముందే,

న్యాయపరమైన విచారణ జరగకముందే, కోర్టులో దోషిగా తేలకముందే తొలగింపు జరగాలని చెప్పడం విషాదకరం.

> ఇప్పటికే ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అరవింద్ కేజ్రీవాల్, జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ జైలుపాలైన నేపథ్యంలో ఈ రాజ్యాంగ సవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదిగా అనిపిస్తున్నది. ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఢిల్లీ మంత్రి సత్యేందర్ జైన్ కూడా గతంలో జైలుపాలైన విషయం విదితమే. ఈ నేపథ్యంలోనే ఈ బిల్లు ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ర్టాల ముఖ్యమంత్రులను ఆ పదవుల నుంచి తొలగించే వ్యూహంగా కనిపిస్తున్నది.

పార్లమెంటరీయేతర మార్గాల ద్వారా ప్రధానిని, ముఖ్యమంత్రిని తొలగించడం గురించి చాలా కాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. లోక్‌పాల్‌పై అన్నాహజారే చేసిన ఉద్యమాన్ని బీజేపీ-ఆప్ నాడు అవినీతికి వ్యతిరేకంగానే నిర్వహించాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని నీరుగారుస్తూ పార్లమెంటరీయేతర మార్గాల్లో ప్రధానిని తొలగించాలన్న లక్ష్యంతోనే వారు ఉద్యమించారు. కాంగ్రెస్ సర్కారు లోక్‌పాల్‌ను చట్టంగా చేసింది. కానీ, లోక్‌పాల్ కోసం ఉద్యమం చేసిన బీజేపీ దాన్ని మూలన పడేసింది. మరోసారి పార్లమెంటరీ యేతర మార్గాల్లో ప్రధాని, ముఖ్యమంత్రిని తొలగించాలనే లక్ష్యంతో ఇప్పుడు 130వ రాజ్యాంగ సవరణ బిల్లు చుట్టూ మరో ప్రచారం చేస్తున్నారు.

ఇది ఆందోళన కలిగించే ధోరణి. దేశంలో దశాబ్దాలుగా ఎంతో కష్టపడి కాపాడుకుంటూ వస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేసే సామర్థ్యం ఈ బిల్లుకు ఉంది. గతంలో లోక్‌పాల్ ఉద్యమం కూడా ఇదే రకమైన లక్ష్యంతో జరిగింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వం తీసుకొస్తున్న 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ఈ లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ఉద్దేశించినట్టు కనిపిస్తున్నది. నిజాయితీగా చెప్పాలంటే, దేశంలో ఏ పోలీస్ స్టేషన్‌లోనైనా ప్రధానిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ఆయనను అరెస్టు చేసి 30 రోజుల పాటు జైలులో ఉంచడం సాధ్యపడుతుందా? మన దేశంలో బ్రిటిష్ మోడల్ పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అమల్లో ఉన్నది. ఈ విధానం ప్రకారం కేంద్రంలో ప్రధాని, రాష్ట్రంలో ముఖ్యమంత్రి సభల్లో విశ్వాసాన్ని కలిగి ఉన్నంతకాలం వారు అధికారంలో ఉంటారు. వారిని ఆ పదవి నుంచి తొలగించాలంటే.. వానాకాలం లేదా శీతాకాల సమావేశాల్లో అవిశ్వాస తీర్మానాన్ని సభ ఆమోదించాల్సి ఉంటుంది. లేదా బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక బిల్లు, ఏదైనా ద్రవ్య బిల్లు సభలో వీగిపోయేలా చేయాలి. ఇది చట్టబద్ధమైన మార్గం.

జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిన ఈ బిల్లు ప్రధాని లేదా కేంద్ర మంత్రిని, రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా మంత్రిని తొలగించేందుకు ఉద్దేశించినది. ఒకవేళ బెయిల్ లభించకపోతే 31వ రోజున ఆటోమేటిక్‌గా వారు తమ పదవుల నుంచి తొలగించబడతారు. అందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 75 (కేంద్ర మంత్రి కోసం), 164 (రాష్ట్ర ముఖ్యమంత్రి లేదా మంత్రి కోసం), 239ఏఏ (కేంద్రపాలిత ప్రాంతం ప్రతినిధి కోసం) ఆర్టికల్స్‌ను సవరించాల్సి ఉంటుంది. దోషిగా నిర్ధారణ అయ్యేంత వరకు నిర్దోషిగానే భావించాలనేది న్యాయశాస్త్రంలో మూల సూత్రం. అయితే, ఈ బిల్లు ఈ సూత్రాన్ని నీరుగారుస్తున్నది. అంతేకాదు, తాను నిర్దోషి కాదని నిరూపించుకోవాల్సిన బాధ్యత కూడా విచారణ ఎదుర్కొనేవారిపైనే ఉంటుంది. ఆ నిరూపణ కూడా సందేహాలకు అతీతంగా ఉండాలి.

సుదీర్ఘకాల నిర్బంధ కాలానికి ఇలా చట్టపరమైన ఆమోదం ఇవ్వడం సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకం. విచారణకు ముందు నిర్బంధం ఒక రకమైన శిక్షగా భావిస్తే అది నిర్దోషి, నేరస్థుడికి మధ్య ఉన్న సన్నని గీతను చెరిపివేస్తుంది. ఉపా, మనీ లాండరింగ్ లాంటి భయంకరమైన చట్టాల ద్వారా నిర్బంధ కాలాన్ని పొడిగించడమే లక్ష్యంగా కనిపిస్తున్నది. ఈ చట్టాలను ఉపయోగించి నిర్బంధ కాలాన్ని పొడిగించవచ్చు, పదవి నుంచి తొలగించడానికి ఆధారంగానూ ఉపయోగించుకోవచ్చు. ఇటువంటి చర్యలు, వ్యూహాలు దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య పునాదులను శాశ్వతంగా దెబ్బతీస్తాయి.

కింది కులాల వారిని ఎదగకుండా అణచివేసే ప్రయత్నం చరిత్రలో అడుగడుగునా కనబడుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థగా పేరుగాంచిన మన దేశంలోని జనాభాలో సగానికి పైగా ఉన్న వీరికి పాలనా అవకాశాలు దక్కే పరిస్థితులు ఇప్పటికీ ఏర్పడలేదు. ఈ విషయంలో జాతీయ కాంగ్రెస్ పార్టీకి సుదీర్ఘ చరిత్రనే ఉన్నది. గతంలోకి వెళ్తే బాబా సాహెబ్ అంబేద్కర్‌ను రాజ్యాంగ నిర్మాణ కమిటీలోకి రాకుండా అడ్డుకున్నది కాంగ్రెసే. దళితుడైన బాబు జగ్జీవన్‌రామ్‌ను ప్రధానిని చేయకుండా బయటకు పంపింది ఆ పార్టీనే. ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో ఒక్క దామోదరం సంజీవయ్య తప్ప దళిత, బహుజనులను సీఎం పదవి దరిదాపుల్లోకి కూడా రానివ్వలేదు. అది కూడా కొద్ది రోజులు. అలాంటి పార్టీ నుంచి రాష్ర్టానికి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి బహుజన ఉద్ధారకుడిగా మాట్లాడటం వింతగా ఉన్నది.

బహుజన వ్యతిరేకి కాంగ్రెస్

బద్రినర్సన్
94401 28169

నిజానికి నేటిదాకా ఎస్సీ, ఎస్టీ, బీసీలు సామాజికంగా, రాజకీయంగా ఏమైనా సాధించుకున్నారంటే అది కేవలం వారి పట్టుదల, పోరాట పటిమతోనే సాధ్యపడింది. అనివార్య పరిస్థితుల్లోనే ఆధిపత్య కులాలు బహుజనులకు కొద్దో గొప్పో అవకాశాలు ఇస్తున్నాయి. గత డెబ్బై ఏండ్లుగా చదువుకు చేరువైన కింది కులాలు స్వశక్తితో, రిజర్వేషన్ల ఆసరాతో తెలివికి వస్తున్నాయి. విద్య వల్ల ఒనగూరిన మేధస్సుతో రాజ్యాంగపరంగా తమ హక్కుల కోసం గొంతెత్తుతున్నాయి. ఇక వీరిని మభ్యపెట్టలేమనే ఆలోచనతో రాజకీయ పార్టీలు బహుజనులకు కొంతలో కొంత అవకాశాలను కలిగిస్తున్నాయి. అయితే, ఈ మాత్రానికే చరిత్రను తిరగరాసినట్టుగా మన ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారు. 25వ తేదీన ఓయూలో హాస్టల్ భవనాలను ఆరంభించిన రేవంత్‌రెడ్డి ఠాగూర్ ఆడిటోరియంలో ప్రసంగించారు. ఆ సదస్సులో 'తెలంగాణ విద్యారంగంలో రావాల్సిన మార్పులు, ప్రభుత్వ ప్రణాళిక' అనే అంశంపై ఆయన మాట్లాడవలసి ఉన్నది. టాపిక్ ఎంతో ఉన్నతమైన, అవసరమైన విషయమే అయినా సీఎం మాట్లాడినదంతా తనను, తన పాలనను, తన ప్రభుత్వాన్ని కీర్తించుకున్నట్టుగా ఉన్నది. పైగా కొన్ని మాటలు సభికులకు మనస్తాపం కలిగించేలా కూడా ఉన్నాయి.

ఓయూ చరిత్రలో తొలిసారిగా ఒక దళితుడిని వైస్ ఛాన్సలర్‌గా తానే నియమించానని రేవంత్ పదే పదే తన ప్రసంగంలో ప్రస్తావించారు. తన పేరెత్తినప్పుడు వీసీ కుమార్ తప్పదన్నట్టు లేచి నిలబడ్డారు. ఆయనే కాకుండా కష్టపడి చదువుకొని ఉన్నత స్థానాలు పొందిన బహుజనుల పేర్లు కూడా సీఎం ఆ సభావేదిక నుంచి ఉటంకించారు. సభికుల్లో ఉన్నవారు తమ పేరు ముఖ్యమంత్రి నోట రాగానే లేచి కృతజ్ఞతాపూర్వకంగా అభివాదం చేశారు. వారందరిని తానే పైకి తెచ్చాననే భావన ఆయన మాటల్లో స్ఫురించింది. పేదరికంలో పుట్టి పెరగడం వల్ల వీసీ, తదితర అధికారులకు వంద కోట్ల నిధులు అడగడానికి నోరు రావడం లేదని రేవంత్ అన్నారు. ఉన్నతస్థాయిలో ఉన్న వారిలో ఇంకా పేదరికపు వాసనలు పోలేదని వారిని ఎద్దేవా చేయడమే ఈ మాటల ఆంతర్యంగా భావించాలి. అద్దంకి దయాకర్ ఎమ్మెల్సీ, లక్ష్మణ్‌కుమార్ మంత్రి కావడం వెనుక ముఖ్యమంత్రి హస్తం ఉండొచ్చు. ఒక విద్యావేత్త ఉన్నత పదవి వెనుక సొంత కృషినే ఎక్కువగా ఉంటుంది. నిజంగా ఒక బహుజనుడిని వీసీ చేయాలనీ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉంటే ఇన్నేండ్లు రెడ్డిలనే ఆ సీట్లో ఎందుకు కూర్చోబెట్టిందో సమాధానం చెప్పాలి. సందు దొరికినప్పుడల్లా ఒక కింది కులానికి చెందిన వ్యక్తి కులాన్ని నలుగురిలో ప్రస్తావించడానికి పైకులాల వారికి సంబరమేమో కానీ ఆ బాధ అనుభవించే వారికే తెలుస్తుంది. విశ్వవిద్యాలయంలో విద్య, దాని అభ్యున్నతికి ప్రభుత్వం పాత్ర గురించి చెప్పకుండా సభలో ఉన్నవారి, లేనివారి కులాల ప్రస్తావన ముఖ్యమంత్రికి ఎందుకు? కోదండరాం ఎమ్మెల్సీ పదవిపై వేసిన కేసు సుప్రీంకోర్టులో తదుపరి విచారణలో ఉన్నది. తన ప్రసంగంలో ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ 15 రోజుల్లో ఆయనను మళ్లీ ఎమ్మెల్సీని చేస్తా, దానిపై 'ఎవడు అడ్డమస్తడో చూస్తా' అని సీఎం స్థాయిలో విద్యార్థుల సభలో అనడం భావ్యమేనా?

> హాలులో ఉన్నవారందరూ పేదరికంలో మగ్గుతున్నట్టు, తన రాకతో అందరి బతుకులు మారిపోతాయన్నట్టు ఆయన మాట్లాడటం సబబు కాదు. అదేమీ ఎస్సీ, ఎస్టీ వసతి గృహం కాదు. అన్నివర్గాల వారు ఓయూలో ఉన్నారు. ఏ సామాజిక, ఆర్థిక నేపథ్యం ఉన్నవారైనా అందరూ ఓయూ విద్యార్థులే తమను తాము ఉద్ధరించుకొనే విద్వత్తు, ప్రభుత్వాలను మార్చేసే చైతన్యం వారిలో ఉన్నది. ఎన్ని కోట్లయినా మంజూరు చేస్తాననగానే చప్పట్లు, ఈలలు వేసిన విద్యార్థులే రేపు మాట తప్పితే ఊరుకొనే బాపతు కాదు.

ఉస్మానియా యూనివర్సిటీని ఆక్స్‌ఫర్డ్ స్టాన్‌ఫర్డ్‌ల స్థాయికి తీసుకువెళ్తానని మాట మాత్రంగా అనడం తేలికే. వాస్తవానికి ఓయూ కోర్సుల్లో ఎన్నో సంస్కరణలు అవసరం. ఆర్ట్స్ కాలేజీలో అందుబాటులో ఉన్న కామర్స్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, జర్నలిజం కోర్సులు మినహా మిగతా వాటికి ఉద్యోగ అవకాశాలు తగ్గిపోతున్నాయి. సైన్స్ కోర్సుల్లో పరిశోధనా సదుపాయాలను మెరుగుపరచవలసి ఉన్నది. ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ఆల్ ఇండియా ర్యాంక్ 61 నుంచి 73కు పడిపోయింది. క్యాంపస్‌లోని హాస్టళ్ల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నట్లు వార్తలు వస్తుంటాయి. అధ్యాపకుల, ఉద్యోగుల సంఖ్య సగానికి పడిపోయింది. కాలేజీ భవనాలు, విద్యార్థుల వసతి గృహాలు, ఉద్యోగుల క్వార్టర్లు అన్ని కలిసి ఆ ఆవరణనే ఓ పురాతన భవనాల సముదాయంగా మిగిలిపోయింది. పూర్వవైభవం రావాలంటే నిధులతో పాటు ఎన్నో సంస్కరణలు అవసరం. నేటి కాలానికి సరిపడే కోర్సులను ప్రవేశపెట్టాలి. ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి ఏదో కొలువు దొరికే చదువు, నైపుణ్యం అందాలి. ఒక్క పోలీసు లేకుండా ఆర్ట్స్ కాలేజీ ముందు మరో మీటింగ్ పెడతానన్న ముఖ్యమంత్రి అప్పుడు ఏమంటారో చూడాలి.

కేసీఆర్ బద్నానికే కాళేశ్వరంపై కుట్రలు

పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరంపై కుట్రలు చేస్తున్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఆరోపించారు. వందేండ్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ గొప్ప ప్రాజెక్టును నిర్మించారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్ ఆర్థర్ కాటన్ తరహాలో కేసీఆర్ ప్రజల గుండెల్లో నిలిచిపోతారనే అసూయతో మేడిగడ్డ పిల్లర్‌కు మరమ్మతులు చేయించడంలేదని విమర్శించారు. కేసీఆర్‌పై కక్షతో రాష్ట్ర ప్రజల నోట్లో మట్టి గొట్టడం విడ్డూరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కండ్లు తెరిచి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ ప్రజానీకం క్షమించదని హెచ్చరించారు.

రాష్ట్ర లీగల్ సెక్రటరీగా పాపిరెడ్డి

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ) : మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ జడ్జి బీ పాపిరెడ్డిని రాష్ట్ర న్యాయ, లెజిస్లేటివ్ వ్యవహారాల కార్యదర్శిగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నియామకం డిప్యూటేషన్ పద్ధతిపై ఉంటుందని, బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సంవత్సరంపాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. రాష్ట్ర హైకోర్టు పంపిన న్యాయమూర్తుల జాబితా నుంచి ప్రభుత్వం పాపిరెడ్డిని ఎంపికచేసినట్టు పేర్కొన్నది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా డబిల్‌పూర్ పాపిరెడ్డి స్వగ్రామం. 2001లో ఎల్‌ఎల్‌బీ చేశాక ఎన్‌రోల్ అయ్యారు. 2005లో ఎల్‌ఎల్‌ఎం పూర్తిచేశారు. 2001 నుంచి 2013 వరకు హైదరాబాద్ సివిల్, క్రిమినల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు.

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా కాత్యాయనీదేవి

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా పీ కాత్యాయనీదేవిని ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు ఈ స్థానంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ కొనసాగారు. ఈనెల 1నుంచి సెలవుల్లో వెళ్లడంతో ఆమె స్థానంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీగా పీ కాత్యాయనిదేవికి పూర్తిస్థాయి బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు.

'గిరిజన' టీచర్లను విస్మరించడం సరికాదు

వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలి : టీఎస్‌యూటీఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న టీచర్లతోపాటు గిరిజన ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించడం బాధాకరమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి, ఏ వెంకట్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వెంటనే ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు.

వర్కింగ్ జర్నలిస్టులకు 3న ఏఐపై శిక్షణ

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల కోసం తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న "ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ -ఏఐపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు తెలంగాణ ప్రెస్ అకాడమీ కార్యదర్శి ఎన్ వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాంపల్లి చాపెల్ రోడ్డులోని అకాడమీ ఆడిటోరియంలో ఉదయం 10గంటల నుంచి 1గంట వరకు వర్క్‌షాప్ జరుగుతుందని చెప్పారు. వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి గల జర్నలిస్టులు పేరు, పనిచేస్తున్న మీడియా సంస్థ, ప్రదేశం, మొబైల్ నంబర్ వివరాలు తెలుపుతూ అకాడమీ వాట్సాప్ నంబర్ 7093600977కు సెప్టెంబర్-2వ లోగా నమోదు చేసుకోవాలని కోరారు. ముందుగా నమోదు చేసుకున్న అర్హత గల 50మంది జర్నలిస్టులకు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

ఓటర్ల ప్రక్రియ రీషెడ్యూల్ చేయండి

- ఎలక్షన్ కమిషన్‌కు బీఆర్‌ఎస్ వినతి
- వరద విపత్కర పరిస్థితుల నుంచి బయటపడేదాకా వాయిదాకు విజ్ఞప్తి
- ఓటరు లిస్ట్‌లో అక్రమాలకు అవకాశం
- నాయకులు అప్రమత్తంగా ఉండాలి
- ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దాసోజు, లీగల్‌సెల్ ఇన్‌చార్జి భరత్ కుమార్ ఆధ్వర్యంలో కమిటీ
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ) : భారీ వర్షాలు, వరదల దృష్ట్యా రాష్ట్ర ఎన్నికల సంఘం కరుణ, బాధ్యతతో వ్యవహరించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దాసోజు శ్రవణ్ విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో ఏర్పడ్డ విపత్కర పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఓటర్ల జాబితా రూపకల్పన ప్రక్రియను రీషెడ్యూల్ చేయాలని కోరారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు గ్రామ పంచాయతీ ఓటరు జాబితాను సిద్ధం చేసే షెడ్యూల్‌ను వాయిదా వేయాలని, జిల్లా అధికారులతో సంపూర్ణ సమీక్ష తర్వాత కొత్త షెడ్యూల్ ప్రకటించాలని, ఓటర్లు, అధికారులు ఇబ్బందులు పడకుండా, పారదర్శకంగా, ప్రజలు పాలుపంచుకునేలా, మానవీయ దృష్టితో ప్రక్రియ జరగాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీ నేతలు మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేశ్ కుమార్, పార్టీ లీగల్‌సెల్ నాయకులు వేణుగోపాల్, లలితారెడ్డి తదితరులు గురువారం హైదరాబాద్‌లో ఎలక్షన్ కమిషన్ సంయుక్త కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు.

కష్ట సమయంలో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

భారీ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా అనేక గ్రామాలు ముంపునకు గురయ్యాయని, పంటలు, పశు సంపదకు తీవ్ర నష్టం వాటిల్లిందని బీఆర్‌ఎస్ నాయకులు వాపోయారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు ముంపునకు గురై, కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించాయని చెప్పారు. ఇలాంటి కష్ట సమయంలో ప్రజలను ఓటరు జాబితా ధ్రువీకరణకు రావాలని అడగడం అమానవీయమని పేర్కొన్నారు. ప్రజలు తమ ప్రాణాలను కాపాడుకోడానికి పోరాడుతున్న వేళ, పరిపాలన మొత్తం రక్షణ చర్యల్లో నిమగ్నమైన సమయంలో ఎన్నికల జాబితా తయారీ సాధ్యం కాదని, రక్షణ చర్యలతో పాటు ఎన్నికలు సాగలేవని స్పష్టంచేశారు.

ఓటరు లిస్ట్‌లో అక్రమాలకు అవకాశం: కేటీఆర్

ఓటరు జాబితాల తయారీలో ప్రభుత్వం అక్రమాలకు పాల్పడే అవకాశం ఉన్నదని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. సర్కారు కుట్రలను తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎలాగైనా స్థానిక ఎన్నికల్లో గెలిచేందుకు అధికార కాంగ్రెస్ కుతంత్రాలకు తెరలేపే అవకాశం ఉన్నదని చెప్పారు. ఓటరు జాబితాలో పేర్లు లేని వారు తమ అభ్యంతరాలను చెప్పుకొనేందుకు తక్కువ గడువు ఇవ్వడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సానుభూతిపరుల ఓట్లు గల్లంతు కాకుండా చూసుకోవాలని స్పష్టంచేశారు. ఈ మేరకు గురువారం పార్టీ నేతలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దాసోజు శ్రవణ్, లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమ భరత్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ఎలక్షన్ కమిషన్ సిద్ధం చేసిన ముసాయిదా ఓటరు జాబితాను గ్రామస్థాయిలోనే పరిశీలించాలని, అభ్యంతరాలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. జాబితాలో అవకతవకలు జరిగితే పార్టీ కమిటీ దృష్టికి తేవాలని చెప్పారు. ఈ నెల 29న జిల్లాస్థాయిలో, 30న మండలస్థాయిలో ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించనున్న సమావేశాలకు బీఆర్‌ఎస్ జిల్లాస్థాయి నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, పార్టీ ప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. ఆ తర్వాత అధికారుల నుంచి ముసాయిదా జాబితాను తీసుకొని గ్రామస్థాయి నాయకులకు పంపించాలని చెప్పారు. ఓట్లున్నాయో? లేదో? క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, గల్లంతైనట్టు గుర్తిస్తే ఈ నెల 31లోగా ఎంపీడీవో కార్యాలయాల్లో అభ్యంతరాలను అధికారికంగా నమోదు చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పన్నుతున్న కుట్రలు, ఎత్తుగడలను ఎప్పటికప్పుడు మీడియా వేదికగా ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 2న ప్రచురించే తుది జాబితాలో అర్హులందరి ఓట్లు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత పార్టీ నాయకులదేనని తేల్చిచెప్పారు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా అపార నష్టం జరిగే ప్రమాదం ఉన్నందున శ్రేణులు అనుక్షణం జాగ్రత్తగా ఉండాలని పునరుద్ఘాటించారు.

ఈ సమయంలో ఆఫీసులకు తిరగాలా?

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ ఈ నెల 28న ఓటర్ల జాబితా ముసాయిదాను, వచ్చేనెల 2న తుది ఓటర్ల జాబితాను విడుదల చేసేందుకు షెడ్యూల్ ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఈ నెల 29న రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాలవారీగా సమావేశాలు, 30న మండలస్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేయాలని, 28 నుంచి 30 వరకు ముసాయిదాపై అభ్యంతరాల స్వీకరణ, 31న అభ్యంతరాలను పరిష్కరించాలని నిర్ణయించారు. ఓటర్ల జాబితా రూపకల్పనకు ఎన్నికల కమిషన్ ఐదు రోజుల షెడ్యూల్ ప్రకటించగా, ఈ రోజుల్లో వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసిందని బీఆర్‌ఎస్ నేతలు చెప్పారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు తమను, తమ ఆస్తులను కాపాడుకోవాలా? లేక ఓటర్ల జాబితా కోసం పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగలా? అని ప్రశ్నించారు. రేవంత్ ప్రభుత్వం ఇప్పటికే బీసీలను కులగణన, 42 శాతం రిజర్వేషన్లు, కమిషన్లు, బిల్లులు, ఆర్డినెన్సులతో మోసం చేసిందని విమర్శించారు. ఓటరు జాబితా ధ్రువీకరణను కూడా అల్లకల్లోలంగా చేయడం ప్రజాస్వామ్యంపై ఈ ప్రభుత్వానికున్న నిబద్ధతను మరింత బట్టబయలు చేస్తున్నదని పేర్కొన్నారు.

సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్‌కు భారీ షాక్

కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్

గద్వాల, ఆగస్టు 28 : సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆత్మగౌరవవాన్ని చంపుకోలేక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ ప్రకటించారు. గురువారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేశవ్ మాట్లాడారు. గద్వాలలో బీసీ బిడ్డకు అన్యాయం జరుగుతున్న కాంగ్రెస్ అధినాయకులు పట్టించుకోకపోవడం వల్లే పార్టీ మారాల్సిన పరిస్థితి నెలకొందని వెల్లడించారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో ఉన్నాడా లేక ఇతర ఏ పార్టీలో ఉన్నాడో వచ్చే నెల కేటీఆర్ గద్వాల పర్యటనలో తెలుస్తుందని కేశవ్ తెలిపారు. ప్రస్తుతం తనతోపాటు నలుగురు మాజీ కౌన్సిలర్లు రాజీనామా చేసినట్టు చెప్పారు. కేటీఆర్ పర్యటనలో గద్వాల నియోజకవర్గం నుంచి మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పార్టీలో చేరుతున్నట్లు చెప్పారు.

కేటీఆర్‌ని కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్

పార్టీలో చేరే విషయంలో గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేవశ్ హైదరబాద్‌లో బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో చేరడానికి కేటీఆర్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో కేశవ్ కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. కాంగ్రెస్‌కు రాజీనామా చేసిన అనంతరం గురువారం గద్వాలలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకుడు బాసు హనుమంతునాయుడిని తన నివాసంలో కేశవ్ మర్యాద పూర్వకంగా కలిశారు.

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసిన బీఎస్ కేశవ్

గౌడ కుల సంఘాలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

1 నుంచి రేషన్ షాపుల బంద్

- బకాయిలు చెల్లిస్తేనే రేషన్ పంపిణీ
- ప్రభుత్వానికి రేషన్ డీలర్ల అల్టిమేటం
- 125 కోట్ల బకాయిలు పెండింగ్
- 4న అసెంబ్లీ ముట్టడికి పిలుపు

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): రేషన్ డీలర్లు పోరుబాట పట్టారు. కమీషన్ బకాయిల కోసం కాంగ్రెస్ సర్కారుకు ఎంత మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకపోవడంతో రోడ్డెక్కుతున్నారు. ఇందులో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు బంద్ చేస్తామని ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేశారు. వచ్చే నెల నుంచి బియ్యం పంపిణీ చేయబోమని తేల్చిచెప్పారు. బియ్యం పంపిణీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం రేషన్ డీలర్లు పౌరసరఫరాల భవన్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణాల బంద్ ప్రకటన చేశారు. దీంతోపాటు ఆందోళనకు సంబంధించి కార్యాచరణను వెల్లడించారు. సర్కారు మొండికేస్తే వచ్చే నెల 4వ తేదీన అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అన్ని జిల్లాల్లో కలెక్టర్లకు, సివిల్‌సప్లయ్ అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు ఇచ్చారు.

పెండింగ్‌లో ఐదు నెలల బకాయిలు

రేషన్ డీలర్లకు బియ్యం పంపిణీకి సంబంధించిన ఐదు నెలల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు వారికి కమీషన్ చెల్లించలేదు. జూన్‌లో ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన కమీషన్ చెల్లించలేదు. ఇక అంతకు ముందు ఏప్రిల్, మే నెలల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రతి నెల సుమారు రూ. 25 కోట్ల చొప్పున ఐదు నెలలకు గాను రూ. 125 కోట్ల కమీషన్ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

సీఎస్ పదవీకాలం పొడిగింపు

కేంద్రం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు సర్వీసును పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 31న ఆయన రిటైర్ కావాల్సి ఉండగా సర్వీసును పొడిగించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అభ్యర్థించింది. దీంతో రామకృష్ణారావు సర్వీసును ఏడు నెలలు పొడిగించింది.

జీవో-93ను రద్దు చేయాలి

- మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): వైన్‌షాపుల్లో గౌడ్‌లకు 15శాతం కేటాయించాలని నిర్ణయించడం అన్యాయమని, వెంటనే ఇందుకు సంబంధించిన జీవో-93ను రద్దుచేయాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 25 శాతం ఇవ్వాల్సిందేనని తేల్చిచెప్పారు. గురువారం సెక్రటేరియట్ మీడియా పాయింట్‌లో గౌడ కులసంఘాల నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. 'కల్తీ పేరిట రాష్ట్రవ్యాప్తంగా మూసివేసిన కల్లు దుకాణాలను తెరిపించాలి. గీత కార్మికులకు ఇచ్చే పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచి పెండింగ్ పరిహారాన్ని విడుదల చేయాలి. జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలి. కేరళలో మాదిరిగా 8.98 శాతం ఆల్కహాల్‌తో కల్లుగీత పాలసీని అమలుచేయాలి' అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలసాని బాలరాజ్, కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, గౌడ జనహక్కుల పోరాట సమితి అధ్యక్షుడు విజయ్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- మహా గణపతికి మాజీ సర్పంచుల వినతి

రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఖైరతాబాద్ మహా గణనాథుడికి సర్పంచుల జేఏసీ వినతి పత్రం అందించింది. ఈ మేరకు సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఖైరతాబాద్ బడా గణేశుని వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి.. తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేసి వినూత్న రీతిలో నిరసన చేపట్టారు.

తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి. చిత్రంలో వాసుదేవరెడ్డి, వై సతీశ్‌రెడ్డి తదితరులు

రేవంత్, తుమ్మల రాజీనామా చేయాలి

- యూరియా కొరతకు వారే బాధ్యులు
- క్యూలైన్లలో విద్యార్థుల పడిగాపులు
- కాంగ్రెస్ కుంభకోణం బయటపెడ్తం
- కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యంతో జిల్లాల్లో వరద ముంపు
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): 'రాష్ట్రంలో రోజురోజుకూ యూరియా కొరత తీవ్రమవుతుంది. రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం బడులు వదిలి యూరియా కోసం క్యూలైన్లలో పడిగాపులు కాయాల్సిన దుస్థితి వచ్చింది. యూరియా కొరతకు బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలి' అని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజులు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం యూరియా కొరతను తీర్చలేకపోతుందని మండిపడ్డారు. యూరియా దొరకక, పంటల్లో ఎదుగుదల లేక దిగుబడులు తగ్గే ప్రమాదం ఉన్నదని అన్నారు. వరద సహాయక చర్యల్లో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు ముందస్తు నిర్ణయాలు తీసుకోకపోవడం వల్ల జిల్లాలకు జిల్లాలే వరదనీటిలో మునిగిపోయే దుస్థితి దాపురించిందని మండిపడ్డారు. ఇప్పటికే రాష్ట్ర పౌర సరఫరాల శాఖలో ధాన్యం కొనుగోళ్లలో దాదాపు రూ.400 కోట్ల వరకు కుంభకోణం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో జరుగుతున్న మరో కుంభకోణాన్ని త్వరలోనే బయట పెడతామని హెచ్చరించారు. ధాన్యం సేకరణ కుంభకోణంలో సీఎం, సంబంధిత మంత్రులకు ఉచ్చు బిగుస్తుందని ఆరోపించారు. అందుకు సంబంధించిన ఆధారాలు పక్కాగా ఉన్నాయని తేల్చిచెప్పారు. ఒకవేళ నిజాలను కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తే, ఆ తర్వాత జరిగే పరిణామాలకు క్యాబినెట్ మొత్తం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని, ఈ విధంగా అష్టదిగ్బంధంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూరుకుపోయిందని ఆయన స్పష్టంచేశారు. రూ.400 కోట్ల ఈఎండీ బిడ్డర్ల నుంచి రూ.68 కోట్లను జప్తు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తప్పు చేసిన బిడ్డర్లను కాపాడిన మంత్రులు జైలుకు వెళ్లక తప్పదని చెప్పారు. సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డి, వై సతీశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు శ్రీనివాసరాజు, కల్వకుర్తి శ్రీనివాసయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాటాలు

విద్యుత్ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించిన వామపక్ష నేతలు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): విద్యుత్ అమరవీరుల 25వ వర్ధంతి సందర్భంగా వామపక్ష పార్టీ నేతలు గురువారం బషీర్‌బాగ్‌లోని విద్యుత్ అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 'రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి జోహార్.. జోహార్.. ప్రైవేటీకరణ విధానాలు నశించాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం హనుమేశ్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కే గోవర్దన్, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి మురహరి, సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ వీరయ్య పాల్గొన్నారు.

సామాన్యులు విద్యుత్తు వాడుకోలేని పరిస్థితి : జాన్‌వెస్లీ

ఆనాడు చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్తు చార్జీలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. దానికి వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రతిపక్షాలు చేసిన ఉద్యమాలను అణచివేసిందని పేర్కొన్నారు. లాఠీచార్జి చేయడమే కాకుండా కాల్పులు జరపడంతో ముగ్గురు ప్రాణాలు పోగొట్టుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వం విద్యుత్‌రంగాన్ని ప్రైవేటుపరం చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్యపద్మ విమర్శించారు.

ఆర్టీసీ కోసం పోరాటం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ) : ఆర్టీసీని కాపాడుకునేందుకు నిరంతర పోరాటాలకు సిద్ధమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ కార్మికులపై నియంతలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీపై పోరాటాలు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. పేదల ఇండ్లు కూల్చడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని సూచించారు. 30న సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభను రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

200 మంది విద్యార్థినులకు విషజ్వరాలు

- కొత్తకోట గురుకులంలో ఘటన
- ఆలస్యంగా వెలుగులోకి
- బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన

కొత్తకోట, ఆగస్టు 28 : వనపర్తి జిల్లా కొత్తకోట బాలికల గురుకుల పాఠశాలలో 200 మంది విద్యార్థినులు విషజ్వరాల బారినపడి వారం రోజులుగా చికిత్స పొందతున్న విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాలికల గురుకుల పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థినులు ఉండగా అందులో 200 మందికి వారం రోజుల కిందట జ్వరాలు వచ్చినట్టు తెలిసింది. ఇద్దరికి టైఫాయిడ్ కాగా అందరికీ వైరల్ ఫివర్ ఉందని, వంద మంది విద్యార్థినులు ఇండ్లకు వెళ్లిపోయినట్లు సమాచారం. బీఆర్‌ఎస్ నాయకులు.. మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్, మాజీ సీడీసీ చైర్మన్ బీసం చెన్నకేశవరెడ్డి, అయ్యన్న గురుకులానికి చేరుకొని పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యంపై మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా 200 మంది విష జ్వరాలకు గురైతే గుట్టు చప్పుడు కాకుండా చికిత్స చేయిస్తూ తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థులకు ఏమైనా జరిగితే ప్రిన్సిపాల్‌తోపాటు సిబ్బందే బాధ్యత వహించాలని హెచ్చరించారు. గురుకుల ప్రిన్సిపాల్ మాధవిని వివరణ కోరగా విషజ్వరాలు 60 మందికి మాత్రమే వచ్చాయని చెప్పారు.

గోపన్‌పల్లిలో తమ భూముల కోసం బీటీఎన్జీవోలు చేస్తున్న నిరసన గురువారం 44వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, పెన్షనర్లు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో భారీ వర్షాల ప్రభావిత జిల్లాల వైద్యశాఖ అధికారులతో ఆయన టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్ష నిర్వహించారు. వర్షాలు అధికంగా కురుస్తున్న మెదక్, కామారెడ్డి, సంగారెడ్డి, సిరిసిల్ల, సిద్దిపేటతో పాటు ఇతర జిల్లాలలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. వచ్చే రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, ఫార్మాసిస్టులు, ఆసుపత్రి సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా మెరుగైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరారు. రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో సమన్వయం చేసుకుని అధిక వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

బలవంతంగా ఇండ్లకు నోటీసులు

- కొడంగల్ లిఫ్ట్ భూనిర్వాసితుల ఫైర్

మక్తల్, ఆగస్టు 28 : నారాయణపేట-కొడంగల్ లిఫ్ట్ నిర్మాణానికి భూములు సేకరించే క్రమంలో నారాయణపేట ఆర్డీవో శంకర్ నాయక్ రైతులను ఒత్తిడికి గురిచేస్తూ అవార్డు కాపీలపై సంతకాలు పెట్టాలని బలవంతం చేస్తున్నట్టు పలువురు వాపోతున్నారు. 2013 భూ సేకరణ చట్టానికి లోబడి భూములు కోల్పోయే రైతాంగానికి పరిహారం అందించేందుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నిరసన కార్యక్రమాలలో అన్నదాతలు పాల్గొంటుంటే.. రెవెన్యూ సిబ్బంది రైతులు ఇండ్ల వద్ద లేని సమయం చూసి భూములు కోల్పోతున్న నారాయణపేట జిల్లా మక్తల్ మండలం కాట్రేవుపల్లిలో గురువారం భూనిర్వాసితుల ఇండ్ల వద్ద బలవంతంగా రెవెన్యూ సిబ్బంది నోటీసులు అంటించి వెళ్లారు. తమకు న్యాయమైన పరిహారం అందిస్తేనే భూములు ఇస్తామని.. లేదంటే ఇచ్చేది లేదని పలువురు తెగేసి చెప్పారు. సీఎం ఇలాకాకు సాగునీరు తీసుకెళ్లేందుకు ఇక్కడి రైతులకు నష్టం చేస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు.

ఆ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందే

- వెంకటేశ్వర ఫార్మాస్యూటికల్ కాలేజీకి
- హెచ్చార్సీ చైర్మన్ షమీమ్ అక్తర్ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు28 (నమస్తే తెలంగాణ) : ఫీజుల సాకుతో విద్యార్థులకు సర్టిఫికెట్లను నిలిపివేయడం సరికాదని రాష్ట్ర మానవహక్కుల కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్ స్పష్టంచేశారు. నల్లగొండకు చెందిన వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీకి చెందిన 9 మంది విద్యార్థుల పిటిషన్‌పై గురువారం ఆయన విచారణ నిర్వహించారు. విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్లను నిలిపివేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందికే వస్తుందని వెల్లడించారు. తక్షణమే విద్యార్థుల ఒరిజినల్ టీసీ, స్టడీ సర్టిఫికెట్లు ఇవ్వాలని మానవహక్కుల రక్షణ చట్టం-1993 సెక్షన్ 18(సీ) ప్రకారం కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా వారు వ్యక్తిగతంగా కమిషన్ ఎదుట హాజరుకావాలని సూచించారు.

రాష్ట్ర లీగల్ సెక్రటరీగా పాపిరెడ్డి

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ) : మహబూబ్‌నగర్ ప్రిన్సిపల్ జడ్జి బీ పాపిరెడ్డిని రాష్ట్ర న్యాయ, లెజిస్లేటివ్ వ్యవహారాల కార్యదర్శిగా నియమిస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నియామకం డిప్యూటేషన్ పద్ధతిపై ఉంటుందని, బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి సంవత్సరంపాటు కొనసాగుతుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేసింది. రాష్ట్ర హైకోర్టు పంపిన న్యాయమూర్తుల జాబితా నుంచి ప్రభుత్వం పాపిరెడ్డిని ఎంపికచేసినట్టు పేర్కొన్నది. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా డబిల్‌పూర్ పాపిరెడ్డి స్వగ్రామం. 2001లో ఎల్‌ఎల్‌బీ చేశాక ఎన్‌రోల్ అయ్యారు. 2005లో ఎల్‌ఎల్‌ఎం పూర్తిచేశారు. 2001 నుంచి 2013 వరకు హైదరాబాద్ సివిల్, క్రిమినల్ కోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు.

2 పిల్లర్లు కుంగితే కొట్టుకుపోతదా?

కాళేశ్వరం ప్రాజెక్టుకు 94 వేల కోట్లు ఖర్చు చేస్తే లక్ష కోట్ల అవినీతి ఎలా?

- ప్రాజెక్టుపై కొన్ని నెలలుగా కావాలనే దుష్ప్రచారం
- అవకాశమిస్తే కాళేశ్వరంపై అసెంబ్లీలో పీపీటీ ఇస్తాం : వేముల
- స్పీకర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ నాయకులు
- అపాయింట్‌మెంట్ ఇచ్చి అందుబాటులోకి రాని స్పీకర్

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యేలు వివేకానందగౌడ్, ముఠా గోపాల్, సుధీర్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): 'రెండు పిల్లర్లు కుంగినంత మాత్రాన కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోయినట్టు ఎలా అవుతుంది? ప్రాజెక్టు నిర్మాణం కోసం రూ.94,000 కోట్లు ఖర్చు చేస్తే రూ. లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుంది?' అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రశ్నించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక బయటకు రాకుండానే బీఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా కొన్ని పత్రికల్లో వార్తలు ఎలా వచ్చాయని నిలదీశారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే నివేదికను లీక్ చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించిందని ఆరోపించారు. త్వరలో జరగనున్న శాసనసభ సమావేశంలో కాళేశ్వరంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ఇచ్చేందుకు అనుమతి కోరుతూ గురువారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు బీఆర్‌ఎస్ నాయకులు వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో అసెంబ్లీ సెక్రటరీ వీ నరసింహాచార్యులను కలిసి ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆయన స్వీకరించలేదు. అనంతరం అసెంబ్లీలోని బీఆర్‌ఎస్‌ఎల్పీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంతో కలిసి బనకచర్ల, గోదావరి-కావేరి లింక్ పేరుతో గోదావరి జలాలపై తెలంగాణకు ఉన్న హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబుకు రేవంత్ జీ హుజూర్ అంటున్నారని దుయ్యబట్టారు.

తెలంగాణ జీవనాడి

తెలంగాణ జీవనాడి అయిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై ప్రజలకు పూర్తి వివరాలు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ నేల నుంచి కరువును పారదోలిన ప్రపంచలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ పథకం కాళేశ్వరం ప్రాజెక్టు అని కొనియాడారు. తెలంగాణపై వ్యతిరేకతతో కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు.

ప్రాజెక్టు గొప్పతనం అందరికీ తెలియాలి

ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి వాస్తవాలు, దానివల్ల రాష్ట్రానికి కలిగిన ప్రయోజనాలను ప్రజల ముందు ఉంచడం అవసరమని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రజలతోపాటు శాసనసభలోని సభ్యులందరికీ ఈ ప్రాజెక్టు గొప్పతనం, ప్రాధాన్యం గురించి తెలియాల్సిన అవసరం ఉందని చెప్పారు. కాబట్టి అసెంబ్లీలో దీనిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు అవకాశం కల్పించాలని స్పీకర్‌ను కోరుతున్నట్టు చెప్పారు.

అపాయింట్‌మెంట్ తీసుకున్నా స్పందన లేదు

వినతిపత్రం ఇచ్చేందుకు వస్తున్నామని ఫోన్ ద్వారా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అపాయింట్‌మెంట్ తీసుకున్నామని, అయినా ఆయన స్పందించకపోవడం బాధాకరమని ప్రశాంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. రోజంతా చూసినా ఫలితం లేకుండా పోయిందని పేర్కొన్నారు. శుక్రవారం మరోమారు ఆయనను కలిసి వినతి పత్రం ఇచ్చే ప్రయత్నం చేస్తామని చెప్పారు.

పండుగ పూట విషాదం

ఎస్సారెస్పీ కాలువలో ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి గల్లంతు

కోరుట్ల రూరల్, ఆగస్టు 28: జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం పెద్దాపూర్‌లో పండుగ పూట విషాదం నెలకొంది. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో ఓ యువకుడు బుధవారం గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపూర్‌కు చెందిన మెట్‌పల్లి మాజీ జడ్పీటీసీ కాటిపెల్లి రాధశ్రీ-శ్రీనివాస్‌రెడ్డి కొడుకు శ్రీకర్‌రెడ్డి(31) ట్రాక్టర్‌పై కోరుట్ల నుంచి వినాయక ప్రతిమను తీసుకొచ్చి వారి రైస్‌మిల్లులో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రైస్‌మిల్లులోని బల్ల, ఇతర సామగ్రిని ట్రాక్టర్‌పై తీసుకొని ఇద్దరు మిత్రులతో కలిసి ఎస్సారెస్పీ కాలువ పక్క నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో పడిపోయింది. మిట్టపెల్లి రాజు, ఇల్లెందుల రమణాచారి ఒడ్డుకు చేరుకోగా శ్రీకర్‌రెడ్డి గల్లంతయ్యాడు. పోలీసులకు సమాచారం అందించగా గాలింపు చర్యలు చేపట్టారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, మంత్రి అల్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, శ్రీకర్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ జడ్పీటీసీ కాటిపెల్లి రాధశ్రీ-శ్రీనివాస్‌రెడ్డికి ఇద్దరు కొడుకులు. ఇందులో పెద్ద కొడుకు శ్రీకర్‌రెడ్డి కాగా, రెండో కొడుకు శ్రీజన్. శ్రీకర్‌రెడ్డికి భార్య రాణి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. గల్లంతైన శ్రీకర్‌రెడ్డి మామ చేపూరు జీవన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- చేపపిల్లల సరఫరాదారుల అర్ధనగ్న ప్రదర్శన

రెండు సంవత్సరాలుగా తాము సరఫరా చేసిన చేపపిల్లలకు బిల్లులు చెల్లించకపోవడంతో సరఫరాదారులు ఆందోళనకు దిగారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని మత్స్యభవన్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. తమకు వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

విభాగం	బడ్జెట్ అంచనా (రూ.కోట్లలో)	నాలుగు నెలల్లో చేసింది (రూ.కోట్లలో)	శాతం
రాబడి	2,29,720	50,270	21.88%
అప్పు	54,009	24,669	45.68%

మిత్తి చారాణా.. బద్నాం బారాణా!

- నెలకు కట్టేది 2,338 కోట్లే.. ప్రచారం 6,500 కోట్లు
- వడ్డీలపై తప్పుడు లెక్కలు
- 'కాగ్'కు రేవంత్ సర్కారు ఇచ్చిన లెక్కలే సాక్ష్యం
- బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ దుష్ప్రచారం పటాపంచలు
- కాంగ్రెస్ పాలనలో ఆర్థిక అనిశ్చితి
- అంచనాల్లో తొలి 4 నెలల రాబడి 21% మాత్రమే
- ఏడాది అప్పుల్లో 45%కు చేరిక

తొలి నాలుగు నెలల్లో చేసిన అప్పులు..

ఏప్రిల్	5,230.98 కోట్లు
మే	4,158.92 కోట్లు
జూన్	10,876.19 కోట్లు
జూలై	4,403.79 కోట్లు
మొత్తం	24,669.88 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ కడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇతర కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నది దుష్ప్రచారం అని మరోసారి తేలింది. కాగ్ నివేదిక ప్రకారం గత నాలుగు నెలల్లో ప్రభుత్వం సగటున నెలకు రూ.2,338 కోట్లు మాత్రమే వడ్డీ చెల్లించింది. ఈ విషయం స్వయంగా కాంగ్రెస్ సర్కారే వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలకు సంబంధించి కాగ్‌కు సమర్పించిన గణాంకాల్లో ఈ విషయం స్పష్టమైంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటిపోయినా ఆర్థిక అనిశ్చితి మాత్రం కొనసాగుతూనే ఉన్నది. రాష్ట్ర ఆదాయం క్రమంగా తగ్గిపోతుండగా, ప్రభుత్వం రికార్డు స్థాయిలో అప్పులు చేస్తూ ప్రజల నెత్తిన భారం పెంచుతున్నది. ప్రభుత్వం తాజాగా కాగ్‌కు సమర్పించిన జూలై నివేదికే ఇందుకు సాక్ష్యం. ఈ నివేదిక ప్రకారం ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు రాష్ట్ర ఖజానాకు రెవెన్యూ రాబడులు రూ.50,270 కోట్లు సమకూరాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రెవెన్యూ రాబడులు రూ.2.29 లక్షల కోట్లుగా అంచనా వేసింది. మూడింట ఒకవంతు ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రాబడులు 21 శాతానికే పరిమితం అయ్యింది. ఇదే సమయంలో రాష్ట్ర అప్పులు మాత్రం పెరిగిపోతున్నాయి. బడ్జెట్‌లో ఈ ఏడాది కాలంలో రూ.54,009 కోట్లు రుణాలు సేకరిస్తామని చెప్పగా, నాలుగు నెలల్లోనే 45 శాతం రుణాలు సమీకరించింది. గత ఐదేండ్లలో జూలైనాటికి సమీకరించిన అత్యధిక మార్కెట్ రుణం ఇదే కావడం ఆందోళన కలిగిస్తున్నది. ఆదాయం తగ్గిపోవడంతో దీని ప్రభావం మూలధన వ్యయంపై పడింది. ఈ ఏడాది బడ్జెట్‌లో పెట్టుబడి వ్యయం రూ.36,504.45 కోట్లుగా ప్రతిపాదించారు. జూలై వరకు రూ.5,988.27 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. అంటే అంచనాలో ఇది 16.40 శాతం మాత్రమే.

పన్ను వసూళ్లలో తగ్గుదల

సొంత ఆదాయ రాబడులుగా భావించే ట్యాక్స్ రెవెన్యూ (జీఎస్టీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లు, ల్యాండ్ రెవెన్యూ, సేల్స్ ట్యాక్స్, స్టేట్ ఎక్సైజ్ సుంకాలు) ఈ నాలుగు నెలల్లో పెరుగకపోగా, తగ్గుదల నమోదైంది. ఆర్థిక సంవత్సరంలో 33 శాతం సమయం గడిచిపోగా.. ట్యాక్స్ రెవెన్యూ సగటున 23 శాతమే నమోదైంది. కీలకమైన స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సేల్స్ ట్యాక్స్ వంటివి తగ్గడం ఆందోళన కలిగిస్తున్నది. రాష్ట్రం ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.2,738 కోట్ల ఆదాయ మిగులుగా బడ్జెట్‌లో అంచనా వేసింది. కానీ జూలై వరకు రూ.12,564 కోట్ల ఆదాయ రెవెన్యూ లోటు నమోదైంది. ఆర్థిక లోటు రూ.24,669 కోట్లుగా ఉన్నది. సొంత రాబడులతోపాటు పన్నేతర ఆదాయాలు, కేంద్ర గ్రాంట్లు గణనీయంగా మెరుగుపడకపోతే, పెరుగుతున్న ఖర్చులు, సంక్షేమ పథకాల అమలు కష్టతరమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విభాగం	జూలై నాటికి ఆదాయం (శాతం) గత ఏడాది	ఈ ఏడాది
జీఎస్టీ	25.13	28.28
స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్	27.92	26.55
ల్యాండ్ రెవెన్యూ	5.45	3.30
సేల్స్ ట్యాక్స్	32.51	30.35
సేల్స్ ఎక్సైజ్ డ్యూటీ	25.05	22.98

మిత్తీ లెక్కలు తప్పు

రాష్ట్ర అప్పులు, మిత్తీలపై ప్రభుత్వ పెద్దలు చెప్తున్నది తప్పుడు లెక్కలని కాగ్ నివేదిక నిరూపించింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు రూ.6,500 కోట్ల వడ్డీ కడుతున్నామని సీఎం, డిప్యూటీసీఎం, మంత్రులు, కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారు. కానీ కాగ్ గణాంకాలను విశ్లేషిస్తే కనీసం ఆ దరిదాపుల్లో కూడా లేదని స్పష్టం అవుతుంది. కాగ్ నివేదిక ప్రకారం గత నాలుగు నెలల్లో ప్రభుత్వం చెల్లించిన వడ్డీ రూ.9,355 కోట్లు మాత్రమే. నెలకు రూ.2,338 కోట్లు చెల్లిస్తున్నది. అంటే ప్రభుత్వం చెప్తున్న దాంట్లో సగం కూడా కట్టడం లేదన్నమాట.

-పుట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత

పోతిరెడ్డిపాడు ద్వారా ఏపీ జలదోపిడీ

- చెన్నైకి తాగునీటి పేరిట బేసిన్ అవతలికి మళ్లింపు
- ఇష్టారాజ్యంగా అనుమతిలేని ప్రాజెక్టులు
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ సర్కారు వాదన

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీని ఆంధ్రప్రదేశ్ అక్రమంగా విస్తరించడమే కాకుండా, కృష్ణా జలాలను ఏటా భారీగా బేసిన్ అవతలికి మళ్లిస్తున్నదని తెలంగాణ సర్కారు ఆరోపించింది. అంతేకాకుండా తెలంగాణ ఆయకట్టును కుట్రపూరితంగా తగ్గించి, ఏపీ ఆయకట్టును మాత్రం పెంచుకున్నదని తెలిపింది. ఈ మేరకు బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట తెలంగాణ తరఫున సీనియర్ అడ్వకేట్ వైద్యనాథన్ నివేదించారు. కేంద్ర ప్రభుత్వం జారీచేసిన సెక్షన్ 3 మార్గదర్శకాల మేరకు రెండు రాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పునఃపంపిణీకి సంబంధించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ చేపట్టిన విచారణ ఢిల్లీలో గురువారం పునఃప్రారంభమైంది. ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ బ్రిజేష్‌కుమార్, సభ్యులు జస్టిస్ రామ్‌మోహన్‌రెడ్డి, జస్టిస్ ఎస్ తలపాత్ర ఎదుట తెలంగాణ రాష్ట్రం తన తుది వాదనలను కొనసాగించింది. నాగార్జునసాగర్ కుడి కాలువ, ఎడమ కాలువ పరిధిలోని ప్రాంతాల్లో తెలంగాణకు అన్యాయం చేస్తూ చేసిన మార్పులను, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సిస్టం మళ్లింపు సామర్థ్యాన్ని ఏపీ అక్రమంగా పెంచుకున్న విధానం తదితర అంశాలను వైద్యనాథన్ ప్రధానంగా ప్రస్తావించారు. వాస్తవంగా సాగర్ కుడి కాలువ కింద ఆయకట్టు 9.7 లక్షల ఎకరాలు మాత్రమేనని, కానీ ఏపీ దానిని అక్రమంగా 11.74 లక్షల ఎకరాలకు పెంచిందని తెలిపారు. ఇక ఎడమ కాలువ కింద తెలంగాణ ఆయకట్టును 6.6 లక్షల ఎకరాల నుంచి 6.02 లక్షలకు తగ్గించిందని, 1.2 లక్షల ఎకరాలకు రబీకి తడిని ఇవ్వడాన్ని ఉమ్మడి ఏపీ తొలగించిందని, ఫలితంగా తెలంగాణ నీటి అవసరాలు 111టీఎంసీల నుంచి 100 టీఎంసీలకు తగ్గాయని కుట్రపూరితంగా చూపిందని వెల్లడించారు. కానీ ఎడమ కాలువ కింద ఏపీ ప్రాంతంలోని ఆయకట్టును 1.3 లక్షల ఎకరాల నుంచి 3.78 లక్షల ఎకరాలకు, నీటి వినియోగాన్ని 20.7టీఎంసీల నుంచి 32.25 టీఎంసీలకు పెంచిందని వెల్లడించారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పళనిస్వామి అధ్యయనం ప్రకారం ఏపీకి సాగర్ కింద నీటిఅవసరాలు కేవలం 84.64 టీఎంసీలు ఉంటాయని వివరించారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం శ్రీశైలం ప్రాజెక్టు కేవలం హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ మాత్రమేనని, అయితే చెన్నైకు తాగునీటి సరఫరా సాకుతో ఉమ్మడి ఏపీ అంతర్రాష్ట్ర ఒప్పందాలను కుదుర్చుకున్నదని వెల్లడించారు. దాని ప్రకారం 1,500 క్యూసెక్కుల లైనింగ్ చానల్ ద్వారా 15 టీఎంసీలను మాత్రమే తీసుకెళ్లాల్సి ఉన్నా ఉమ్మడి ఏపీ ఆ ఒప్పందాలను ఉల్లంఘించి పోతిరెడ్డిపాడును విస్తరించిందని తెలిపారు. పీఆర్పీని కాకుండా శ్రీశైలం నుంచి 797 అడుగుల స్థాయి నుంచి రోజుకు 3 టీఎంసీలను తీసుకునేందుకు 2020లో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం (ఆర్‌ఎల్‌ఐఎస్)ను చేపట్టిందని, ఇది నికరజలాలను సైతం మళ్లిస్తుందని, శ్రీశైలం, నాగార్జునసాగర్ వద్ద తెలంగాణ వినియోగాలకు నష్టం చేకూర్చుతుందని తెలిపారు. ఏపీ శ్రీశైలం నుంచి నీటిని 750 కి.మీ. బేసిన్ అవతలి ప్రాంతాలకు తరలిస్తున్నదని, తద్వారా బేసిన్‌లోని తెలంగాణ ప్రాంతాలకు నీరులేకుండా పోతున్నదని వెల్లడించారు. ఏపీ పునర్విభజన చట్టంలోని షెడ్యూల్ 11లోని సెక్షన్ 10లోని ప్రాజెక్టులు మిగులు నీటి ఆధారిత కేటాయింపు ప్రాజెక్టులని, ఏపీ తప్పుడు వాదనలు వినిపిస్తున్నదని తెలిపారు. నీటి కేటాయింపులు చేసే అధికారం పునర్విభజన చట్టానికి లేదని, షెడ్యూల్ 11 అనేది రివర్ బోర్డులకు సంబంధించి మార్గదర్శకాలు మాత్రమేనని తెలిపారు. నేడు కూడా విచారణ కొనసాగనుంది.

పాత పెన్షన్ పోరాట వేదిక మార్పు

- ఆర్టీసీ కళాభవన్ వద్ద నిర్వహించాలని నిర్ణయం

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించతలపెట్టిన పాత పెన్షన్ పోరాట వేదికను మార్చారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వేదికను హైదరాబాద్ లలితా కళాతోరణం నుంచి ఆర్టీసీ కళాభవన్‌కు మార్చారు. ఈ మేరకు జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాస్‌రావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని జిల్లాల జేఏసీ నాయకులు సెప్టెంబర్ 1న సోమవారం హైదరాబాద్ జీఎస్టీ రోడ్డులోని ఆర్టీసీ కళాభవన్‌కు పెద్దసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాత పెన్షన్ సాధన కోసం కలిసిరావాలి

- తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): పాత పెన్షన్ సాధన కోసం ప్రభుత్వ ఉద్యోగులు అందరూ ఒకే గొడుగు కిందకు రావాలని తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ వీ లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. పాత పెన్షన్ స్కీమ్ సాధనే లక్ష్యంగా తెలంగాణ కాంట్రిబ్యూషన్ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని కోరారు. గురువారం లక్డీకపూల్‌లో లచ్చిరెడ్డి అధ్యక్షతన 37 ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ పెన్షన్ అంతమే జేఏసీ పంతమని స్పష్టంచేశారు. సెప్టెంబర్ 1న నిర్వహించనున్న ఆత్మగౌరవ సభకు తెలంగాణ ఉద్యోగుల జేఏసీ, జేఏసీ అనుబంధ సంఘాల తరుపున సంపూర్ణ మద్దతు ప్రకటించినట్టు పేర్కొన్నారు. పాత పెన్షన్ స్థానంలో సీపీఎస్ పెన్షన్ తీసుకువచ్చిన ప్రభుత్వం, తాజాగా యూపీఎస్ పెన్షన్ స్కీమ్‌ను అమలులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. అంటే ప్రభుత్వం పరోక్షంగా సీపీఎస్‌లో లోపాలు ఉన్నాయని ఒప్పుకున్నదని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ పోరాడితే మళ్లీ పాత పెన్షన్ విధానం అమలులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం కోసం ఎవరూ ప్రయత్నం చేసినా జేఏసీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని స్పష్టంచేశారు.

సమక్క సారక్క వర్సిటీకి మాస్టర్ ప్లాన్

- సీపీడబ్ల్యూడీతో టోపోగ్రఫిక్ సర్వే
- గిరిజన వర్సిటీ వీసీ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : సమక్క సారక్క సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ(గిరిజన యూనివర్సిటీ) అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్టు వర్సిటీ మొదటి వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ వైఎల్ శ్రీనివాస్ తెలిపారు. వర్సిటీ నిర్మాణానికి బృహత్ ప్రణాళికలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. తొలి వీసీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు. జీరో వేస్ట్, సెల్ఫ్ సస్టేనింగ్ గ్రీన్ క్యాంపస్‌గా కొత్త క్యాంపస్‌ను తీర్చిదిద్దనున్నామని, పూర్తి పర్యావరణహితంగా క్యాంపస్‌ను అభివృద్ధిచేస్తామని చెప్పారు. వర్సిటీకి కేటాయించిన 50 ఎకరాల అటవీ స్థలానికి బయోఫెన్సింగ్, 287 ఎకరాల స్థలానికి ప్రహరీ నిర్మిస్తున్నామని తెలిపారు. సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్‌తో టోపోగ్రఫిక్ సర్వేను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో నడుస్తున్నదని, రెండు విడతల్లో (ఫేజ్‌ల్లో) కొత్త క్యాంపస్ నిర్మాణం జరుగుతున్నదని పేర్కొన్నారు. త్వరలోనే ప్రధాని మోదీ చేతులు మీదుగా శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అక్టోబర్‌లో నిర్మాణాలు ప్రారంభమయ్యే అవకాశమున్నదని వెల్లడించారు.

కొత్తగా ఆరు కోర్సులు..

2023లో వర్సిటీని ఏర్పాటు చేయగా, ప్రస్తుతం రెండు కొత్త కోర్సులు నిర్వహిస్తున్నామని, మరో 6 కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని తెలిపారు. 2026-27 విద్యాసంవత్సరంలో అందుబాటులోకి రానున్నాయని, ఇవన్నీ జాబ్ ఓరియంటెడ్ కోర్సులేనని పేర్కొన్నారు. బీఈ(ఇంజినీరింగ్), ఎంఏ ఎడ్యుకేషన్, ఎమ్మెస్సీ అప్లయిడ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ అండ్ మెడ్‌టెక్, ఎంఏ డెవలప్‌మెంటల్ స్టడీస్ (ఎకనామిక్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్స్, పొలిటికల్‌సైన్స్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, గణితం, స్టాటిస్టిక్స్), ఎంఏ డిజిటల్ హ్యూమానిటీస్ అండ్ లిబరల్ ఆర్ట్స్, ఎంబీఏ ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ స్టడీస్ వంటి కోర్సులను వర్సిటీలో ప్రవేశపెట్టనున్నామని వెల్లడించారు. కోర్సుల డిజైన్ సహా వాటి నిర్వహణకు ప్రతిష్ఠాత్మక సంస్థలతో ఎంఓయూలు కుదుర్చుకోనున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఐఐటీ హెచ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఐఐసీటీ, ఆస్కీ, ఎన్‌ఐటీ వరంగల్, ఐఎస్‌బీ వంటి సంస్థల సహకారాన్ని కూడా తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించండి

- దశాబ్దాలుగా సేవలందించాక విస్మరిస్తరా?
- కొత్త నియామకాలను అంగీకరించబోం
- 12 ఏండ్ల వివాదానికి తెరదించిన హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీలను కాంట్రాక్ట్ పేరుతో ఏండ్లపాటు సేవలు చేయించుకుని సర్వీస్ క్రమబద్ధీకరించకుండా ఇప్పుడు కొత్తగా చేపట్టే నియామకాల్లో పాల్గొనాలని చెప్పడం సరికాదని హైకోర్టు హైకోర్టు అభిప్రాయపడింది. కోర్టును ఆశ్రయించిన వారిని క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. కాంట్రాక్ట్ పద్ధతిలో చాలా ఏండ్లుగా పనిచేస్తున్న తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించకుండా కొత్తగా నోటిఫికేషన్ జారీచేయడాన్ని సవాల్ చేస్తూ 2013లో దాదాపు 200 మంది అంగన్‌వాడీలు వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో అప్పట్లో నోటిఫికేషన్‌పై స్టే మంజూరుచేయగా వారు ఇప్పటికీ కాంట్రాక్ట్ పద్ధతిలోనే కొనసాగుతున్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలంటూ మెదక్ జిల్లా సదాశివపేటకు చెందిన మీరాభాయ్ తదితరులు మరో మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ నగేశ్ భీమపాక తాజాగా విచారణ చేపట్టి తీర్పును వెలువరించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సూపర్‌వైజర్ గ్రేడ్-2 పోస్టుల భర్తీ నోటిఫికేషన్‌లో అంగన్‌వాడీ కాంట్రాక్ట్ ఉద్యోగులకు 15 శాతం వెయిటేజీ కేటాయించడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. గతంలో వారు రెగ్యులర్ పోస్టులకే ఎంపికయ్యారని, కానీ నియామకాలపై నిషేధం ఉండటంతో కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పుడు నిషేధం తొలగించిన తర్వాత దశాబ్దాలుగా సేవలు అందించిన వారిని విస్మరించి కొత్త నియామకాలు చేపడతామంటే అంగీకరించబోమని పేర్కొన్నారు. వారు దాదాపు 25 సంవత్సరాలు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన తర్వాత ఇప్పుడు పరీక్షలు రాసి ఎంపిక ప్రక్రియలో పాల్గొనాలనడం చట్ట విరుద్ధమన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియమితులైన వారిని క్రమబద్ధీకరించి, ఆ తర్వాత ఖాళీలు ఉంటే తాజాగా నియామకాలు చేపట్టవచ్చని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్నవారు అనర్హులని గానీ, వారికి అర్హతలేదని గానీ అధికారులు చెప్పడం లేదని గుర్తు చేశారు. 'జాగ్గో వర్సెస్ కేంద్రం', 'కర్ణాటక వర్సెస్ ఉమాదేవి' కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం పిటిషనర్లను క్రమబద్ధీకరించాల్సిందేనని తేల్చిచెప్పారు. క్రమబద్ధీకరణ అనంతరం పదవీ విరమణానంతర ప్రయోజనాల కల్పనలో సర్వీసును పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించారు.

జువైనల్ బోర్డు పరీక్ష కోసం నిరీక్షణ

- 8న ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ
- స్పష్టత ఇవ్వని శిశు సంక్షేమ శాఖ
- ఎదురుచూస్తున్న అభ్యర్థులు

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): జువైనల్ జస్టిస్ బోర్డు, డిస్ట్రిక్ట్ చైల్డ్ వెల్ఫేర్ బోర్డుల్లో చైర్‌పర్సన్, నలుగురి చొప్పున సభ్యుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం పరీక్ష నిర్వహణపై మాత్రం స్పష్టత ఇవ్వడంలేదు. గడువు ముగిసి 20 రోజులు దాటినా అధికారవర్గాల నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉండటంతో పరీక్ష ఆలస్యమవుతుందేమోనని మథనపడుతున్నారు.

జూలై 22న నోటిఫికేషన్

రాష్ట్రంలోని 33 జిల్లాల్లోని జువైనల్, డిస్ట్రిక్ చైల్డ్ వెల్ఫేర్ బోర్డుల్లో చైర్‌పర్సన్, సభ్యుల నియామకానికి మహిళా శిశు సంక్షేమ శాఖ 22 జూలై 2025న నోటిఫికేషన్ జారీ చేసింది. ఒక్కో బోర్డులో మహిళ, పిల్లల నిపుణుడు ఒక్కొక్కరి చొప్పున తప్పక ఉండాలని నిర్దేశించింది. ఆగస్టు 8లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 35 ఏండ్లకు పైబడి 65 ఏండ్లలోపు వయస్సు కలిగి చైల్డ్ సైకాలజీ, లా, సోషల్‌వర్క్, సోషియాలజీ, హ్యూమన్ హెల్త్, హ్యూమన్ ఎడ్యుకేషన్, హ్యూమన్ డెవలప్‌మెంట్ లేదా స్పెషల్ ఎడ్యుకేషన్‌లో డిగ్రీ చేసిన వారు అర్హులని పేర్కొన్నది. పిల్లలు, మహిళా సంక్షేమ, సామాజిక సేవలో ఏడేండ్లు పనిచేయాల్సి ఉంటుందని నిర్దేశించింది. అభ్యర్థులు స్వయంగా ఎంపిక చేసుకున్న స్థానానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. 33 జిల్లాల్లోని 66 బోర్డుల(జేజేబీ, డీసీబీలు 33 చొప్పున)కు సుమారు 2 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి రాత పరీక్ష నిర్వహించి, అందులో అర్హత సాధించిన వారిని ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేస్తారు. వీరు మూడేండ్లపాటు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

అయోమయంలో అభ్యర్థులు

దరఖాస్తు గడువు ముగిసి ఇప్పటికే 20 రోజులు దాటింది. రెండువేలకు పైగా అభ్యర్థులు పరీక్ష కోసం ఎదురుచూస్తున్నారు. నోటిఫికేషన్‌లోనూ ఎలాంటి వివరాలు ఇవ్వలేదు. దీంతో రాత పరీక్ష, ఇంటర్వ్యూలు ఎప్పుడు పెడతారో తెలియక అభ్యర్థులు అయోమయానికి గురవుతున్నారు. సంబంధిత బోర్డు అధికారులకు ఫోన్ చేసిన సరైన సమాధానం చెప్పడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఈ పరీక్షల నిర్వహణపై క్లారిటీ ఇవ్వాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

గిరిజన మహిళపై హత్యాయత్నం కేసులో జీవితఖైదు

ఎదులాపురం, ఆగస్టు 28 : గిరిజన మహిళపై హత్యాయత్నం కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ ఆదిలాబాద్ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పును వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం దేవుగూడకు చెందిన గిరిజన మహిళ తన తమ్ముడికి రాఖీ కట్టాడానికి ఆగస్టు 31, 2024న సోయంగూడకు వెళ్లడానికి ఆటో కోసం ఎదురు చూస్తున్నది. ఆటోడ్రైవర్ షేక్ మగ్దూమ్ సోయంగూడకు వెళ్తున్నానని చెప్పి ఆటోలో ఎక్కించుకున్నాడు. రాగాపూర్ దాటిన తర్వాత అడవి వైపు మళ్లించి, మహిళపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో ఆటోలో ఉన్న ఇనుపరాడుతో తల, ముఖంపై తీవ్రంగా కొట్టి, చనిపోయిందని భావించి వెళ్లిపోయాడు. కొంత సేపటి తర్వాత స్పృహలోకి వచ్చిన ఆమెను అటువైపుగా వెళ్తున్న ఆత్రం శంకర్ 108 అంబులెన్స్‌లో జైనూర్ దవాఖానలో చేర్పించాడు. సెప్టెంబర్ 2, 2024న జరిగిన విషయాన్ని తన కొడుకు, భర్తకు తెలుపగా.. వీరు జైనూర్ ఎస్ఐకి ఫోన్ ద్వారా విషయాన్ని తెలిపారు. సెప్టెంబర్ 3న పోలీసులు బాధితురాలిని విచారించి కేసు నమోదు చేసి షేక్ మగ్దూమ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసులో 45 మంది సాక్షులను ప్రత్యేక పీపీ ముస్కు రమణారెడ్డి హాజరుపర్చగా 28 మంది సాక్షులను కోర్టులో విచారించారు. ఈ కేసులో నేరస్తుడికి లైంగికదాడి యత్నానికి ఐదేండ్లు, రూ.5 వేల జరిమానా, హత్యాయత్నం కింద 10 పదేండ్ల జైలు, రూ.10 వేల జరిమానానా, బాధితురాలు ఎస్టీ అయినందున జీవితఖైదుతోపాటు రూ.15 వేల జరిమానా విధించారు.

ఉద్యాన విస్తరణాధికారుల నియామకంలో అవకతవకలు !

ఉద్యాన డిప్లొమా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సురేశ్

హైదరాబాద్, ఆగస్టు28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇటీవల ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నియమించిన ఉద్యాన విస్తరణాధికారుల (హెచ్‌ఈవో) నియామకంలో అవకతవకలు జరిగాయని ఉద్యాన డిప్లొమా అసోసియేషన్ అధ్యక్షుడు సుందరి సురేశ్ ఆరోపించారు. రాష్ట్రంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 175మందిని నియమించగా, అర్హులైన వారికి అన్యాయం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిరుడు పనిచేసిన ఉద్యాన డిప్లొమా అభ్యర్థులకు అన్యాయం జరిగిందని తెలిపారు.

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

మూడు రోజుల క్రితం కూతురు మృతి

ఇల్లంతకుంట, అగస్టు 28 : మూడు రోజుల క్రితం కూతురు అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా.. ఆమె తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం రంగంపేటకు చెందిన బాలికను ముగ్గురు యువకులు వీడియోలు తీసి లైంగికంగా వేధింపులకు గురి చేయగా అనుమానాస్పద స్థితిలో ఆమె మృతిచెందిన విషయం తెలిసిందే. దీంతో ఆమె తండ్రి తిప్పిరిశెట్టి తిరుపతి మనస్తాపంతో గురువారం కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానీపేటలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బాలిక అంత్యక్రియలు ముగిసిన తరువాత ఆమె తల్లి వారి అమ్మగారి ఇంటికి వెళ్లిపోగా తిరుపతి ఒక్కడే ఇంటి వద్ద మిగిలిపోయాడు. అతని అక్కలు భవానిపేటకు తీసుకువెళ్లగా, తిరుపతి అక్కడే ఆత్మహత్య చేసుకున్నాడు.





భవనం కూలి 17 మంది మృతి

మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాలో ఘటన

ముంబై, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లాలోని విరార్‌లో భవనం కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య 17కి పెరిగింది. రాత్రిపూట కొనసాగిన సహాయక చర్యలో మరో మూడు మృతదేహాలను వెలికితీసినట్లు అధికారులు గురువారం తెలిపారు. ముంబయిని ఆనుకుని ఉన్న పాల్ఘర్ విరార్ ప్రాంతంలోని విజయ్‌నగర్‌లో మంగళవారం అర్ధరాత్రి 12.05 గంటలకు సుమారు 50 ఫ్లాట్‌లతో కూడిన నాలుగు అంతస్తుల రమాబాయి అపార్ట్‌మెంట్, పక్కనే ఉన్న ఖాళీ ఇంటిపై కూలిపోయిందని అధికారులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. భవనం బిల్డర్ నీలే సానేను పోలీసులు అరెస్టు చేశారు.

గడ్చిరోలిలో ఎన్‌కౌంటర్

నలుగురు నక్సలైట్లు మృతి

ముంబై, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. సంఘటనా స్థలం నుండి పోలీసులు మూడు రైఫిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, గడ్చిరోలి, నారాయణపూర్ జిల్లా సరిహద్దు సమీపంలో నక్సలైట్లు దాక్కున్నట్లు సమాచారం అందింది. 8 గంటల పాటు ఇరుపక్షాల మధ్య కొనసాగిన కాల్పుల్లో ముగ్గురు మహిళా, ఒక పురుష నక్సలైట్ మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన నక్సలైట్స్ గట్టా దళం కంపెనీ నెంబర్ 10, ఇతర మావోయిస్టు సంస్థలకు చెందినవారు.

కశ్మీర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల కాల్చివేత

శ్రీనగర్, ఆగస్టు 28: భారత్‌లోకి చొరబడటానికి ప్రయత్నించిన ఇద్దరు ఉగ్రవాదులను జమ్ము కశ్మీర్‌లో భద్రతా దళాలు కాల్చి చంపాయి. బండిపొరా జిల్లా, గురెజ్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వద్ద ఈ ఘటన చోటుచేసుకుందని గురువారం అధికారులు ఎక్స్‌లో తెలిపారు.

బీహార్‌లోకి ముగ్గురుఉగ్రవాదులు! పాకిస్థాన్‌కు చెందిన ముగ్గురు ఉగ్రవాదులు నేపాల్ దేశం ద్వారా బీహార్ రాష్ట్రంలోకి ప్రవేశించారన్న వార్తలు రావడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు చెందిన ఈ ముగ్గురు అనుమానితుల రేఖా చిత్రాలను పోలీసులు విడుదల చేశారు. రాష్ట్రంలో ముందు జాగ్రత్తగా హై అలర్ట్ ప్రకటించారు.

అమెరికాలో చదువుకు నాలుగేండ్ల పరిమితి!

విదేశీ విద్యార్థులపై ఆంక్షలకు ట్రంప్ సర్కార్ యోచన

వాషింగ్టన్: విదేశీ విద్యార్థులు చదువు కోసం అమెరికాలో ఉండదగిన గరిష్ఠ కాల పరిమితిని నాలుగేండ్లుగా నిర్ణయించాలని అమెరికా ప్రభుత్వం బుధవారం ప్రతిపాదించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే గురువారం దాన్ని ప్రచురిస్తారు. విదేశీ విద్యార్థులు సహా కొన్ని రకాల వీసాదారులు అమెరికాలో ఉండదగిన సమయంపై పరిమితి విధిస్తారు. వీసాల దుర్వినియోగాన్ని అడ్డుకోవడం, ఇటువంటివారిని సరైన రీతిలో తనిఖీ చేయడం కోసం ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు.

'అలా చేస్తే 25 శాతం సుంకాల తగ్గింపు'

వాషింగ్టన్, ఆగస్టు 28: అమెరికా విధించిన అదనపు టారిఫ్‌ల అమలు మన దేశంలో బుధవారం నుంచి ప్రారంభమైంది. రష్యా నుంచి చమురును కొనుగోలు చేయడం ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి భారత్ ఆర్థిక సహాయం అందిస్తున్నదని ఆరోపించిన శ్వేత సౌధం వాణిజ్య సలహాదారు పీటర్ నవారో ఇది 'మోదీ యుద్ధం'గా అభివర్ణించారు. ఇప్పటికైనా భారత్‌కు మించిపోయిందేమీ లేదని, ఆ దేశం రష్యా నుంచి చమురు కొనుగోలును నిలిపివేస్తే రేపటి నుంచే 25 శాతం సుంకాలను తగ్గిస్తామని ఆయన ఆఫర్ ఇచ్చారు. శాంతికి మార్గం పాక్షికంగా న్యూఢిల్లీ నుంచి వెళుతున్నది కాబట్టి తాను మోదీ యుద్ధం గురించి మాట్లాడుతున్నానని ఆయన పేర్కొన్నారు.

గుజరాత్‌లో 'ముసుగు' పార్టీలు

- అనామక పార్టీల బడా గోల్‌మాల్ వెలుగులోకి
- ఊరూ-పేరు లేని పార్టీలకు రూ.4,300 కోట్ల విరాళాలు
- ఎన్నికల్లో ఆ పార్టీలకు వచ్చిన ఓట్లు కేవలం 54 వేలే
- వాటి ప్రచార ఖర్చులు, ఆడిట్ రిపోర్టులన్నీ అనుమానాస్పదమే
- 'దైనిక్ భాస్కర్' న్యూస్ వెబ్‌సైట్ పరిశీలనలో వెల్లడి
- ఓ ప్రధాన రాజకీయ పార్టీకి లబ్ధి చేకూర్చడానికేనని అనుమానం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): బీహార్‌లో ఓట్ల సవరణ వివాదం, ఈవీఎంల విశ్వసనీయతపై దేశవ్యాప్తంగా పెద్దయెత్తున చర్చ జరుగుతున్న సమయంలో ప్రధాని నరేంద్ర మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లో బడా గోల్‌మాల్ ఒకటి తాజాగా వెలుగు చూసింది. గుజరాత్‌కు చెందిన 10 రాజకీయ పార్టీలకు ఐదేండ్ల వ్యవధిలో ఏకంగా రూ.4,300 కోట్ల విరాళాలు వచ్చాయి. ఇంతపెద్దయెత్తున విరాళాలు అందుకొన్న ఆ పార్టీలకు ప్రజాక్షేత్రంలో గుర్తింపు ఉందా? అంటే అదీ లేదు. పోనీ ఆయా పార్టీల నుంచి బరిలోకి దిగిన అభ్యర్థులు ప్రముఖులా? అంటే సమాధానం ఉండదు. పోనీ ఆయా అభ్యర్థులకు ఓట్లైనా భారీగా వచ్చాయా? అంటే .. అదీ లేదు. మొత్తం 10 పార్టీల నుంచి పోటీలో నిలిచిన 43 మంది అభ్యర్థులకు తిప్పి కొడితే 55 వేల ఓట్లు కూడా రాలేదు. ఈ మేరకు జాతీయ న్యూస్ వెబ్‌సైట్ 'దైనిక్ భాస్కర్' ప్రచురించిన ఓ పరిశోధన కథనం ద్వారా బయటపడింది.

వచ్చింది వేల కోట్లు.. ఖర్చు లక్షల్లో..

'దైనిక్ భాస్కర్' కథనం ప్రకారం.. 2019-20 నుంచి 2023-24 మధ్య గుజరాత్‌కు చెందిన 10 అనామక పార్టీలకు రూ.4,300 కోట్ల మేర విరాళాలు వచ్చాయి. ఎన్నికల ప్రచారం కోసం రూ.39.02 లక్షలను ఖర్చు చేసినట్టు ఆయా పార్టీలు ఎన్నికల సంఘానికి ఇచ్చిన అఫిడవిట్‌లో పేర్కొన్నాయి. కానీ, ఆడిట్ రిపోర్ట్‌లో మాత్రం ఈ లెక్కలను రూ.3,500 కోట్లుగా చూపించాయి. దీంతో ఈ పార్టీలకు అందిన విరాళాల్లో ఏదో గూడుపుఠాణీ దాగి ఉన్నదని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సీఏను అడిగి చేప్తామని..

ఎన్నికల సంఘానికి ఆయా అనామక పార్టీలు ఇచ్చిన అఫిడవిట్‌లోని ప్రచార ఖర్చులకు, ఆడిట్ రిపోర్ట్ లెక్కలకు మధ్య భారీగా తేడా ఉండటంతో ఇదే విషయమై ఆయా పార్టీల అధినేతలను 'దైనిక్ భాస్కర్' ప్రతినిధులు ప్రశ్నించారు. దీనికి వాళ్లు సమాధానమిస్తూ.. ఆ విషయాలు తమకు తెలియదని, సీఏను అడిగి చెప్తామని దాటవేత ధోరణిని ప్రదర్శించారు. ఇదంతా విశ్లేషిస్తే, అనామక పార్టీల పేరిట ఏదో ఓ ప్రధాన పార్టీ ఈ విరాళాలను సేకరించిందా? అని రాజకీయ విశ్లేషకులు అనుమానిస్తున్నారు. ఆ పార్టీలకు ఇంత పెద్ద మొత్తంలో డబ్బు ఎలా వచ్చింది? ఆ తర్వాత ఆ డబ్బు ఎటు పోయిందన్న విషయంపై ఈసీ దర్యాప్తు చేయాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు.

ఈసీ బదులివ్వాలి

ఊరు-పేరూ లేని పది పార్టీలకు రూ.4,300 కోట్ల విరాళాలు వచ్చాయి. ఆయా పార్టీల టికెట్లతో బరిలోకి దిగిన 43 మందికి కేవలం 54 వేల ఓట్లే వచ్చాయి. ఇదంతా అనుమానంగా ఉంది. దీనికి ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలి.

-డాక్టర్ సుమంత్ రామన్, రాజకీయ విశ్లేషకులు

పార్టీ	విరాళాలు (రూ.లలో)	అభ్యర్థులు (ఓట్లు)	ఆడిట్‌లో ఖర్చు	అఫిడవిట్‌లో ఖర్చు
లోక్‌షాహీ సత్తా పార్టీ	1045 కోట్లు	4(3997)	1031 కోట్లు	2.27 లక్షలు
బీఎన్‌జేపీ	962 కోట్లు	8(11496)	961 కోట్లు	2.83 లక్షలు
స్వతంత్ర అభివ్యక్తి పార్టీ	663 కోట్లు	6(11692)	73 కోట్లు	12.18 లక్షలు
న్యూ ఇండియా యునైటెడ్ పార్టీ	608 కోట్లు	4(9029)	407 కోట్లు	1.61 లక్షలు
సత్యవాది రక్షక్ పార్టీ	416 కోట్లు	2(1042)	416 కోట్లు	1.43 లక్షలు
భారతీయ జన పరిషద్	249 కోట్లు	15(14324)	247 కోట్లు	14.05 లక్షలు
సౌరాష్ట్ర జనతా పక్ష్	200 కోట్లు	1(140)	199 కోట్లు	1.47 లక్షలు
జన్‌మన్ పార్టీ	133 కోట్లు	2(480)	133 కోట్లు	1.31 కోట్లు
మానవాధికార్ నేషనల్ పార్టీ	120 కోట్లు	2 (1887)	-	0.82 లక్షలు
గరీభ్ కళ్యాణ్ పార్టీ	138 కోట్లు	3 (3979)	-	3.27 లక్షలు

నిరుద్యోగం అతి పెద్ద వైఫల్యం

- ఎన్డీఏ ప్రభుత్వంపై పౌరుల మనోగతం
- ఇండియా టుడే-సీ ఓటర్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: గత 11 ఏండ్ల ప్రధాని మోదీ పాలనలో అతి పెద్ద వైఫల్యం నిరుద్యోగమని ఇండియా టుడే-సీ ఓటర్ నిర్వహించిన మూడ్ ఆఫ్ ద నేషన్ సర్వే తెలిపింది. ఈ 11 ఏండ్ల కాలంలో నిరుద్యోగాన్ని నిర్మూలించడంలో మోదీ ఘోరంగా విఫలమయ్యారంటూ 27.1 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఇది గత సర్వేతో పోలిస్తే ఏడు శాతం ఎక్కువ. ఇక రిటైల్ ద్రవ్యోల్బణంపై 16.8 శాతం, మందగమన ఆర్థికాభివృద్ధిపై 6.5 శాతం, మత హింస, మైనారిటీల్లో భయం అంశాలపై 5.8 శాతం, మహిళల భద్రతపై 5.3 శాతం, ఉగ్రవాద నిర్మూలించడంలో వైఫల్యంపై 4.8 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే దేశంలోని వ్యవసాయ దుస్థితిపై 6.8 శాతం, పేదరికంపై 6.6 శాతం, మౌలిక సదుపాయాల లేమిపై 6.1 శాతం మోదీ పాలనను వ్యతిరేకించారు. అయితే మొత్తం మీద మోదీ ప్రభుత్వం బాగానే ఉందని, అంచనాలకు తగ్గట్టుగా పనిచేస్తున్నదంటూ మెజారిటీ వర్గం ఈ సర్వేలో విశ్వాసం వ్యక్తం చేసింది. ఎన్డీఏ పాలనలో సాధించిన ఘనత అయోధ్య రామాలయ నిర్మాణమేనని అలాగే ఇటీవల జరిపిన ఆపరేషన్ సిందూర్, మౌలిక అభివృద్ధి కూడా కేంద్రం సాధించిన ఘనతలేనని పౌరులు అభిప్రాయపడ్డారు. దేశ ప్రజల మానసిక స్థితి (ఎంఓటీఎన్) పేరుతో ఈ ఏడాది జూలై 1 నుంచి ఆగస్టు 14 మధ్య అన్ని లోక్‌సభ సెగ్మెంట్లలో 54,788 మందిని సర్వే చేశారు. దీనికి అదనంగా సీ ఓటర్ నిత్యం చేసే 1,52,038 మంది ఇంటర్వ్యూల డాటాను కూడా విశ్లేషించి మొత్తం 2,06,826 మంది అభిప్రాయాలను క్రోడీకరించి సర్వే ఫలితాలను వెల్లడించారు.

ట్రంప్ సుంకాలపై మెజారిటీ పౌరుల్లో ఆందోళన

భారత వస్తువులపై అమెరికా విధించిన 50 శాతం సుంకాలపై భారతీయులలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతున్నట్టు సీ ఓటర్ మూడ్ ఆఫ్ ది నేషన్(ఎంఓటీఎన్) తెలిపింది. సర్వేలో పాల్గొన్న వారిలో మూడువంతుల మంది (63 శాతం) ఈ విషయమై ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 27 మంది మాత్రమే తాము పట్టించుకోవడం లేదని వ్యాఖ్యానించారు. తమ ప్రయోజనాలపై రాజీ పడకుండా అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగించాలని మెజారిటీ(61 శాతం) మంది అభిప్రాయపడగా అమెరికా సుంకాలను తట్టుకుని భారత ఆర్థిక వ్యవస్థ నిలబడగలదని 23 శాతం మంది విశ్వసించారు. అమెరికా షరతులను భారత్ ఒప్పుకోవాలని కేవలం 9 శాతం మంది మాత్రమే సూచించారు. వాణిజ్య చర్చలు విఫలం కావడానికి 54 శాతం మంది అమెరికాను నిందించగా 22 శాతం మంది భారత్‌ను నిందించారు. అమెరికా ఆంక్షలు విధించినప్పటికీ రష్యా నుంచి చమురు కొనుగోలు కొనసాగించాలని 69 శాతం మంది సూచించగా రష్యన్ ముడి చమురు కొనుగోలు నిలిపివేయాలని 16 శాతం మంది అభిప్రాయపడ్డారు. చైనాతో మరింత సన్నిహిత వాణిజ్య, దౌత్యపర సంబంధాలు ప్రపంచంలో భారత్ స్థానాన్ని పటిష్టం చేస్తాయని 52 శాతం మంది అభిప్రాయం వ్యక్తం చేశారు

కిలోమీటర్ వెంబడించి బీహార్ మంత్రిపై దాడి

మృతుల కుటుంబాలకు పరిహారం ప్రకటించలేదని గ్రామస్థుల ఆగ్రహం

పట్నా: ఒక రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన బీహార్ మంత్రికి చేదు అనుభవం ఎదురైంది. అక్కడ ఆయన వ్యవహరించిన తీరు బాధిత కుటుంబాలను, గ్రామస్థులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. దీంతో బీహార్ గ్రామీణాభివృద్ధి మంత్రి శ్రావణ్ కుమార్‌ను వెంబడించి, వెంటపడి మరీ వారు దాడికి పాల్పడ్డారు. దాదాపు కిలోమీటర్ దూరం వరకు ఆయన్ని వారు వెంటాడినట్టు అధికారుల ద్వారా తెలిసింది. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో మంత్రి భద్రతా సిబ్బంది గాయపడ్డారు. పోలీసులు రక్షణగా నిలిచి మంత్రిని అక్కడి నుంచి పంపించివేశారు. వారం రోజుల క్రితం జరిగిన ఓ రోడ్డు ప్రమాద ఘటనలో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. బాధిత కుటుంబాలను కలిసేందుకు జోగిపూర్ మలావాన్ అనే గ్రామానికి మంత్రి వెళ్లారు. మంత్రి వ్యవహార శైలిపై ఆగ్రహంతో ఉన్న గ్రామస్థులు ఆయనపై దాడి చేశారు.

సంఘర్షణ ఉంది.. గొడవలు లేవు

- సలహాలు మావి..నిర్ణయం బీజేపీదే
- కేంద్రంతో సంబంధాలపై భాగవత్

న్యూఢిల్లీ, ఆగస్టు 28: బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వంతో తమకు సంఘర్షణ ఉంది కాని గొడవలు లేవని బీజేపీ సైద్ధాంతిక గురువుగా పరిగణించే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్) అధినేత మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. బీజేపీ కోసం ఆర్‌ఎస్‌ఎస్ నిర్ణయాలు తీసుకుంటుందని ప్రతిపక్షాల నుంచి వస్తున్న ఆరోపణలను ఆయన తోసిపుచ్చారు. బీజేపీకి చెందిన నిర్ణాయక ప్రక్రియపై ఆయన వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "మేమే నిర్ణయాలు తీసుకుంటే ఇంతకాలం పడుతుందా? వాళ్లు(బీజేపీ) తమకు తోచినప్పుడు నిర్ణయాలు తీసుకుంటారు" అని పరోక్షంగా పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా కొనసాగింపుపై వ్యాఖ్యానించారు. నడ్డా అధికారిక పదవీకాలం పూర్తయి రెండేళ్లు దాటినా ఇంకా పదవిలో కొనసాగడంపై ఆయన పరోక్షంగా విమర్శలు గుప్పించారు. ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా గురువారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రాలతో తమకు మంచి సమన్వయం ఉందని ఆయన చెప్పారు. బీజేపీతో తమకు ఎటువంటి గొడవలు లేవని, ప్రతి సందర్భంలో తమ మధ్య మంచి సమన్వయం ఉందని ఆయన తెలిపారు. "సంఘర్షణ ఉంది కాని గొడవలు లేవు. మేము రాజీ గురించి మాట్లాడినపుడు పోరాటం మరింత తీవ్రమవుతుంది" అని భాగవత్ వెల్లడించారు. అన్ని విషయాలలో ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ ఏకాభిప్రాయానికి రాలేకపోవచ్చని, ఏదో ఒక దశలో ఒప్పించగలమని తాము విశ్వసిస్తామని ఆయన అన్నారు. చాలా విషయాలపై సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటామని, ఆర్‌ఎస్‌ఎస్ కేవలం సూచనలు మాత్రమే ఇస్తుందని, బీజేపీ నిర్ణయ ప్రక్రియలో ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నడూ జోక్యం చేసుకోదని భాగవత్ చెప్పారు. సంఘ్ శాఖను తాను 50 ఏండ్లుగా నిర్వహిస్తున్నానని, ఎవరైనా తనకు సలహా ఇస్తే దాన్ని వింటానని ఆయన అన్నారు. అయితే దేశాన్ని పార్టీ నడుపుతోందని, అందులో వారు నిష్ణాతులని, తాము(ఆర్‌ఎస్‌ఎస్) కాదని ఆయన వ్యాఖ్యానించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ని వ్యతిరేకించిన వారే తమ వైఖరిని మార్చుకున్న సందర్భాలు అనేకం ఉన్నాయని ఆయన చెప్పారు. జయప్రకాశ్ నారాయణ్ నుంచి ప్రణబ్ ముఖర్జీ వరకు ఆర్‌ఎస్‌ఎస్‌పై తమ వైఖరిని మార్చుకున్నారని ఆయన తెలిపారు.

సైన్యం ప్రక్షాళన అవసరం లేదు

- నాలుగు థియేటర్ కమాండ్ల ఏర్పాటు సరికాదన్న ఐఏఎఫ్ చీఫ్
- దేశ అవసరాలను మూల్యాంకన చేయాలని ప్రధానికి హితవు

న్యూఢిల్లీ : త్రివిధ దళాల ప్రక్షాళనకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను భారత వాయు సేన (ఐఏఎఫ్) చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ ఏపీ సింగ్ ప్రశ్నించారు. మధ్య ప్రదేశ్‌లోని మహౌలో మంగళవారం జరిగిన ఓ సెమినార్‌లో సింగ్ మాట్లాడుతూ, ఈ సమయంలో అన్నిటినీ చెడగొట్టి, ఒకే నిర్మాణంగా చేయడం సరైనది కాకపోవచ్చునని హెచ్చరించారు. ఇతర దేశాల తరహాలో థియేటర్ కమాండ్స్‌ను తీసుకురానక్కర్లేదన్నారు. కింది స్థాయిలో మరొక నిర్మాణం వాస్తవానికి అవసరం లేదని చెప్పారు. ప్రధాని మోదీ సైన్యాన్ని థియేటర్ కమాండ్స్‌గా పునర్వ్యవస్థీకరించేందుకు ప్రయత్నిస్తున్న సంగతి తెలిసిందే. యుద్ధ నౌకలు, గస్తీ విమానాలు, సైనికులు, యుద్ధ విమానాలు అందుబాటులో ఉండేలా చేయడానికి థియేటర్ కమాండ్స్ ఉపయోగపడతాయి. గ్రౌండ్ రాడార్ నెట్‌వర్క్ గల ఇతర క్షిపణి, గన్ రెజిమెంట్స్‌తో కలిసి ఈ కమాండ్స్ పని చేస్తాయి. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల వెంబడి ఎదురయ్యే ముప్పును తిప్పికొట్టడానికి ఈ విధానం ఉపయోగపడుతుంది. భారత సైన్యం, నావికా దళం, వాయు సేన చాలా వరకు శిక్షణ, ఆయుధాలు, పరికరాలు, ప్రణాళిక వంటివాటిలో వేర్వేరుగా పని చేస్తాయి. ఈ నేపథ్యంలో సింగ్ మాట్లాడుతూ, అత్యున్నత స్థాయిలో ఉమ్మడి ప్రణాళిక, సమన్వయం అవసరమని తాను భావిస్తున్నానని చెప్పారు. పునర్వ్యవస్థీకరణ వల్ల కనీసం నాలుగు థియేటర్ కమాండ్స్‌ను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. పాకిస్థాన్‌ను గమనించేందుకు పశ్చిమ దిశలో ఒకటి, చైనాపై దృష్టి పెట్టేందుకు తూర్పువైపున ఒకటి, హిందూ మహాసముద్రం ప్రాంతం కోసం మారిటైమ్ కమాండ్, చివరిగా, గగనతల రక్షణ కమాండ్ ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఉత్తర ప్రాంతమైన జమ్ముకశ్మీరును ప్రస్తుతానికి యథాతథంగా ఉంచుతారని మిలిటరీ అధికారులు తెలిపారు. త్రివిధ దళాలు భూమి, సముద్రం, గగనతలాల్లో నిరాఘాటంగా కార్యకలాపాలను నిర్వహించడానికి వీలు కల్పించడం కోసం ఈ విధానాన్ని రూపొందించారు. ప్రతి దేశానికి తనకంటూ ప్రత్యేకమైన అవసరాలు ఉంటాయని సింగ్ చెప్పారు. భారత దేశం తన అవసరాలను మూల్యాంకన చేయాలన్నారు. లేని పక్షంలో తప్పు జరుగుతుందని హెచ్చరించారు.

బిల్లులు ఎక్కువ కాలం పెండింగ్ | సమర్థనీయం కాదు

ఆర్టికల్ 200లో పేర్కొన్న 'సాధ్యమైనంత త్వరగా'పై సుప్రీంకోర్ట్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: చట్టసభలు ఆమోదించి పంపిన బిల్లులను గవర్నర్లు ఏడాదికి పైగా పెండింగ్‌లో ఉంచడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని సుప్రీంకోర్టు పేర్కొంది. అనంతకాలం వాటిని నిలిపివేస్తే రాజ్యాంగంలోని ఆర్టికల్ 200లో పేర్కొన్న 'సాధ్యమైనంత త్వరగా' అన్న పదానికి ఎలాంటి ప్రయోజనము ఉండదని పేర్కొంది. రాష్ట్రపతి నివేదనపై రాజ్యాంగ ధర్మాసనం గురువారం కోర్టు విచారణను కొనసాగించింది. రాజ్యాంగ నిర్మాతలు ఆరు వారాల పరిమితిని ఉద్దేశపూర్వకంగానే 'సాధ్యమైనంత త్వరగా' అనే పద బంధంతో భర్తీ చేశారని, ఆ పదానికి తక్షణం అని అర్థమని డ్రాఫ్టింగ్ కమిటీ సభ్యుడొకరు పేర్కొన్నారని, ఈ పద బంధాన్ని విస్మరించవచ్చా? అని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ కేంద్రాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీ ఆమోదం తెలిపిన ద్రవ్య బిల్లులకు సైతం ఆమోదం తెలపకుండా తన వద్దనే ఉంచుకుంటే, ఆ చర్య గవర్నర్‌ను రాష్ట్రానికి 'సూపర్ చీఫ్ మినిస్టర్'గా మారుస్తుందని తమిళనాడు తరపున సీనియర్ అడ్వకేట్ అభిషేక్ సింఘ్వీ వాదించారు. బిల్లుకు ఆమోదం తెలపకుండా శాశ్వతంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు కనుక కల్పిస్తే అది ఆర్టికల్ 200ను ఎగతాళి చేయడమే అవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర శాసన సభ ఆమోదించిన బిల్లులకు సంబంధించి గవర్నర్ అధికారాలను ఆర్టికల్ 200 అందిస్తుంది. బిల్లును రాష్ట్రపతి పరిశీలనకు రిజర్వ్ చేసేందుకు ఈ అధికరణ వీలు కల్పిస్తుంది.

'ఒక ఒరలో రెండు కత్తులు ఉన్నట్లే'

రాష్ట్ర నిర్వాహక వ్యవస్థ, రాష్ట్ర శాసన వ్యవస్థపై గవర్నర్ ఆధిపత్యం ప్రదర్శించలేరని తమిళనాడు ప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు స్పష్టం చేసింది. అది ఒక ఒరలో రెండు కత్తులు ఇమిడ్చినట్లుగా ఉంటుందని పోల్చింది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులకు సమ్మతి తెలియచేసేందుకు గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించే అధికారం న్యాయస్థానానికి ఉంటుందా అన్న రాజ్యాంగ ప్రశ్నలను లేవనెత్తిన రాష్ట్రపతి నివేదనపై సీజేఐ నేతృత్వంలో రాజ్యాంగ ధర్మాసనం ఎదుట తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది ఏఎం సింఘ్వీ గురువారం వాదనలు వినిపించారు. "ఇది ఒక ఒరలో రెండు కత్తులుండటమే. ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి తన ప్రజాస్వామిక బాధ్యతల నిర్వహణకు ఇది విరుద్ధం" అని సింఘ్వీ తెలిపారు. తాను కూడా మొదటి నుంచి ఇదే విషయాన్ని సొలిసిటర్ జనరల్‌ని అడుగుతున్నానని సీజేఐ గవాయ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సాధ్యమైనంత త్వరితంగా బిల్లులపై గవర్నర్లు నిర్ణయం తీసుకుంటారని రాజ్యాంగాన్ని రూపొందించిన సభ్యులు ఆలోచించి ఉంటారా అని సీజేఐ ప్రశ్నించారు. ఒకవేళ అదే రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశమైతే దాన్ని మనం విస్మరించగలమా అని ఆయన నిలదీశారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సందర్భంగా జోక్యం చేసుకుంటూ కోర్టు చెబుతున్న ఉదాహరణను బట్టి గవర్నర్ తక్షణమే స్పందించాలని మీరు ఆశిస్తున్నారా అని ధర్మాసనాన్ని అడిగారు. దీనికి సీజేఐ స్పందిస్తూ తక్షణమే కాదని, సహేతుకంగా ఉండాలని అన్నారు. మెహతా జవాబిస్తూ ఒక్కో కేసులోని వాస్తవాలను బట్టి గడువు ఉంటుందని చెప్పారు. కాని బిల్లుపై ఎటువంటి సమ్మతి తెలియచేయకుండా ఆరు నెలలపాటు గవర్నర్ తన వద్దనే ఉంచుకోవడం మాత్రం సమర్థనీయం కాదని సీజేఐ స్పష్టం చేశారు. "బిల్లుల మంచిచెడ్డల జోలికి నేను వెళ్లను. ఆరు నెలలు లేక ఏడాదికిపైగా బిల్లులను పెండింగ్‌లో ఉంచడం మాత్రం ఎట్టి పరిస్థితులలోనూ సమర్థనీయం కాదు" అని సీజేఐ స్పష్టం చేశారు.

విషపూరిత గాలి పీలుస్తున్న భారతీయులు

- డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలకు 8 రెట్లు ఎక్కువ

న్యూఢిల్లీ : ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) సిఫారసు చేసిన సురక్షిత గాలి నాణ్యత స్థాయికి ఎనిమిది రెట్లు ఎక్కువ విషపూరిత కణాలు గల గాలిని ప్రతి భారతీయుడు పీలుస్తున్నాడు. ఇంత ఎక్కువ స్థాయిలో విషపూరిత కణాలను పీల్చుకోవడం వల్ల భారతీయుల సగటు ఆయుష్షు 3.5 సంవత్సరాలు తగ్గిపోతున్నది. అత్యధిక కాలుష్యం గల ఢిల్లీ నగరంలో ప్రతి ఒక్కరూ 8.2 సంవత్సరాలు నష్టపోతారు. ఉత్తరాది కన్నా దక్షిణాది కొంత వరకు మెరుగైన స్థితిలో ఉంది. డబ్ల్యూహెచ్‌వో సిఫారసు చేసిన స్థాయికి గాలి కాలుష్యాన్ని తగ్గించగలిగితే, కర్ణాటకలో ప్రతి ఒక్కరూ అదనంగా 1.6 సంవత్సరాలు, ఆంధ్ర ప్రదేశ్‌లో 2.1 సంవత్సరాలు, తెలంగాణలో 2.4 సంవత్సరాలు, తమిళనాడులో 1.7 సంవత్సరాలు, కేరళలో 1.3 సంవత్సరాలు జీవించగలుగుతారు. చికాగో విశ్వవిద్యాలయం నేతృత్వంలోని గ్లోబల్ టీమ్ రూపొందించిన ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్ ఈ వివరాలను వెల్లడించింది. 2023 నాటి పరిస్థితులను విశ్లేషించి ఈ నివేదికను తయారు చేశారు.

మహిళల భద్రతలో ఈశాన్య నగరాలు టాప్

ఢిల్లీలో కొరవడిన రక్షణ

న్యూఢిల్లీ,: దేశంలో మహిళలకు అత్యంత సురక్షిత నగరాల జాబితాలో కోహిమా, విశాఖపట్నం, భువనేశ్వర్, ఐజ్వాల్, గ్యాంగ్‌టక్, ఇటానగర్, ముంబై ముందు వరుసలో నిలిచాయి. మహిళల రక్షణకు సంబంధించిన సూచీలలో పాట్నా, జైపూర్, ఫరీదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, శ్రీనగర్, రాంచీ పూర్తిగా వెనుకబడ్డాయి. మహిళల భద్రతపై జాతీయ వార్షిక నివేదిక, సూచీ 2025 గురువారం విడుదలైంది. 31 నగరాల్లో 12,770 మంది మహిళలను సర్వే చేసి ఈ నివేదిక రూపొందించారు. లింగ సమానత్వం, పటిష్టమైన పౌర నిర్వహణ, సమర్థవంతమైన పోలీసు వ్యవస్థ, మహిళల ప్రయాణ సదుపాయాలు, భద్రత వంటి అంశాలను ప్రాతిపదికగా తీసుకుని మహిళల భద్రతకు సంబంధించి నగరాలను నాలుగు విభాగాలుగా విభజించారు.

అమెరికాకు ఎదురు దెబ్బ

- భారత దేశంపై టారీఫ్‌ల దాడిని తప్పుబట్టిన అమెరికా ఆర్థికవేత్త
- బ్రిక్స్ వంటి వాటి వైపు భారత్ వెళ్తుంది: రిచర్డ్ వూల్ఫ్

వాషింగ్టన్ : భారత దేశంపై టారిఫ్‌ల దాడి చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అమెరికన్ ఆర్థికవేత్త రిచర్డ్ వూల్ఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రంప్ వైఖరి వల్ల అమెరికాకు ఎదురుదెబ్బ తగులుతుందని హెచ్చరించారు. బ్రిక్స్ వంటి ప్రత్యామ్నాయ ఆర్థిక మండళ్లు బలోపేతమవుతాయని జోస్యం చెప్పారు. చిన్న దేశాలపై ఒత్తిడి చేసినట్లుగా, భారత దేశంతో అమెరికా వ్యవహరించజాలదని స్పష్టం చేశారు. వూల్ఫ్ న్యూయార్క్‌లోని న్యూ స్కూల్‌లో ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్. అమెరికా భారత్ వంటి దేశంతో మాట్లాడటం కన్నా లెబనాన్ వంటి చిన్న మధ్య ప్రాచ్య దేశంతో మాట్లాడటం భిన్నంగా ఉంటుందని వూల్ఫ్ అన్నారు. జనాభాను బట్టి భారతదేశం ఇప్పుడు ప్రపంచంలోనే అతి పెద్దదని, చైనాను అధిగమించిందని చెప్పారు. భారత దేశంపై తన టారిఫ్‌ల బెదిరింపులను కొనసాగిస్తే, ఆయన ఓ ప్రత్యేకమైన ప్రత్యర్థితో ఆడుకుంటున్నట్లేనని వివరించారు. వూల్ఫ్ రష్యన్ జర్నలిస్ట్ రిక్ శాంచెజ్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికన్ మార్కెట్‌ను భారత ఎగుమతులకు మూసివేస్తే, భారత దేశం అభివృద్ధి చెందుతున్న ఇతర మార్కెట్లకు దగ్గర అవుతుందని వూల్ఫ్ చెప్పారు. పాశ్చాత్య దేశాలు ఆంక్షలు విధించడంతో రష్యా మరో మార్కెట్‌ను చూసుకున్నట్లుగానే, భారత దేశం కూడా తన ఎగుమతులను అమెరికాకు కాకుండా, బ్రిక్స్ దేశాలకు పంపిస్తుందన్నారు.

అమెరికన్లను దెబ్బ తీస్తున్నాయి: డెమోక్రాట్లు

రష్యా చమురు దిగుమతుల సాకుతో కేవలం భారత్‌ను మాత్రమే టార్గెట్ చేయడం పట్ల విపక్ష డెమోక్రాట్లు అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్‌ను తీవ్రంగా తప్పుబట్టారు. ఇదేం పాలసీ, ఇదేం కక్ష సాధింపని నిలదీశారు. దీని కారణంగా దేశీయంగా అమెరికన్లకు తీవ్ర నష్టం జరుగుతుందని హెచ్చరించారు. మాస్కోలో అతి పెద్ద ముడి చమురు ఎగుమతిదారులలో ఒకటైన చైనాపై ఎటువంటి జరిమానాలను విధించకుండా, రష్యా చమురు కొనుగోలు విషయంలో భారత్‌ను మాత్రమే టార్గెట్ చేసినందుకు అధ్యక్షుడు ట్రంప్, ఆయన పరిపాలనను యూఎస్ హౌస్ ఫారిన్ అఫైర్స్ కమిటీలోని డెమోక్రాట్లు తీవ్రంగా విమర్శించారు. భారత్‌పై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాలు అమెరిన్లను దెబ్బతీస్తున్నాయని, గత రెండు దశాబ్దాలుగా ద్వైపాక్షిక ప్రయత్నాల ద్వారా భారత్-అమెరికా మధ్య ఏర్పడిన సత్సంబంధాలను విధ్వంసం చేస్తున్నాయని వారు విమర్శించారు. రష్యా నుంచి పెద్దయెత్తున చమురును కొనుగోలు చేస్తున్న చైనా, ఇతర దేశాలపై ఆంక్షలు విధించడానికి బదులుగా భారత్‌పై అదనపు సుంకాలు విధించడం వల్ల అమెరికన్ సమాజానికి నష్టాన్ని కలిగించడమే కాక, రెండు దేశాల సంబంధాలు దెబ్బతింటాయని అన్నారు.

జమ్ములో వర్షాలకు 41 మంది మృతి

- అత్యధికులు వైష్ణోదేవి యాత్రికులే..యాత్రకు బ్రేక్

జమ్మూ/శ్రీనగర్, న్యూఢిల్లీ, ఆగస్టు 28: జమ్ము ప్రాంతంలో గడచిన మూడు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలు పెను విధ్వంసాన్ని సృష్టించడంతోపాటు 41 మందిని బలిగొన్నాయి. మంగళ, బుధవారాలలో రియాసీ, దోడా జిల్లాల్లో రికార్డు స్థాయిలో కురిసిన భారీ వర్షాలు సృష్టించిన బీభత్సానికి 41 మంది మరణించారు. వీరిలో అత్యధికులు వైష్ణోదేవి యాత్రికులే. మంగళవారం మధ్యాహ్నం అద్కున్‌వారీ సమీపంలో వైష్ణోదేవి యాత్రా మార్గంలో సంభవించిన మేఘ విస్ఫోటం వల్ల ముంచెత్తిన ఆకస్మిక వరదల్లో 34 మంది మరణించారు. అదే రోజున ఉదయం దోడా జిల్లాలో వచ్చిన ఆకస్మిక వరదలకు నలుగురు మరణించారు. మరణించిన 34 మందిలో 18 మంది మృతదేహాలను జమ్ములోని ప్రభుత్వ వైద్య కళాశాల దవాఖానకు తరలించగా వీరిని పంజాబ్, ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ వాసులుగా గుర్తించారు. కాత్రాలోని దవాఖానను సందర్శించిన జమ్మూ కశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ మిశ్రా గాయపడి చికిత్స పొందుతున్న 13 మంది ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు రూ.9 లక్షల చొప్పున పరిహారాన్ని అందచేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

చండీగఢ్-కులూ హైవేపై 50 కి.మీ. ట్రాఫిక్ జామ్

భారీ వర్షాల కారణంగా అనేకచోట్ల కొండ చరియలు విరిగిపడడంతో చండీగఢ్-కులూ హైవేపైన 50 కిలోమీటర్ల పొడవునా భారీ స్థాయిలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఢిల్లీ -ఎన్‌సీఆర్‌కి పండ్లు, కూరగాయలను తీసుకువెళుతున్న వందలాది ట్రక్కులతోసహా వేలాది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చండీగఢ్-మనాలీ హైవేపైన అనేక చోట్ల అడ్డంకులు ఏర్పడడంతో వాహన ప్రయాణికులు గంటల కొద్దీ రోడ్డుపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ములుగులో యూరియా కోసం కలెక్టర్ దివాకర కాళ్లు మొక్కుతున్న కౌలు రైతు తిరుపతిరెడ్డి

కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా

యూరియా కోసం ములుగు కలెక్టర్ కాళ్లు మొక్కిన రైతు

ములుగు, ఆగస్టు28(నమస్తేతెలంగాణ) : గంటల తరబడి క్యూలో ఉండి యూరియా కోసం పడిగాపులు కాసినా యూరియా టోకెన్లు ఇవ్వకపోవడంతో గురువారం ములుగు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వీరికి మద్దతుగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, నాయకులు జాతీయ రహదారిపై బైఠాయించారు. పోలీసులు రైతులను శాంతింపజేసి అందరికీ టోకెన్లు ఇప్పిస్తామని చెప్పి వారిని పీఏసీఎస్ కార్యాలయానికి తీసుకొని వెళ్లారు. ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర పీఏసీఎస్‌కు చేరుకుని స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ములుగు మండలం దేవగిరిపట్నంకు చెందిన కౌలు రైతు యాపాటి తిరుపతిరెడ్డి సరిపడా యూరియా అందించాలని కలెక్టర్ కాళ్లపై పడి వేడుకున్నాడు. దీంతో కలెక్టర్ అలా చేయవద్దని, రైతులకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

• రైతుల గోస పట్టదా?: కొప్పుల

రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు గోసపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం పెద్దపల్లి జిల్లా ధర్మారంలోని నంది మేడారం సింగిల్ విండో కార్యాలయం వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులను చూసి ఆగారు. డగా, అటుగా వెళ్తున్న ఆయన వారిని చూసి ఆగారు. ఇద్దరు మంత్రులున్నా సరిపడా యూరియా తెప్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. - ధర్మారం

• క్యూలో నిలబడలేక రైతుకు ఫిట్స్

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం దుగ్నెపల్లి హాక సెంటర్ వద్ద యూరియా కోసం క్యూ కట్టిన.. రైతు బొంబురపు రాజిరెడ్డి ఫిట్స్‌తో కుప్పకూలిపోయాడు. గంటల తరబడి నిల్చొని ఉండడంతో అస్వస్థతకు గురై కిందపడిపోగా, తోటి రైతులు 108లో చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

-చెన్నూర్ రూరల్

వానలోనూ యూరియా తిప్పలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ ఐకేపీ మహిళా గ్రూప్ ఎరువుల దుకాణానికి రైతులు గురువారం ఉదయం 5గంటల నుంచే తరలివచ్చారు. వాన భారీగా పడడంతో చెప్పులు లైన్‌లో పెట్టి, గోదాం గోడ పక్కన నిల్చున్నారు. ఉదయం 11 గంటలైన దుకాణదారులు ఎవరు రాకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు పహారాలో 800 మందికి టోకెన్లు ఇచ్చారు. 440 బ్యాగుల యూరియా ఉందని, మరో రెండు రోజుల్లో మరింత వస్తుందని ఏవో దుర్గరాజు తెలిపారు. - ముస్తాబాద్

• ఇల్లెందులో ఎమ్మెల్యే కోరం కనకయ్యకు నిరసనసెగ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మార్కెట్ యార్డులోని ఎరువుల గోడౌన్ వద్దకు యూరియా కోసం వచ్చిన రైతులు విసుగు చెంది ప్రభుత్వ దవాఖాన రోడ్డుపై గురువారం ధర్నా చేపట్టారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య రావడంతో రైతులకు, ఎమ్మెల్యేకు వాగ్వాదం జరిగింది. తర్వాత ఒక కట్ట చొప్పున యూరియా పంపిణీ చేశారు. - ఇల్లెందు

• యూరియా కోసం అష్టకష్టాలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు యూరియా కోసం అరిగోస పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో యూరియా దొరక్క రైతులు అష్టకష్టాలు పడుతున్నారని తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే ఆల మండల కేంద్రంలోని రైతు వేదిక వద్దకు వెళ్లి అన్నదాతలతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకొన్నారు. సమస్య తీర్చాలని ఏవో అనిల్‌కుమార్‌ను కోరారు. - మూసాపేట

రైతులను అరిగోస పెడుతున్న రేవంత్‌రెడ్డి

సీఎం రేవంత్ రెడ్డి పాలనలో యూరియా అందక రైతులు అరిగోస పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ధ్వజమెత్తారు. గురువారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రైతులతో కలిసి సకాలంలో యూరియా అందించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. - మహబూబాబాద్ రూరల్

• యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

రాష్ట్రంలో యూరియా కొరతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం కందుకూరులో రైతులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. ఆధార్ కార్డులు, భూమి పాస్ బుక్కులు తీసుకుని లైన్ కడితే పోలీసులతో యూరియా టోకెన్లు ఇప్పిస్తున్నట్టు రైతులు ఆమెకు వివరించారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా దొరుకుతున్నట్టు పేర్కొనడంతో వెంటనే రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. వ్యవసాయ అధికారి లావణ్య, పీఏసీఎస్ కార్యదర్శి యాదగిరిరెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 50 సార్లకుపైగా ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్ ఒక్కసారైనా యూరియా గురించి అడిగారా? అని ప్రశ్నించారు. కేంద్రం వివక్షతోనే ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. - కందుకూరు

బీఆర్ఎస్ సోషల్ మీడియా ప్రతినిధికి..

ఇల్లెందు ఎమ్మెల్యే తమ్ముడి బెదిరింపులు

టేకులపల్లి, ఆగస్టు 28: భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో రైతులు యూరియా కోసం గురువారం భారీ సంఖ్యలో గోదాముట వద్దకు క్యూ కట్టారు. యూరియా అందని రైతులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులే యూరియా బస్తాలను బ్లాక్‌లో అమ్ముకుంటున్నారని ఆరోపించగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ టేకులపల్లి మండల సోషల్‌మీడియా ప్రతినిధి మాలోత్ నివాస్.. టేకులపల్లి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. ఈ పోస్టు పట్ల ఎమ్మెల్యే సోదరుడు సురేందర్ ఆగ్రహించాడు. మాలోత్ నివాస్‌కు ఫోన్‌చేసి 'మా అన్నపై అసత్య ప్రచారం చేస్తే వేళ్లు కట్ చేస్తా' అంటూ బెదిరించారు. దీనిపై నివాస్.. టేకులపల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరువురిని పిలిపి విచారిస్తున్నారు.

• రెండు రోజుల్లో యూరియా ఇవ్వకుంటే ధర్నా

రెండు రోజుల్లో రైతులందరికీ సరిపడా యూరియా ఇవ్వకపోతే ఎక్కడికక్కడ రైతులతో కలిసి ధర్నా చేస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. గురువారం ఆయన జనగామ జిల్లా పాలకుర్తి మండలం తొర్రూరు (జే)లోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతుల వద్దకు వెళ్లి మాట్లాడారు. రైతులు యూరియా కోసం తిండీతిప్పలు మాని తెల్లవారు జాము నుంచే ఎరువుల కేంద్రాల వద్దకు వస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు ఎరువుల కోసం అధికారుల కాళ్లు పట్టుకునే స్థితికి వచ్చిందని మండిపడ్డారు. ఎరువుల సరఫరాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. - పాలకుర్తి

జగన్‌మోహన్‌రావుకు బెయిల్

- హెచ్‌సీఏ అధ్యక్షుడికి హైకోర్టులో ఊరట

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడు జగన్‌మోహన్ రావుకు ఊరట లభించింది. ఫోర్జరీ కేసులో నెల రోజులకు పైగా రిమాండ్‌లో ఉన్న జగన్‌మోహన్‌రావుకు గురువారం హైకోర్టు జస్టిస్ సుజన షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. లక్ష రూపాయల వ్యక్తిగత బాండ్‌తో పాటు ఇద్దరు పూచీకత్తులను ట్రయల్ కోర్టుకు సమర్పించాలని ఆదేశించారు. ప్రతీ సోమవారం ఉదయం 11 గంటలకు సంబంధిత ఎస్‌హెచ్‌వో ముందు 8 వారాల పాటు లేదా చార్జిషీట్ దాఖలు చేసే వరకు దర్యాప్తు అధికారి పిలిస్తే హాజరుకావాల్సి ఉంటుందని కోర్టు తీర్పులో పేర్కొంది.

బీఎన్‌ఎస్‌ఎస్ సెక్షన్ 480(3) నిబంధనలకు కట్టుబడి ఉండాలని, సాక్ష్యాలను తారుమారు చేయడం, సాక్షులను బెదిరించడం, ప్రభావితం చేయకూడదని స్పష్టం చేసింది. శ్రీచక్ర క్లబ్ ఫోర్జరీ కేసులో నిర్దిష్టమైన ఆధారాలు చూపడంలో సీఐడీ విఫలమైన నేపథ్యంలో తనకు బెయిల్ ఇవ్వాలని జగన్‌మోహన్‌రావు వేసిన పిటిషన్‌ను విచారించిన హైకోర్టు తాజా తీర్పు వెలువరించింది.

సత్తాచాటిన వంశీ

ప్రపంచ పవర్‌లిఫ్టింగ్‌లో పసిడి ధమాకా ● దాతల సాయంతో పోటీలకు గిరిజన యువకుడు

వాజేడు, ఆగస్టు 28: ప్రపంచ జూనియర్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ ఆటగాడు మోడెం వంశీ సత్తాచాటాడు. నార్త్ అమెరికాలోని శాన్‌జోస్‌లో జరిగిన ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో వంశీ రెండు పసిడి పతకాలతో మెరిశాడు. ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన వంశీ..పురుషుల జూనియర్ 66కిలోల విభాగంలో ప్రత్యర్థులకు దీటైన సవాలు విసిరాడు. స్క్వాట్‌లో 300కిలోలు, బెంచ్‌ప్రెస్‌లో 145కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 235కిలోలు మొత్తం 680కిలోలతో వంశీ అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో బ్రాడీ పీస్ట్(అమెరికా, 677.5), క్మిట్రో బుటెంకో(ఉక్రెయిన్, 677.5) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. గిరిజన యువకుడైన వంశీ గత ఏడాది మాల్టాలో జరిగిన టోర్నీలోనూ స్వర్ణ పతకంతో ఆకట్టుకున్నాడు. ప్రపంచ పవర్‌లిఫ్టింగ్ టోర్నీలో రెండు పసిడి పతకాలు సాధించిన వంశీని రాష్ట్ర పవర్‌లిఫ్టింగ్ సంఘం ప్రధాన కార్యదర్శి జోసెఫ్ జేమ్స్ అభినందించారు. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వంశీ పతకాలు సాధించడం పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన వంశీకి పోటీల్లో పాల్గొనే అవకాశం వచ్చినా ఆర్థిక స్థోమత లేక దాతల సహకారంతో రూ.4లక్షలు సమకూరినా...మరో 2లక్షలు అప్పుజేసి వెళ్లాడని పేర్కొన్నాడు. ఏటూరు నాగారం ఐటీడీఏ నుంచి రూ.50వేలు మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందడంలేదని వంశీ సన్నిహితులు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ఖ్యాతిని ఇనుమడింపజేస్తున్న వంశీ మరిన్ని పతకాలు సాధించేలా ప్రభుత్వం మద్దతుగా నిలువాలని వారు కోరుతున్నారు.

ఐపీఎల్‌కు అశ్విన్ వీడ్కోలు

- విదేశీ లీగ్‌లు ఆడేందుకు ఆసక్తి

చెన్నై: గతేడాది అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన భారత వెటరన్ స్పిన్నర్, చెన్నై సూపర్ కింగ్స్ ఆటగాడు రవిచంద్రన్ అశ్విన్ ఐపీఎల్‌కూ వీడ్కోలు పలికాడు. 2009లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుతో ఆరంభమైన అశ్విన్ ఐపీఎల్ కెరీర్.. 17 ఏండ్ల తర్వాత అదే ఫ్రాంచైజీతో ముగిసింది. ఈ మేరకు అతడు గురువారం ఎక్స్ వేదికగా తన నిర్ణయాన్ని ప్రకటించాడు. 'ప్రతి ముగింపునకూ ఒక కొత్త ఆరంభం ఉంటుంది. నా ఐపీఎల్ కెరీర్ నేటితో ముగిసింది. కానీ ఇతర లీగ్స్‌లో ఆటపై నా అన్వేషణ నేటి నుంచే మొదలైంది' అని అతడు రాసుకొచ్చాడు. సుదీర్ఘ కెరీర్‌లో ఈ తమిళ తంబీ.. 221 మ్యాచ్‌లు ఆడి 187 వికెట్లు తీసి ఈ లీగ్‌లో అత్యధిక వికెట్లు తీసినవారిలో

ఐదో స్థానంలో ఉన్నాడు. 2010, 2011లో సీఎస్‌కే టైటిళ్లు గెలవడంలో కీలకపాత్ర పోషించిన ఈ చెన్నై దిగ్గజం.. 2010 సీజన్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డునూ గెలుచుకున్నాడు. ఆరు సీజన్ల పాటు చెన్నైకి ఆడిన ఆష్ అన్న.. ఆ జట్టు తరఫున 90 వికెట్లు తీశాడు. ఐపీఎల్‌కు వీడ్కోలు పలికిన అశ్విన్.. విదేశీ లీగ్‌లో ఆడేందుకు ఆసక్తి చూపిస్తున్నాడు.

క్వార్టర్స్‌కు సింధు

ధృవ్, తనీశ్ ద్వయం సంచలన విజయం | ప్రణయ్‌కు షాక్

పారిస్: బీడబ్ల్యూఎఫ్ బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మాజీ చాంపియన్ పీవీ సింధు క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. గురువారం ఇక్కడ జరిగిన ప్రిక్వార్టర్స్‌లో 15వ ర్యాంకు సింధు.. 21-19, 21-15తో ప్రపంచ రెండో ర్యాంకర్ వాంగ్ ఝీ ఈ (చైనా)ను ఓడించి క్వార్టర్స్ చేరింది. 2019లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన తెలుగమ్మాయి.. 48 నిమిషాల్లోనే వరుస గేమ్స్‌ను గెలుచుకుని వాంగ్‌కు షాకిచ్చింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఐదుసార్లు పతకాలు గెలిచిన సింధు.. ప్రిక్వార్టర్స్ గేమ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడి 11-6తో ఆధిక్యంలో నిలిచింది. పదునైన స్మాష్‌లు, నెట్ విన్నర్స్‌తో ఆధిపత్యం ప్రదర్శించింది. అయితే వాంగ్ కూడా పుంజుకోవడంతో 19-19తో ఇరువురి పాయింట్లు సమమైనా ఆ గేమ్‌ను సింధు గెలుచుకుంది. రెండో గేమ్‌లో ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురుకాకుండానే సింధు ఆటను విజయంతో ముగించింది.

ధృవ్, తనీషా సంచలనం

మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత ద్వయం ధృవ్ కపిల-తనీషా క్రాస్టో 19-21, 21-12, 21-15తో ప్రపంచ ఐదో ర్యాంక్ జంట టాంగ్ చౌన్ మన్ – సె యింగ్ సువెట్ (హాంకాంగ్)ను ఓడించింది.



అల్కరాజ్ జోరు

మూడో రౌండ్‌కు స్టార్ ప్లేయర్లు

న్యూయార్క్: ప్రతిష్ఠాత్మక యూఎస్ ఓపెన్‌లో యువ సంచలనం కార్లొస్ అల్కరాజ్ (స్పెయిన్)తో పాటు దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) మూడో రౌండ్‌కు చేరారు. ఆర్థర్ ఆషే స్టేడియం వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్‌లో రెండో సీడ్ అల్కరాజ్.. 6-1, 6-0, 6-3తో మాటియా బెల్లూచి (ఇటలీ)పై అలవోక విజయం సాధించాడు. అల్కరాజ్ దూకుడు ముందు బెల్లూచి తేలిపోయాడు. తొలి గేమ్ నుంచే దూకుడు ప్రదర్శించిన నయా స్పెయిన్ బుల్.. 24 నిమిషాల్లోనే మొదటి సెట్‌ను గెలుచుకున్నాడు. ఆ తర్వాత కూడా పోరు ఏకపక్షంగానే సాగింది. ఎనిమిదో గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌పై కన్నేసిన అతడు.. తదుపరి రౌండ్‌లో లుసియానో దర్దెరితో తలపడనున్నాడు. బుధవారం జరిగిన రెండో రౌండ్‌లో ఏడో సీడ్ జొకో.. 6-7 (5/7), 6-3, 6-3, 6-1తో అమెరికాకే చెందిన స్వజ్దను ఓడించాడు. 19 సారి యూఎస్ ఓపెన్ ఆడుతున్న జొకో.. ప్రతి సీజన్‌లోనూ మూడో రౌండ్ చేరడం గమనార్హం. తొలి సెట్ టైబ్రేకర్‌లో ఓడినా జొకో తర్వాత పుంజుకుని వరుస సెట్లను గెలుచుకున్నాడు. మిగిలిన మ్యాచ్‌లలో అమెరికా ఆటగాడు బెన్ షెల్టన్ 6-4, 6-2, 6-4తో పాబ్లో కరెనొ (స్పెయిన్)ను మట్టికరిపించాడు. యూఎస్‌కే చెందిన ఫ్రాన్సిస్ టియాఫొ.. 6-4, 7-5, 6-7 (8/10), 7-5తో మార్టిన్ (అమెరికా)తో పోరాడి గెలిచి మూడో రౌండ్ చేరాడు.

మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో టాప్ సీడ్ సబలెంకా.. 7-6 (7/4), 6-2తో పొలిన కుడర్మెటొవ (రష్యా)పై గెలిచింది. ఇటలీ అమ్మాయి జాస్మిన్ పౌలోని 6-3-, 6-3తో



ఇవా జోవిక్ (అమెరికా)ను చిత్తు చేసి థర్డ్ రౌండ్ చేరింది. వీరితో పాటు మిర్రా ఆండ్రీవా, ఎలీనా రిబాకినా, జెస్సికా పెగులా, క్రెజికోవ మూడో రౌండ్‌కు ప్రవేశించారు.

క్రీడా సంస్కృతికి కృషి

హైదరాబాద్, ఆట ప్రతినిధి: రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. గురువారం స్థానిక హోటల్‌లో తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సమావేశం జరిగింది. ప్రముఖ వ్యాపారవేత్త సంజీవ్ గోయెంకా చైర్మన్‌గా వ్యవహరిస్తున్న బోర్డు సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, క్రీడా మంత్రి శ్రీహరి పాల్గొన్నారు. టీమ్ఇండియా మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏదో ఒక క్రీడలో పోటీపడేలా చూస్తే ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అభినవ్ బింద్రా, పుల్లెల గోపీచంద్, బైచుంగ్ భూటియా, వైస్ చైర్‌పర్సన్ ఉపాసన, రవికాంత్‌రెడ్డి హాజరయ్యారు.

డానిష్, రజత్ శతక జోరు

- భారీ స్కోరు దిశగా సెంట్రల్ జోన్

బెంగళూరు: దేశవాళీ క్రికెట్ ఆరంభ సీజన్ దులీప్ ట్రోఫీలో తొలి రోజే భారీ స్కోర్లు నమోదయ్యాయి. సెంట్రల్ జోన్, నార్త్ ఈస్ట్ జోన్ మధ్య జరుగుతున్న దులీప్ ట్రోఫీ రెండో క్వార్టర్స్‌లో సెంట్రల్ జోన్ బ్యాటర్ డానిష్ మాలేవర్ (219 బంతుల్లో 198 నాటౌట్, 35 ఫోర్లు, 1 సిక్స్) ద్విశతకానికి రెండు పరుగుల దూరంలో ఉండగా కెప్టెన్ రజత్ పాటిదార్ (96 బంతుల్లో 125, 21 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడాడు. దీంతో 77 ఓవర్లలోనే 432/2 భారీ స్కోరు చేసింది. మరో మ్యాచ్‌లో నార్త్ జోన్.. 75.2 ఓవర్లలో 308/6 రన్స్ చేసింది.

హైదరాబాద్‌లో పీవీఎల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రైమ్ వాలీబాల్ లీగ్(పీవీఎల్) నాలుగో సీజన్‌కు హైదరాబాద్ వేదిక కాబోతున్నది. స్థానిక గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా అక్టోబర్ 2వ తేదీ నుంచి లీగ్ మొదలుకానుంది. దీనికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో క్రీడా మంత్రి శ్రీహరి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ యజమాని అభిషేక్‌రెడ్డి, సాట్స్ ఎండీ సోనీబాలదేవి పాల్గొన్నారు. ఇదిలా ఉంటే లీగ్‌లో మొత్తం 38 మ్యాచ్‌లకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనుంది. లీగ్ మ్యాచ్‌లతో పాటె రెండు సెమీఫైనల్స్, ఫైనల్ కూడా ఇక్కడే జరుగనుంది. ఈ సీజన్‌లో గోవా గార్డియన్స్ రూపంలో కొత్త ఫ్రాంచైజీ అరంగేట్రం చేస్తుండటంతో జట్ల సంఖ్య పదికి చేరుకుంది.

నేటి నుంచే పీకేఎల్

వైజాగ్ వేదికగా 12వ సీజన్‌కు శ్రీకారం

విశాఖపట్నం: కబడ్డీ అభిమానుల నిరీక్షణకు తెరదించుతూ శుక్రవారం నుంచి ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్ మొదలుకానుంది. విశాఖపట్నం వేదికగా నేటి నుంచి ఆరంభం కాబోయే తొలి అంచె పోటీల్లో భాగంగా మొదటి మ్యాచ్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్.. తమిళ్ తలైవాస్ పోరుతో పీకేఎల్ తెరలేవనుంది. ఏడేండ్ల తర్వాత సాగరతీర నగరం వైజాగ్ ఆతిథ్యమిస్తున్న ఈ సీజన్‌లో నేడు.. బెంగళూరు బుల్స్, పుణెరి పల్టన్ సైతం తలపడనున్నాయి. ఆగస్టు 29 నుంచి సెప్టెంబర్ 11 దాకా వైజాగ్‌లో మ్యాచ్‌లు జరుగనున్నాయి.

ఇక 50% సుంకాలు

అమల్లోకి ట్రంప్ డబుల్ టారిఫ్‌లు

అమెరికా మార్కెట్‌లో భారమైన భారతీయ ఉత్పత్తులు

వజ్రాలు, రత్నాలు-ఆభరణాలు, వస్త్ర,రొయ్యలు, పాదరక్షల ఎగుమతులకు దెబ్బ.. ప్రమాదంలో ఉద్యోగాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: భారతీయ వస్తూత్పత్తులపై అమెరికా అదనపు టారిఫ్‌ల భారం రెట్టింపైంది. తన మాటను కాదని రష్యా నుంచి ముడి చమురును కొంటున్నందుకుగాను ఆగ్రహించి అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన జరిమానా సుంకాలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చేశాయి. దీంతో అమెరికాకు జరుగుతున్న భారతీయ ఎగుమతులపై సుంకాలు 50 శాతానికి చేరాయి. ఇప్పటికే తమతో వాణిజ్య ఒప్పందం ఆలస్యం పేరిట భారత్‌పై 25 శాతం ప్రతీకార సుంకాలను ట్రంప్ వేసిన విషయం తెలిసిందే. అయితే వీటికి అదనంగా ఇప్పుడు మరో 25 శాతం ఫైన్ టారిఫ్‌లు తోడయ్యాయి మరి. ఫలితంగా రొయ్యలు, టెక్స్‌టైల్, వజ్రాలు, రత్నాలు-ఆభరణాలు, పాదరక్షలు, తోలు తదితర ఎగుమతిదారులంతా తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ రంగాలపై ఆధారపడ్డ లక్షలాది ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తు ఆందోళనకరంగా తయారవడం గమనార్హం. అయితే భారతీయ వస్త్ర పరిశ్రమపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావాన్ని తగ్గించేందుకు 40 దేశాల్లో టెక్స్‌టైల్ ఎగుమతులను ప్రోత్సహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కొత్త మార్కెట్లను అన్వేషిస్తున్నట్టు పేర్కొంటున్నాయి. అలాగే పరిశ్రమ వర్గాలతో కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ సైతం సమావేశాలను నిర్వహిస్తున్నది. ఏ రకమైన మద్దతులిస్తే బాగుంటుందన్నదానిపై అభిప్రాయాలను సేకరిస్తున్నట్టు తెలుస్తున్నది. మరోవైపు ట్రంప్ టారిఫ్‌లతో ఇరు దేశాల సంబంధాలు సంక్లిష్టంగా మారిన నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులు సద్దుమణిగితే చివరకు భారత్-అమెరికా మళ్లీ కలిసే ముందుకెళ్తాయన్న ఆశాభావాన్ని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వ్యక్తం చేశారు.

ఇదీ సంగతి..

గత ఆర్థిక సంవత్సరం (2024-25) భారతీయ వాణిజ్య ఎగుమతులు మొత్తం 437.42 బిలియన్ డాలర్లుగా ఉంటే.. అమెరికా వాటానే దాదాపు 20 శాతం (86.5 బిలియన్ డాలర్లు)గా ఉన్నది. నిజానికి 2021-22 నుంచి భారత్‌కు అమెరికానే ప్రధాన వాణిజ్య భాగస్వామిగా ఉంటున్నది. ఈ క్రమంలోనే గత ఆర్థిక సంవత్సరం ఇరు దేశాల ద్వైపాక్షిక వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఇక తాజా టారిఫ్‌లు టెక్స్‌టైల్ రంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సుంకాలతో ధరలు అమెరికాలో పెరిగే వీలుందని, బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక, కంబోడియా, ఇండోనేషియా వంటి దేశాల ఉత్పత్తులకు డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయని ఎగుమతిదారులు చెప్తున్నారు. ఇదే జరిగితే భారతీయ వస్త్ర పరిశ్రమపై పెను ప్రభావమే ఉంటుందంటున్నారు. భారతీయ వజ్రాలు, రత్నాలు-ఆభరణాల ఇండస్ట్రీకి కూడా తుర్కియే, వియత్నాం, థాయిలాండ్ దేశాల నుంచి గట్టి పోటీ ఉండొచ్చని, ఆ దేశాలపై తక్కువ టారిఫ్‌లున్నాయని గుర్తుచేస్తున్నారు.

స్టాక్ మార్కెట్లలోనూ..

అమెరికా సుంకాల ప్రభావం దేశీయ స్టాక్ మార్కెట్లలోని ఆయా రంగాల షేర్లపై పెద్ద ఎత్తునే ఉండొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే టెక్స్‌టైల్స్, రత్నాలు-ఆభరణాలు, తోలు ఆధారిత కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోను కావచ్చని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. సముద్ర ఉత్పత్తులు, పాదరక్షలు, డైరీ, రసాయనాలు, ఎలక్ట్రికల్, మెకానికల్ మెషినరీ కంపెనీల షేర్లు సైతం సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కోవచ్చంటున్నారు. గురువారం ట్రేడింగ్‌లో కిటెక్స్ గార్మెంట్స్ షేర్ విలువ 5 శాతం పడిపోయింది. పియర్ల్ గ్లోబల్ ఇండస్ట్రీస్, సియారామ్ సిల్క్ మిల్స్, రేమాండ్ లైఫ్‌స్టైల్, అలోక్ ఇండస్ట్రీస్, రూప అండ్ కంపెనీ, వెల్‌స్పన్ లివింగ్, ట్రిడెంట్ షేర్లూ నిరాశపర్చాయి.

వ్యూహాత్మకంగానే: రాజన్

భారత్‌పై ఇంతటి భారీ స్థాయిలో అమెరికా సుంకాలు విధించడం వెనుక ఆ దేశాధ్యక్షుడి విస్తృత వ్యూహాత్మక విధానాలే ఉన్నాయని ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అభిప్రాయపడ్డారు. ఓ ప్రముఖ టెలివిజన్‌తో మాట్లాడుతూ.. టారిఫ్‌లను ట్రంప్ కేవలం వాణిజ్యపరమైన సాధనాలుగా మాత్రమే వాడట్లేదని.. వాటిని రాజకీయ, ఆర్థిక శక్తి వినియోగ సాధనాలుగా కూడా చూస్తున్నారని చెప్పారు. అమెరికన్లపై పన్నులు వేయడం కంటే ఇతర దేశాల నుంచి వచ్చే దిగుమతులపై పన్నులు వేసి ఆదాయాన్ని పెంచుకోవడం సులభమని ట్రంప్ భావిస్తున్నారన్నారు. అలాగే అమెరికా కరెంట్ ఖాతా లోటు, వాణిజ్య లోటును ఇతర దేశాలు లాభంగా మార్చుకుంటున్నాయన్న ఆలోచన కూడా ట్రంప్‌లో ఉండొచ్చని చెప్పారు.

పెట్టుబడులపై ప్రభావం

పెట్టుబడి నిర్ణయాలను అమెరికా సుంకాలు ప్రభావితం చేసే వీలుందని ప్రముఖ రేటింగ్స్ సంస్థ క్రిసిల్ హెచ్చరించింది. అలాగే రాబోయే రోజులు కార్పొరేట్లకు ఇబ్బందికర వాతావరణాన్నే సృష్టిస్తాయన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. కాగా, తాజా టారిఫ్‌లతో డైమండ్ పాలిషర్స్ ఈ ఆర్థిక సంవత్సరం 30 శాతం వరకు ఆదాయాన్ని కోల్పోయే వీలుందని క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. దేశీయ పరిశ్రమకు అమెరికాయే పెద్ద మార్కెట్‌గా ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. అయినప్పటికీ భారతీయ వజ్రాలకు అంతర్జాతీయ మార్కెట్‌లో గొప్ప డిమాండ్ ఉందని, అమెరికన్లు నాణ్యత విషయంలో రాజీపడబోరన్న ధీమాను పలువురు వజ్రాల వ్యాపారులు వ్యక్తం చేస్తున్నారు. కాబట్టి ధరల పెరుగుదల ప్రభావం తాత్కాలికమేనన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చుతున్నారు.

ఎవరేమన్నారు?

ప్రత్యామ్నాయ మార్కెట్లను వెతుక్కోకపోతే ట్రంప్ టారిఫ్‌లు భారత జీడీపీ వృద్ధిరేటును అర శాతం తగ్గించగలవు.
-జీకే పిళ్లై, మాజీ వాణిజ్య కార్యదర్శి

ఇకనైనా ఆసియా, ఐరోపా, ఆఫ్రికా దేశాల మార్కెట్లపై దృష్టిపెట్టాలి.
-హేమంత్, పీహెచ్‌డీసీసీఐ అధ్యక్షుడు

6 నెలల్లో 25% భారతీయ వస్త్ర ఎగుమతులు ప్రభావితం అవుతాయి.
-సీఐటీఐ, ఏఈపీసీ

50 శాతం సుంకాలు భారతీయ రత్నాలు-ఆభరణాల పరిశ్రమకు ఎదురుదెబ్బ.
-కిరిట్ భన్సాలీ, జీజేఈపీసీ చైర్మన్

అమెరికాకు భయపడి భారత ప్రయోజనాలను తాకట్టు పెట్టవద్దు.
-ఆర్‌సీ భార్గవ, మారుతీ సుజుకీ చైర్మన్

రాజకీయ దుమారం

అమెరికాలో భారతీయ వస్తూత్పత్తులపై దిగుమతి సుంకాలు 50 శాతానికి పెరిగిన నేపథ్యంలో మోదీ సర్కారుపై ప్రతిపక్షాలు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. ట్రంప్ టారిఫ్‌లను కేంద్ర ప్రభుత్వ విదేశీ విధాన వైఫల్యంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పేర్కొన్నారు. ఈ సుంకాల భారంతో కేవలం 10 రంగాల్లోనే 2.17 లక్షల కోట్ల నష్టాన్ని చూడాల్సి వస్తుందని మండిపడ్డారు. దేశంలో పెద్ద ఎత్తున నిరుద్యోగ సమస్య తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మొత్తంగా రైతులు, వ్యాపార-పారిశ్రామిక రంగాలు, ఉద్యోగులకు గట్టి ఎదురుదెబ్బగా అభిప్రాయపడ్డారు. అమెరికా సుంకాలు తమిళనాడు ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపిస్తాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. వేలాది ఉద్యోగులు రోడ్డునపడే ప్రమాదం ఉందని, కేంద్రం వెంటనే ఆదుకునే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)ల రుణగ్రహీతలకు రెండేండ్ల మారటోరియం ఇవ్వాలని, ఎగుమతిదారులకు ప్రోత్సాహకాలు ప్రకటించాలని మక్కల్ నీది మయ్యం పార్టీ వ్యవస్థాపకుడు కమల్ హాసన్ డిమాండ్ చేశారు. అలాగే ట్రంప్ టారిఫ్‌లకు ధీటుగా భారత్‌లోకి వచ్చే అమెరికా వస్తూత్పత్తులపైనా కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలను పెంచాలని ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్ అన్నారు. బీజేపీ ప్రభుత్వ వైఫల్యం వల్లే అమెరికా సుంకాల పెంపు అని ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ దుయ్యబట్టారు.

వాణిజ్య

బీవోబీ వడ్డీరేట్ల తగ్గింపు

ముంబై, ఆగస్టు 28: ప్రభుత్వరంగ సంస్థ బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) రుణ గ్రహీతలకు శుభవార్తను అందించింది. కార్లు, మార్ట్‌గేజ్ రుణాలపై వడ్డీరేటును పావు శాతం తగ్గించింది. రుణ పరిధికి మరింత ఊపునివ్వాలనే ఉద్దేశంతో బ్యాంక్ వడ్డీరేట్లను తగ్గించింది. ద్రవ్యోల్బణం సాకుగా చూపెడుతూ రిజర్వు బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచినప్పటికీ బీవోబీ వడ్డీరేట్లను తగ్గించడం విశేషం. ప్రస్తుత పండుగ సీజన్‌లో రుణాలను తీసుకునేవారికి ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ ముదలియర్ తెలిపారు. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో కార్లపై వడ్డీరేటు 8.40 శాతం నుంచి 8.15 శాతానికి దించింది. నూతన కార్లను కొనుగోలు చేసేవారికి, క్రెడిట్ ప్రొఫైల్ ఆధారంగా వీరికి ఈ వడ్డీరేటు వర్తించనున్నదన్నారు. అలాగే తాకట్టుకింద పెట్టే ఆస్తులపై ఇచ్చే రుణాలపై వడ్డీరేటును కూడా 9.15 శాతానికి తగ్గించింది. అంతకుముందు ఇది 9.85 శాతంగా ఉన్నది.

10 లక్షల కోట్ల సంపద ఆవిరి

వరుసగా రెండు రోజుల్లో నష్టపోయిన మదుపరులు

టారిఫ్‌ల దెబ్బకు కుప్పకూలిన స్టాక్ మార్కెట్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశీయ స్టాక్ మార్కెట్ల నష్టాల పరంపర కొనసాగుతున్నది. భారత ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాల విధింపు అమలులోకి రావడంతో సూచీలు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. వరుసగా రెండోరోజు గురువారం ఇంట్రాడేలో 800 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 705.97 పాయింట్లు కోల్పోయి 80,080.57 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 211.15 పాయింట్లు కోల్పోయి 24,500.90 వద్ద స్థిరపడింది. దీంతో వరుసగా రెండు రోజుల్లో సెన్సెక్స్ 1,555 పాయింట్లు నష్టపోవడంతో మదుపరులు పది లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. దీంతో బీఎస్‌ఈలో లిస్టైన కంపెనీల విలువ రూ.9,69,740.79 కోట్లు కరిగిపోయి రూ.4,45,17,222.66 కోట్లు(5.08 ట్రిలియన్ డాలర్లు)కు తగ్గింది.

- హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేరు 2.85 శాతం తగ్గి టాప్‌లూజర్‌గా నిలిచింది.

- దీంతోపాటు ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, మహీంద్రా, కోటక్ బ్యాంక్, టాటా మోటర్స్, ఎస్బీఐ, ఎన్టీపీసీ, ఐటీసీ, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి.
- టైటాన్, ఎల్‌అండ్‌టీ, మారుతి, యాక్సిస్ బ్యాంక్, రిలయన్స్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు పెరిగాయి.
- రంగాలవారీగా సర్వీసులు 2.27 శాతం నష్టపోగా, టెలికాం 1.73 శాతం, ఐటీ 1.68 శాతం, టెక్నాలజీ 1.59 శాతం, రియల్టీ 1.47 శాతం, యుటిలిటీ 1.26 శాతం చొప్పున పతనం చెందాయి.

రాష్ట్రంలో టోహో కోకి హబ్

హైదరాబాద్, ఆగస్టు 28(నమస్తే తెలంగాణ): జపాన్‌కు చెందిన టోహో కోకి సెయిసాకుషో సంస్థ.. రూ.8 కోట్ల వ్యయంతో భారత్‌లో తొలి సీఎంపీ ప్యాడ్ హబ్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించి గురువారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో టోహో కోకి సెయిసాకుషో, టీ-వర్క్స్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. జపాన్ సెమీకండక్టర్ సాంకేతిక పరిజ్ఞానానికి తెలంగాణ ముఖద్వారంగా అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. కీలకమైన కెమికల్, మెకానికల్ పాలిషింగ్ టెక్నాలజీని స్థానికంగా అందుబాటులోకి తెచ్చేందుకు టోహో కోకి ముందుకు రావడం, దేశంలోనే అతిపెద్ద ఫోటో టైపింగ్ కేంద్రం టీ-వర్క్స్‌ను భాగస్వామిగా ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేసారు.



జపనీస్ పరిశ్రమలు, అంకుర సంస్థలు, పరిశోధకుల కోసం టీ వర్క్స్ లో ప్రత్యేకంగా ఒక 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను నెలకొల్పనున్నట్టు శ్రీధర్ బాబు తెలిపారు. ప్రస్తుతం దేశంలో సీఎంపీ ప్యాడ్లను ఉత్పత్తి చేసే పరిశ్రమలు లేకపోవడం వల్ల ఏటా రూ.100 కోట్ల విలువైన దిగుమతులు చేసుకుంటున్నారు.

పడకేసిన పారిశ్రామికోత్పత్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 28: పారిశ్రామిక రంగం మళ్లీ పడకేసింది. జూలైలో 3.5 శాతం వృద్ధిని మాత్రమే కనబరిచింది. క్రితం ఏడాది 5 శాతంతో పోలిస్తే భారీగా తగ్గింది. కానీ, గడిచిన 4 నెలల్లో ఇదే గరిష్ఠం. తయారీ రంగం ఆశించిన స్థాయిలో 5.4 శాతం వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కారణమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. కానీ, మిగతా రంగాలు పడకేశాయి. ముఖ్యంగా గనులు మైనస్ 7.2 శాతానికి పడిపోయింది. విద్యుత్ రంగం కేవలం 0.6 శాతం వృద్ధిని కనబరుచగా, క్రితం ఏడాది ఇదే నెలలో ఇది 7.9 శాతంగా ఉన్నది. మొత్తంమీద ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూలై వరకు పారిశ్రామిక రంగం 2.3 శాతం మాత్రమే వృద్ధిని నమోదు చేసుకున్నది.

ఇంత బాధ్యతారాహిత్యమా?

జీఎస్టీ అధికారి తీరుపై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 28 (నమస్తే తెలంగాణ): వ్యాపారి చిరునామా మార్చుకుని ఐటీ రిటర్నులు దాఖలు చేస్తే, పాత అడ్రస్ ప్రకారం పన్ను చెల్లించడం లేదని ఎలా చెప్తారంటూ జీఎస్టీ వర్గాలను రాష్ట్ర హైకోర్టు ప్రశ్నించింది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీ అక్షయ ఆయిల్ రిఫైనర్ పార్ట్‌నర్‌గా ఉన్న తాను అడ్రస్ మార్పు చేసినప్పటికీ పాత అడ్రస్‌కు పన్నులు చెల్లించట్లేదని నోటీసు ఇచ్చారంటూ వ్యాపారి ఎం సుబ్బయ్య హైకోర్టును ఆశ్రయించారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దుతోపాటు రూ.3 కోట్ల బకాయిలను రాబట్టేందుకు బ్యాంకు ఖాతాను సీజ్ చేశారన్నారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ గౌస్ మీరా మొహియుద్దీన్లతో కూడిన ధర్మాసనం గురువారం విచారించింది. సోమాజిగూడ సర్కిల్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ వ్యక్తిగతంగా హాజరై అధికారుల పొరపాటు వల్ల జరిగిందంటూ క్షమాపణలు చెప్పారు. దీంతో బాధ్యుడైన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోర్టు చెప్పింది. పిటిషనర్‌కు ఇచ్చిన నోటీసులను రద్దు చేసింది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

తోడుగా..నా మూడు ముళ్లులాగా..

పవన్‌కల్యాణ్ 'ఓజీ' సినిమాపై మామూలుగానే అంచనాలు భారీగా ఉన్నాయి. అందుకు తగ్గట్టే ప్రమోషన్స్‌లో భాగంగా విడుదలవుతున్న ప్రచార చిత్రాలు సినిమాపై ఉన్న అంచనాలను అంతకంతకూ పెంచేస్తున్నాయి. మొన్నామధ్య విడుదలైన తొలి పాటైతే వ్యూస్‌లో రికార్డులను సృష్టించింది. తాజాగా వినాయకచవితి సందర్భంగా రెండో గీతాన్ని మేకర్స్ విడుదల చేశారు. 'సువ్వీ .. సువ్వీ..' అంటూ మొదలయ్యే ఈ పాట.. తొలిపాటకు పూర్తి భిన్నంగా రొమాంటిక్ మెలొడీగా సాగింది. 'ఉండిపోవ.. ఉండిపో ఇలాగా.. తోడుగా నా మూడుముళ్లలాగా.. నిండిపోవ నీడలాగ నీలాగా..' అంటూ నాయకానాయికల ప్రేమబంధాన్ని, లోతైన ఆత్మీయతనూ ఆవిష్కరించేలా కల్యాణచక్రవర్తి త్రిపురనేని ఈ పాటను రాయగా, తమన్ శ్రావ్యంగా స్వరపరిచారు. శృతి రంజని మధురంగా ఆలపించారు. పవన్‌కల్యాణ్, ప్రియాంక అరుళ్ మోహన్‌లపై కలర్‌ఫుల్‌గా ఈ పాటను దర్శకుడు సుజిత్ తెరకెక్కించారు. మాఫియా డాన్‌గా పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ మాస్ ఎంటర్టైనర్ వచ్చే నెల 25న విడుదల కానుంది. ఇమ్రాన్ హష్మీ, ప్రకాశ్‌రాజ్, శ్రియా రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రవి కె.చంద్రన్, మనోజ్ పరమహంస, నిర్మాతలు: డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి, నిర్మాణం: డీవీవీ ఎంటర్‌టైన్మెంట్స్.

సంక్రాంతికి రాజాసాబ్

ఎట్టకేలకు రాజాసాబ్ ఆగమనానికి రంగం సిద్ధమైంది. వచ్చే జనవరి 9న 'ది రాజాసాబ్'ని విడుదల చేయనున్నట్టు నిర్మాత టీజీ విశ్వప్రసాద్ విలేకరుల సాక్షిగా ప్రకటించారు. దీంతో డార్లింగ్ అభిమానుల్లో సంక్రాంతి సంబరాలు అప్పుడే మొదలైపోయాయి. పాన్ ఇండియా సూపర్‌స్టార్ ప్రభాస్ నటిస్తున్న తొలి హారర్ కామెడీ సినిమా 'ది రాజాసాబ్'. ఇక దర్శకుడు మారుతి ఈ తరహా సినిమాలు తెరకెక్కించడంలో సిద్ధహస్తుడని అందరికీ తెలిసిందే. దానికితోడు మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్.. ముగ్గురు అందాలభామలు. మరోవైపు సంజయ్‌దత్.. ఇన్ని ప్రత్యేకతలతో వస్తున్న 'ది రాజాసాబ్' అసలు సిసలు సంక్రాంతి సినిమా అని ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. సంజయ్‌దత్ ఇందులో భూతంగా కనిపిస్తారని సమాచారం. ప్రభాస్, సంజయ్‌దత్ కాంబినేషన్ సీన్స్ ఆడియన్స్‌ని కడుపుబ్బ నవ్విస్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇదిలావుంటే.. చిరంజీవి 'మన శంకరవరప్రసాద్‌గారు' కూడా వచ్చే సంక్రాంతికే రానుంది. అలాగే.. దళపతి విజయ్ 'జననాయకుడు' కూడా అదే డేట్‌లో రానున్నదని సమాచారం. దీనిబట్టి చూస్తే.. రేపు సంక్రాంతి జాతర సామాన్యంగా ఉండదు.

వింటేజ్ వరప్రసాద్

అగ్ర నటుడు చిరంజీవి మాస్, యాక్షన్ సినిమాలకు కాస్త బ్రేక్‌నిచ్చారు. తనదైన శైలి వింటేజ్ కామెడీతో 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం ద్వారా ప్రేక్షకులకు కావాల్సినంత వినోదాన్ని పంచడానికి సిద్ధమవుతున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ నెలకొని ఉంది. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ సినిమా నుంచి చిరంజీవి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన సంప్రదాయ పంచెకట్టులో మెరిసిపోతున్నారు. ట్రెడిషనల్ టచ్‌తో పాటు చిరంజీవి తనదైన స్వాగ్‌తో ఆకర్షణీయంగా కనిపిస్తున్నారు. దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన శైలి హాస్యం, ఫ్యామిలీ ఎలిమెంట్స్ కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని, ఇందులో వింటేజ్ చిరంజీవిని చూడబోతున్నారని, బ్లాక్‌బస్టర్ హిట్ పక్కా అని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, నిర్మాణ సంస్థ: షైన్‌స్క్రీన్స్ అండ్ గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్మెంట్స్, నిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

మైసూరులో పెద్ది ఆటపాట

'పెద్ది' పాత్ర పోషణకోసం.. తానే ఓ శిల్పిగా మారి, తనకు తాను చెక్కుకుంటున్నారు రామ్‌చరణ్. ఆ పాత్రకు కావాల్సిన దేహ దారుఢ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారాయన. అందుకోసం ప్రత్యేకంగా శిక్షణ కూడా తీసుకుంటున్నారు. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాను మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పీక్స్‌కు తీసుకెళ్లాయి. ప్రస్తుతం మైసూర్‌లో రామ్‌చరణ్ మీద ఒక గ్రాండ్ సాంగ్ షూట్ స్టార్ట్ చేశారు. జానీ మాస్టర్ కొరియోగ్రఫీ చేస్తున్న ఈ పాటను ఏ.ఆర్.రెహమాన్ స్వరపరిచారు. రామ్‌చరణ్‌తోపాటు వెయ్యిమందికి పైగా డాన్సర్లతో చిత్రీకరిస్తున్న ఈ పాట విజువల్ ఫీస్ట్‌లా ఉంటుందని, రామ్‌చరణ్ తన ట్రేడ్ మార్క్ ఎనర్జీ, గ్రేస్‌తో చేసిన మాస్ స్టెప్పులు ఈ పాటకు హైలైట్‌గా నిలుస్తాయని మేకర్స్ చెబుతున్నారు. జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కన్నడ అగ్ర నటుడు శివరాజ్‌కుమార్ పవర్‌ఫుల్ రోల్ పోషిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.రత్నవేలు,.

తను పక్కన లేకుంటే నిద్ర పట్టేదికాదు

'ఓ దశ వరకూ తల్లిదండ్రుల సహకారం ప్రతి ఒక్కరికీ అవసరమే. ఈ విషయంలో ఎవరూ మినహాయింపు కాదు..' అంటున్నారు అందాలభామ శ్రీలీల. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన తల్లితో తనకున్న అనుబంధాన్ని వివరించారామె. అలాగే కెరీర్ పట్ల తాను తీసుకున్న కొత్త నిర్ణయాన్ని కూడా తెలియజేశారు. 'చాలా చిన్న వయసులో నటిని అయ్యాను. ఆ టైమ్‌లో సినిమా ప్రపంచం ఎలా ఉంటుందో నాకు తెలీదు. అందుకే నాతో పాటు అమ్మ కూడా లొకేషన్‌కి వచ్చేది. అలాగే నా కథలు కూడా అమ్మే వినేది. నా సినిమాలను కూడా అమ్మే నిర్ణయించేది. ఈ కారణంగా ఆమె కెరీర్ చాలా నష్టపోయింది. ప్రస్తుతం నేను ఈ స్థాయిలో ఉన్నానంటే కారణం మా అమ్మ. కొన్ని నెలల క్రితం వరకూ కూడా అమ్మ పక్కన లేకుండా నిద్రపోయేదాన్ని కాదు. ఇప్పుడిప్పుడే సోలో లైఫ్ అలవాటు చేసుకుంటున్నా. అది కూడా అమ్మ నిర్ణయమే. ఎప్పుడూ ఒకరిపై ఆధారపడ కూడదు అనేది అమ్మ ఫిలాసఫీ. నిజానికి ఇకపై నిర్ణయం నాదే అయినా.. ఫైనల్ డెసిషన్ మాత్రం అమ్మదే. వృత్తిపరంగా, వ్యక్తిగతంగా నా ప్రయాణాన్ని నేను చక్కబెట్టుకోవాలనేది అమ్మ ఆకాంక్ష. ఓ విధంగా మా అమ్మ నా బాధ్యతను పెంచింది.'అంటూ శ్రీలీల చెప్పుకొచ్చారు. రవితేజతో ఆమె నటించిన 'మాస్ జాతర' చిత్రం త్వరలో విడుదల కానుంది. అలాగే పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ గబ్బర్‌సింగ్'లోనూ శ్రీలీలే కథానాయిక. హిందీలో కూడా ఓ సినిమా చేస్తూ బిజీగా ఉన్నాది ఈ తెలుగందం.

దునియాలో ఏదీ నీది కాదు

తేజ సజ్జా కథానాయకుడిగా సూపర్‌హీరో కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. సెప్టెంబర్ 12న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో సూపర్‌యోధ పాత్రలో కనిపించారు తేజ సజ్జా. విధ్వంసక శక్తి నుంచి మావవాళిని రక్షించడం అతని విధి. దైవిక బలాన్ని పొందిన అతను చేసిన సాహసాలతో ట్రైలర్ ఆద్యంతం థ్రిల్లింగ్‌గా సాగింది. 'దునియాలో ఏదీ నీది కాదు' 'నా గతం నక్షత్రం.. నా ప్రస్తుతం ఊహాతీతం' వంటి సంభాషణలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సందర్భంగా తేజ సజ్జా మాట్లాడుతూ..ఈ సినిమాలో ఎన్నో గూజ్‌బంప్స్ మూమెంట్స్ ఉంటాయని, ఒక తల్లి కోసం కొడుకు ఎంత దూరం వెళ్లాడన్నదే కథలో ప్రధానాంశమని తెలిపారు. అశోకుడు రాసిన తొమ్మిది పుస్తకాల గురించి ప్రపంచానికి చెప్పాలనే సంకల్పంతో దర్శకుడు ఈ కథను రాశాడని మంచు మనోజ్ అన్నారు. ఈ సినిమాలో తాను కథానాయకుడి తల్లి పాత్రలో కనిపిస్తానని శ్రియ శరణ్ తెలిపింది. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.

ఎల్లమ్మ కథానాయకుడిగా కార్తీ?

'బలగం' సినిమాతో పదికాలాలు గుర్తిండిపోయే గొప్ప విజయాన్ని అందుకున్నారు నటుడు, దర్శకుడు వేణు యెల్దండి. తన నెక్ట్స్ సినిమాగా ఆయన 'ఎల్లమ్మ'ని ప్రకటించడంతో షూటింగ్ ప్రారంభించకముందే సినిమా చర్చనీయాంశమైంది. ఇందులో హీరోగా నితిన్ నటించనున్నట్టు ఎనాడో ప్రకటించారు. అయితే.. ప్రస్తుతం లెక్కలు మారినట్టు తెలుస్తున్నది. ఈ సినిమా బడ్జెట్ 70కోట్లకు తేలడంతో మార్కెట్‌ను దృష్టిలో పెట్టుకొని పాన్ ఇండియా స్టార్‌తో వెళ్లాలని నిర్మాత దిల్ రాజు భావిస్తున్నారట. ఇందులో భాగంగా తమిళ, తెలుగు భాషల్లో క్రేజ్ ఉన్న హీరో కార్తీని సంప్రదించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు సమాచారం. ఇందులో కథానాయిక 'ఎల్లమ్మ' పాత్రకు సాయిపల్లవి, కీర్తిసురేశ్ ఇద్దరిలో ఒకర్ని ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ సినిమాకు చెందిన అధికారిక ప్రకటన త్వరలో రానుంది.

సముద్రం మాఫియా నేపథ్యంలో 'మకుటం'

విశాల్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'మకుటం'. ప్రముఖ నిర్మాణ సంస్థ సూపర్‌గుడ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 99వ చిత్రమిది. ఆర్.బి.చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి రవి అరసు దర్శకత్వం వహిస్తున్నారు. దుషార విజయన్, అంజలి కథానాయికలుగా నటిస్తున్నారు. బుధవారం ఈ సినిమా నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో విశాల్ మూడు డిఫరెంట్ లుక్స్‌లో కనిపిస్తున్నారు. యంగ్, మిడిల్ ఏజ్, ఓల్డేజ్ లుక్‌తో ఈ పోస్టర్ కథపై ఆసక్తినిరేకెత్తించేలా ఉంది. సముద్ర మాఫియా నేపథ్యంలో ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, దర్శకత్వం: రవి అరసు.

ఎస్వీ కృష్ణారెడ్డి కొత్త సినిమా 'వేదవ్యాస్'

సీనియర్ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో, ఆయన 43వ సినిమాగా 'వేదవ్యాస్' చిత్రం రూపొందుతున్నది. కె.అచ్చిరెడ్డి సమర్పణలో సాయిప్రగతి ఫిల్మ్స్ పతాకంపై కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి.వి.వినాయక్ క్లాప్ ఇవ్వగా, నిర్మాత జెమినీ కిరణ్ కెమెరా స్విచాన్ చేశారు. ఇందులో కథానాయికగా నటిస్తున్న సౌత్ కొరియా నటి జున్ హ్యూన్‌జీకి ప్రముఖ నిర్మాత దిల్‌రాజు 'హలో కంగ్రాట్యులేషన్స్ అండ్ వెల్కమ్ టు టాలీవుడ్' అంటూ బొకే అందించగా, ఆమె బొకే అందుకొని 'థాంక్యూ సార్..' అనడాన్ని ముహూర్తపు షాట్‌గా చిత్రీకరించారు. ఈ షాట్‌కు దర్శకుడు అనిల్ రావిపూడి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అతిథులంతా చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'తెలుగుమూవీలో తొలిసారి ఓ కొరియన్ హీరోయిన్‌ని పరిచయం చేస్తున్నాం. జున్ హ్యూన్ జీ మా సినిమాలో భాగం అవ్వడం మా అందరికీ గొప్ప అవకాశం. అందరూ మెచ్చేలా ఈ సినిమా రూపొందిస్తాం.' అని ఎస్వీ కృష్ణారెడ్డి చెప్పారు. మురళీమోహన్, సుమన్, సాయికుమార్, మురళీశర్మ, అజయ్‌ఘోష్, రఘుబాబు, పృథ్వీ, రాజశ్రీ నాయర్, విద్యుల్లేఖ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి కెమెరా: శరత్, కథ, కథనం, మాటలు, సంగీతం, దర్శకత్వం: ఎస్వీ కృష్ణారెడ్డి.

తాంత్రిక శక్తులకు ప్రతీక

సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సూపర్ నేచురల్ మైథలాజికల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్ ఇండియా చిత్రానికి వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వం వహిస్తున్నారు. మానవుడికి, దైవానికి మధ్య జరిగే సంఘర్షణ ఇతివృత్తంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో శోభ అనే పాత్రలో సీనియర్ నటి శిల్పా శిరోద్కర్ నటిస్తున్నది. గురువారం ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె హోమగుండం ముందు కూర్చొని ఉగ్రరూపంలో కనిపిస్తున్నది. ఆమె ప్రజెన్స్ తాంత్రిక శక్తులకు ప్రతీకలా ఉంది. అద్భుతమైన గ్రాఫిక్స్ హంగులతో మిస్టిక్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని, శిల్పా శిరోద్కర్ పాత్ర కథాగమనంలో కీలకంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. జీ స్టూడియోస్, ఎస్కేజీ ఎంటర్‌టైన్మెంట్ పతాకాలపై ఉమేష్‌కుమార్ బన్స్, శివిన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేర్నా అరోరా, శిల్పా సింగాల్, నిఖిల్ నందా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

14వ శతాబ్దం నాటి కథ

14వ శతాబ్దానికి చెందిన కథాంశంతో తమిళ, తెలుగు భాషల్లో రూపొందిస్తున్న చిత్రం 'ద్రౌపతి–2'. రిచర్డ్ రిషి, రక్షణ ఇందుసుదన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మోహన్ జి. దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుపుకుంటున్నది. దక్షిణాదికి చెందిన హోయసాల చక్రవర్తి మూడవ వీర వల్లలార్, సేంధమంగలాన్ని పాలించిన కడవరాయుల రాజులు వీరత్వాన్ని, ధైర్యసాహసాలను ఈ చిత్రంలో ఆవిష్కరిస్తున్నామని, మొఘల్ రాజులకు వ్యతిరేకంగా వారు చేసిన పోరాటం ప్రధాన ఇతివృత్తంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. అధికభాగం షూటింగ్‌ను ముంబయిలో జరుపుతున్నామని, కొంతపార్ట్‌ను తిరువణ్ణామలై, కేరళలో తెరకెక్కిస్తామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రాన్ని ఈ సంవత్సరాంతంలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఒగ్గు కళాకారుల కథ

ఒగ్గు కళాకారుల నేపథ్య కథాంశంతో రూపొందించిన చిత్రం 'బ్రహ్మాండ'. ఆమని, బలగం జయరాం, కొమరక్క, బన్నీ రాజు ప్రధాన పాత్రధారులు. రాంబాబు దర్శకత్వంలో దాసరి సురేష్ నిర్మించారు. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఇటీవల ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నేపథ్యంలో చక్కటి ఆధ్యాత్మిక అంశాలు కలబోసిన చిత్రమిదని, తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని ఆమని తెలిపారు. ఆమని నటన సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాత దాసరి సురేష్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వరికుప్పల యాదగిరి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రాంబాబు.

గప్ చుప్ గణేశా..

మొహమాటం తీసుకొచ్చిన ఇబ్బందులే ప్రధాన ఇతివృత్తంగా రూపొందుతున్న కామెడీ ఎంటర్టైనర్ 'గప్ చుప్ గణేశా'. రోషన్, రిదా జంటగా నటిస్తున్నారు సూరి.ఎస్ దర్శకుడు. కె.ఎస్.హేమ్రాజ్ నిర్మాత. త్వరలో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. నిర్మాత కె.ఎల్.దామోదరప్రసాద్ ట్రైలర్‌ని లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. ట్రైలర్ ఆద్యంతం వినోదాత్మకంగా సాగింది. అన్ని వర్గాలకూ నచ్చే సినిమా ఇదని దర్శక, నిర్మాతలు చెప్పారు. ఈ చిత్రంలో భాగం కావడం పట్ల హీరోహీరోయిన్లు ఆనందం వెలిబుచ్చారు. అంబటి శ్రీనివాస్, గడ్డం నవీన్, అశోక్ వర్ధన్, సోనాలి పాణిగ్రహి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అంగత్ కుమార్, సంగీతం: శ్రీతరుణ్.